ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ యం.రామకృష్ణ**
**డా॥ తుమ్మూరి**
**కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 1**
**ఏప్రిల్ 2004**
**తారణ : చైత్రం- వైశాఖం**
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**

## సాధన నుండి సిద్ధి

సాధన చేశాము. కాని సిద్ధి లభించలేదు. తపస్సు చేశాము. కాని తృప్తి లభించలేదు. పలువురు సాధకుల మనస్తాపం ఇదే. సంవత్సరాల తరబడి సాధన చేసిన తర్వాత వారిలో అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. సాధన విజ్ఞానం బూటకమా? సాధన ప్రక్రియలలో ఏదైనా లోపం ఉందా? ఇలాంటి ప్రశ్నలు ముళ్లలా పలువురి అంతఃకరణలను వేధిస్తూ ఉంటాయి. నిరంతరంగా సాగే ఈ వేధింపు వల్ల వారి అంతరాత్మలు గాయపడతాయి. ఆ గాయాలు తీపు పెడుతూ ఉంటాయి. ఆ వేదన దుర్భరం అవుతుంది. దుస్సహం అవుతుంది. దారుణం అవుతుంది.

మహాయోగి గోరఖ్‌నాథుని యువ శిష్యుడిని ఇలాంటి వ్యథ విపరీతంగా వేధించింది. ఆ వేదన అతడి ముఖంలో స్పష్టంగా కానవచ్చింది. ఒక పిల్లకాలువ దాటి అతడు ఒక పొలం గట్టున హతాశుడై కూర్చుండిపోయాడు. ఆ పొలం నుండి గోరఖ్‌నాథుడు వస్తుండడం అతడికి కనిపించింది.

అతడు ఆయన పాదాలపై తల ఉంచి ప్రణామం చేశాడు. ఇలా అడిగాడు- "గురుదేవా ! సంవత్సరాల తరబడి నేను చేసిన సాధన ఎందుకు నిష్ఫలం అయింది? భగవంతుడు నన్ను ఇంతగా ఎందుకు కోపగించుకుంటున్నాడు?" మహాయోగి నవ్వారు. ఇలా అన్నారు -

నాయనా! నిన్న నేను ఒక తోటలోకి వెళ్లాను. అక్కడ పలువురు యువకులు ఉన్నారు. వానిలో ఒకనికి దాహం అయింది. అతను చేదను బావిలోకి వదిలాడు. బావి లోతుగా ఉంది. చేదను పైకి లాగడానికి అతడు ఎంతో శ్రమించవలసి వచ్చింది. కానీ పైకి వచ్చిన చేద ఖాళీగా ఉంది. సహచరులందరూ అతడిని హేళన చేసి నవ్వసాగారు.

నేను చూచాను. అది పేరుకు మాత్రం చేద. దానినిండా చిల్లులే. చేద నీళ్లలోకి వెళ్లింది. దానిలో నీళ్లు నిండాయి. అయితే ఆ చిల్లుల గుండా ఆ నీళ్లన్నీ కారిపోయాయి.

నాయనా ! సాధకుని మనస్సు స్థితి కూడా ఇలాంటిదే. చిల్లులు పడిన మనస్సుతో ఎంత సాధన చేసినా, ఆ చిల్లులు కారణంగా అతడికి సిద్ధి లభించదు. ఎంత తపస్సు చేసినా, తృప్తి లభించదు.

సిద్ధి, తృప్తి కావాలంటే, ముందు మనస్సుకు ఉన్న చిల్లులను మూసివేయి. నీలోని దోషాలను, దుర్గుణాలను తొలగించుకో.

మొదటిది సంయమనం. ఆ తర్వాత సాధన. అప్పుడే సిద్ధి. సాధన నుండి సిద్ధికి చేరడంలో ఉన్న పరమ రహస్యం ఇదే. మనస్సనే చేద చిల్లులు లేకుండా ఉంటే సాధన సిద్ధిని చేకూర్చుతుంది. మనస్సనే చేదలో చిల్లులు ఉంటే తపస్సు ఎంత జరిగినా తృప్తి ఉండదు. భగవంతుడు ఎన్నడూ ఎవరినీ కోపగించుకోడు. కావలసిందల్లా మనస్సనే చేద సవ్యంగా ఉండడమే. చిల్లులు లేకుండా ఉండడమే. బావి నీరు ఇవ్వడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. అది ఎన్నడూ నిరాకరించదు.

H H H

**మనిషి ఆయుష్షు వృక్షాల కృపపై ఆధారపడి ఉంటుంది.**

# విషయ సూచిక


**ముఖ చిత్రం : శంకర భగవత్పాదులు**

1. **సంపాదకీయం :**
   సాధన నుండి సిద్ధి 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **భాగవత బోధ :**
   సాధు సంత్‌లు జాతి నిర్మాతలు 4
5. **బోధ కథ :**
   నియమ పాలన మహిమ 8
6. **ముఖచిత్ర కథనం :**
   సమైక్యతా శంఖారావం ఆదిశంకరుల సందేశం 12
7. **సాధన విజ్ఞానం :**
   లోచూపు అలవరచుకో 14
8. **కుటుంబ నిర్మాణం :**
   బాల్యవివాహాల దుష్ఫలితాలు 16
9. **సమాజ నిర్మాణం :**
   కుల భేదం ఒక భయంకర శాపం 19
10. **బోధ కథ :**
    ప్రభువు సన్నిధిలో.... 22
11. **మహిళా జాగరణ :**
    ఈ యుగంలో జరిగే అద్భుతం 24
12. **సాధుసంత్‌ల జీవితాలు :**
    మహాయోగి తపోబలం 25
13. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 4**
    యమున నుండి గంగకు 28
14. **మాతాజీ దివ్య జీవనం : 6**
    యుగశక్తి ప్రాణప్రతిష్ఠ 31
15. **కృష్ణావతారం :**
    శిశుపాల వధ 35
16. **శతసూత్ర కార్యక్రమం : 51-60**
    దురాచారాలను నిర్మూలిద్దాం 38
17. **యుగ గీత :**
    జీవన్ముక్తికి రాచబాట 41
18. **వసంత పంచమి సంకల్పం :**
    2004, 2005లకు 14 కార్యక్రమాలు 42
19. **శాంతికుంజ్ సమాచారం :**
    పరమశివుడు పూర్ణ చైతన్యం
    డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ 46
20. **వార్తలు :**
    కృతయుగ అవతరణకు
    దివ్య సాధనం గాయత్రీ యజ్ఞం 47
    యువతరానికి అందిద్దాం
    సంస్కృతీ సౌరభాన్ని 48


# ఏప్రిల్, మే నెలలలో పర్వదినాలు

**ఏప్రిల్ :**

3 మహావీర జయంతి.
24 శంకరాచార్య జయంతి.
30 రామానుజాచార్య జయంతి.

**మే :**

4 బుద్ధ పూర్ణిమ.
13 హనుమజ్జయంతి.
29 గాయత్రీ జయంతి.
గంగా దశహర.
గురుదేవుల మహా ప్రయాణ దినం.

**వరకట్నం మహిళా జగత్తుకు దారుణ అవమానం**

# వేద మంత్రం

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతోస్తి న కర్మ లిప్యతే నరే ॥**

- యజుర్వేదం 40/2

**భావార్థం :** మనుష్యుడు తన జీవిత లక్ష్యాన్ని ప్రాప్తించుకొనుటకు ఏకైక ఉపాయం సదాచరణయే. మనము ధర్మమార్గంలో నడుస్తూ నూరు సంవత్సరములు జీవించాలని కోరుకొనెదముగాక.

**సందేశం :** మనుష్య జన్మ, పునర్జన్మ రెండూ అతని కర్మ. కర్మఫలం మీద ఆధారపడి ఉన్నాయి. జన్మ నుండి మరణం వరకు, శరీరమున్నంత వరకు జీవితం, జీవితమున్నంతవరకు శారీరక లేదా మానసిక కర్మ ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. కర్మ చేయకుండా ఒక క్షణం గడుపుట కూడా అసంభవం. మనుష్య జీవితం కర్మ చేయుట కొరకే లభించింది. ఆ కర్మ సత్కర్మ కావచ్చు, లేదా దుష్కర్మ కావచ్చు, అది వేరే విషయం.

విజ్ఞాన సంబంధమైన, అందరికీ తెలిసిన సిద్ధాంతమేమంటే ప్రతి క్రియకూ ప్రతిక్రియ ఉంటుంది, ప్రతి కార్యానికీ ఒక పరిణామం ఉంటుంది. సమస్త ప్రపంచం నిశ్చిత నియమాలు లేదా సిద్ధాంతాల మీద నడుస్తుంది. పరమేశ్వరుని ఈ జగత్తులో అరాజకత్వంకాక న్యాయం, నియమపాలన సామ్రాజ్యమున్నది. ఈ ప్రపంచంలో లోకహిత కార్యాలు చేస్తూ నూరు సంవత్సరాలు జీవించమని మనుష్యుని పరమేశ్వరుడు ఆదేశించాడు.

కానీ అతడు లోకహితం మరచి తన స్వార్థము, అహంకార పూర్తి దిశలో పనులు చేస్తున్నాడు. తదనుసారం వికారగ్రస్త పాప కర్మల ఫలాన్ని భోగిస్తూ దారుణ దుఃఖాన్ని ప్రాప్తించుకుంటున్నాడు.

అయితే మనం ఏలాంటి కర్మలు చేయాలనే ఆలోచన తలెత్తుతుంది. ప్రపంచానికి ఉపకారం చేయుట అంటే ఏమిటి? అసలు ఎందుకు చేయాలి? పైకి మనం ప్రపంచానికి ఉపకారం చేస్తున్నాము. వాస్తవమేమంటే మనం మనకే ఉపకారం చేసుకుంటున్నాము, ఇతరుల మేలులో మన మేలు కూడా ఉన్నది. ప్రపంచపు ఉన్నతిలో మన ఔన్నత్యం కూడా ఉన్నది. ప్రతి పని చేసేటప్పుడు మనకు ఈ సర్వోన్నత ఉద్దేశ్యమే ఉండాలి. ఇతరులకు సహాయం చేయుట ఒక సౌభాగ్యమని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే, పరోపకారేచ్ఛ సర్వోత్తమ ప్రేరణా శక్తి రూపంలో మన అంతఃకరణమంతా నిండి ఉంటుంది.

ఈ విధంగా చేసిన కర్మ స్వార్థరహితమగుటచే దానిని నిష్కామ కర్మ అంటారు. వాటి సఫలత లేదా అసఫలత మనుష్యుని అహంకారిగా చేయదు, దుఃఖాన్ని కలిగించదు. సఫలత కోసం కృషి పూర్తి మనసుతో తను చేయలేక పోయానని అసఫలతలో అనుకుంటాడు. దానిని రెట్టింపు పట్టుదలతో చేస్తాడు. ఈ విధంగా ఆ కర్మ మనుష్యుని కంటదు, మనుష్యుడు దానిపట్ల ఆసక్తిని కలిగిఉండడు. అతడు కేవలం తన కర్తవ్యంగా భావించి పురుషార్థాన్ని చేస్తాడు. తనకు స్వార్థం లేకపోవుట వలన ఆత్మవత్ సర్వభూతేషు భావన బలపడుతుంది. అందరి లాభములోనే తన లాభము కన్పిస్తుంది. ప్రపంచంలోని సుఖాలు, సౌకర్యాలు తానొక్కడే అనుభవించే బదులు పరస్పరం పంచుకొని తినుటలో ఆనందం వస్తుంది. జగత్తును ఈ విధంగా త్యాగపూర్వకంగా భోగించుటచే, తన సమస్త పనులను ఈశ్వరీయ కార్యాలలో నియోగించుటచే, ఆ కర్మలెప్పుడూ బంధకారకములు కావు. అటువంటి నిష్కామ కర్మ చేసేవారే ప్రపంచంలోని శ్రేష్ఠ నర రత్నములు. అందువలన మనుష్యుడు ఎల్లప్పుడూ అనాసక్త భావంతో త్యాగపూర్వక సత్కర్మలలో తన జీవితాన్ని సమర్పించుకోవాలి.

జీవన లక్ష్య ప్రాప్తికి ఇదొక్కటే ఉపాయం.

K K K

**తన దోషాలను తెలుసుకొనకపోవడాన్ని మించిన పొరపాటు లేదు.**

భాగవత బోధ

# సాధు సంత్‌లు జాతి నిర్మాతలు

మగధ రాజు కోసల రాజ్యంపై దాడి చేశాడు. మగధ సైన్యం ధాటిని చూసి కోసల రాజు పౌరులను నగరాన్ని ఖాళీ చేయవలసిందిగా ఆదేశించాడు. మగధ సైన్యం నగరాన్ని వశపరచుకోక ముందే పౌరులు వారి సామానులతో సహా నగరం నుండి బయటకి వెళ్లారు. కొద్దిమంది వ్యక్తులతో అంగరక్షక భటులతో పాటు కోసల రాజు మగధ సైన్యం ముట్టడిలో ఉండిపోయాడు. తనతో ఉన్న పదిమంది వ్యక్తులను క్షేమంగా వదలిపెడితే తాను తన అంగరక్షకులతో పాటు లొంగిపోతానని కోసల రాజు మగధ సేనానాయకునికి సందేశం పంపాడు. సేనానాయకుడు ఆ షరతుకు అంగీకరించాడు. రక్తపాతం లేకుండా కోసల రాజును బంధించి మగధ రాజు ఎదుట హాజరుపరచాడు.

మగధ రాజు జరిగిందంతా విన్నాడు. ఎవరి కోసం నీవు బందీ అయినావో ఆ పదిమంది ఎవరు అని కోసల రాజును అడిగాడు. వారు తమ రాజ్యంలో ప్రజాసేవ చేస్తున్న సంత్‌లు అని కోసల రాజు జవాబు చెప్పాడు. వారు సురక్షితంగా ఉంటే రాజ్యంలో ఆదర్శవాదులు, కర్తవ్య పరాయణులు అయిన వ్యక్తుల నిర్మాణం నిరాటంకంగా సాగుతుందని, ఫలితంగా మంచి పాలకులు కూడా తిరిగి జన్మిస్తారని ఆయన వివరించాడు. 'జాతిలోని శ్రేష్ఠ వ్యక్తిత్వం కలిగిన పౌరులే జాతికి నిజమైన సంపద. సమాజాన్ని పరమేశ్వరుని విరాట్ స్వరూపంగా పరిగణించి దానికి నిస్వార్థంగా సేవ చేసే ఆదర్శవాదులైన సంత్‌లే అలాంటి పౌరులను నిర్మాణం చేస్తారు. వారిని రక్షించడానికై ఎంతటి మూల్యాన్ని చెల్లించినా అది సముచితమే అవుతుంది'- అని కోసల రాజు విశదీకరించాడు.

ఈ మాటలు విన్న మగధ రాజు కోసల రాజును విడుదల చేశాడు. అతడి రాజ్యాన్ని అతడికి సగౌరవంగా తిరిగి అప్పగించాడు. ఆయన ఇలా అన్నాడు - 'ప్రజా శ్రేయస్సులో నిమగ్నులైన సత్పురుషులకు ఇంతటి విలువ ఇస్తున్న రాజ్యంలో పాలకులను మార్చడం అనవసరం. వారి నుండి మేము కూడా ప్రేరణ పొందాలి.'

వాస్తవానికి శ్రేష్ఠ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులే జాతి సాధన సంపత్తినీ, గౌరవాన్నీ పెంచగలుగుతారు. ప్రతిభలో, యోగ్యతలో సాటిలేని వారుగా ఉన్నప్పటికీ, తన వ్యక్తిగత అవసరాలను కనీస స్థాయిలో ఉంచుకుని, మిగతా శక్తి అంతటినీ జనహితం కోసం అంకితం చేసే వ్యక్తులు ఉన్న చోట సుఖశాంతులు, సమృద్ధి పొంగిపొరలుతాయి. అలాంటి వ్యక్తులను బ్రాహ్మణులనీ, సంత్‌లనీ, దేవతలనీ పిలుస్తారు. వారి వల్లనే భారత వర్షం విశ్వగురువుగా, దేవభూమిగా విఖ్యాతి పొందింది. కనుకనే వారికి అందరినీ మించిన గౌరవం ఇచ్చారు. శ్రీమద్ భాగవతంలో పరమ శివుడు మార్కండేయ మహర్షితో ఇలా అన్నాడు - 'మార్కండేయ మహర్షీ ! జలం ఉన్న తీర్థం మాత్రమే తీర్థం కాదు. రాతి విగ్రహాలు మాత్రమే దేవతలు కావు. అన్నింటినీ మించిన తీర్థాలూ, అందరినీ మించిన దేవతలూ మీవంటి సంత్‌లు. ఎందుకంటే - ఆ తీర్థాలూ, దేవతలూ మనుషులను పవిత్రం చేయడానికి చాలా రోజులు పడుతుంది. మీరు దర్శన మాత్రం చేత మనుష్యులను పవిత్రం చేస్తారు.'

తీర్థం అంటే అర్థం శ్రేష్ఠమైన సంస్కారాలను నిర్మాణం చేసే స్థలం, లేక సాధువు. నిజమైన సంత్‌లు తమ వ్యక్తిత్వం, అనుభవం ఆధారాలుగా కొద్ది సమయంలో ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చగల సమర్థులు. అలాంటి వ్యక్తుల సహవాసమే సత్సంగం.

విద్య, విజ్ఞానం, వ్యాయామం, వ్యాపారం వంటి ఏ రంగంలో అయినా మామూలు వ్యక్తుల సహకారం కన్నా ఆయా రంగాలలో నిపుణుల సహకారం ప్రగతి వేగాన్ని మరింతగా పెంచుతుంది. వ్యక్తులలో శ్రేష్ఠతను ఉత్పన్నం చేయడంలో కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. సత్పురుషుల సాంగత్యం ద్వారానే ప్రతి యుగంలో ప్రతి స్థాయికి చెందిన వ్యక్తి ఉన్నతోన్నత లక్ష్యాలను సాధించగలుగుతాడు. ఇదే వాస్తవాన్ని శ్రీకృష్ణుడు తన సఖుడైన ఉద్ధవునితో ఇలా వివరించాడు- 'ఓ ఉద్ధవా ! ఇది ఒక యుగం విషయం కాదు. అన్ని యుగాలకు వర్తించే సూత్రం. దైత్యులు, రాక్షసులు, పశువులు, పక్షులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, సిద్ధులు, చారణులు, గుహ్యకులు, విద్యాధరులు - అందరూ సత్సంగం ద్వారానే నన్ను పొందగలిగారు. మనుష్యులలో వైశ్యులు, శూద్రులు, స్త్రీలు, అంత్యజులు, రజోగుణం కలిగిన వారు, తమోగుణం కలిగిన వారు సత్సంగం ద్వారానే తమ పాపాలను క్షాళన చేసుకుని శ్రేష్ఠ పదాన్ని పొందారు.'

నారదునితో సత్సంగం వల్ల వాల్మీకి, ధృవుడు, ప్రహ్లాదుడు మున్నగు వారికి మార్గదర్శనం లభించింది. వారు గొప్పవాళ్లు అయినారు. చందన వృక్షం ప్రభావం వల్ల చుట్టుప్రక్కల ఉన్న వృక్షాలు సువాసనతో నిండుతాయి. ఇలా సత్సంగం కోసం నిరంతరం మెలకువతో ప్రయత్నించినట్లే, దుష్ట సాంగత్యం విషయంలో కూడా ఎంతో జాగ్రత్త వహించాలి. మనం మంచివాళ్లం కదా, చెడ్డవాళ్లతో స్నేహం మనల్ని ఎలా ప్రభావితం చేస్తుంది - అని అనుకుని అజాగ్రత్తగా ఉంటే మన శ్రేష్ఠత్వాన్ని కోల్పోవచ్చు. కనుకనే శ్రీకృష్ణుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు - 'విషయ సుఖాలలో, ఉదర పోషణలో మాత్రమే మునిగి ఉన్న అసురులతో ఎన్నడూ స్నేహం చేయకూడదు.

**రోగం, శోకం, పతనం, ప్రమాదం పాపంతోపాటు సంక్రమిస్తాయి.**

గ్రుడ్డివాని సహాయంతో నడిచే గ్రుడ్డివాని వలె అలాంటివారు దుర్గతి చెందుతారు. వారు చీకటిలోనే కొట్టుమిట్టాడుతారు. మామూలు వ్యక్తులు ఈ వాస్తవాన్ని గుర్తించాలి.'

చుట్టుప్రక్కల ఉండే వ్యక్తుల వ్యక్తిత్వపు ప్రభావం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని మనుషుల మీద పడుతుంది. మనిషి స్వభావం అలాంటిది. కనుకనే విజ్ఞత గల వ్యక్తులు శ్రేష్ఠ పురుషుల సాన్నిధ్యంలో ఉండాలనే కోరుకుంటారు. శ్రీకృష్ణుడు నారదాది మహర్షులకు ఇలా చెప్పాడు - ఓ ఋషివర్యులారా ! శ్రేష్ఠ జనుల సాంగత్యం వల్ల వ్యక్తిలోని గుణాల వికాసం సునాయాసంగా జరుగుతుంది. కనుక మీ సాధు సంతుల నుండి వెలువడే మాటలు వ్యక్తుల బుద్ధిని పదును పెడతాయని నేను భావిస్తున్నాను. వాటిని సత్పురుషులకు వినిపిస్తాను.

అయితే కేవలం వేషం వల్ల లేక పేరు వల్ల సంత్ అనీ, సన్యాసి అనీ పిలువబడే వ్యక్తి ఈ ప్రయోజనాన్ని ఇవ్వలేడు. పొట్ట నింపుకోవటం కోసం, పేరు ప్రతిష్ఠల కోసం సంత్‌ల వేషం వేసుకున్న వ్యక్తులకు దూరంగా ఉండవలసిందని శాస్త్రం నిర్దేశిస్తోంది. అలాంటి వ్యక్తులు పతితులు. తమ సంపర్కంలోకి వచ్చిన వారికి హాని కలిగిస్తారు. శ్రీకృష్ణుడు తన సఖుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు - మిత్రమా ! పంచేంద్రియాలను, మనస్సును జయించని వ్యక్తి, తన ఇంద్రియాలనే గుర్రాలను, బుద్ధి అనే సారథిని పాడు చేసుకున్న వ్యక్తి, జ్ఞానం కాని వైరాగ్యం కాని హృదయంలో నిలుపుకోని వ్యక్తి - త్రిదండి అయిన సన్యాసి వేషం వేసుకుని పొట్ట నింపుకుంటున్నప్పటికి అతడు సన్యాస ధర్మాన్ని భ్రష్టు పట్టించే వ్యక్తి. అతడు పూజ్యులైన తన దేవతలను, తనను, తన హృదయంలో ఉన్న నన్ను మోసగించే ప్రయత్నం చేస్తున్న వ్యక్తి. సన్యాసి వేషం ధరించినంత మాత్రాన వాసనలు క్షీణించవు. కనుక అతడు ఈ లోకాన్ని, పరలోకాన్ని కూడా కోల్పోతాడు.

గోస్వామి తులసీదాసు ఈ విషయమై ఇలా అంటారు - వాస్తవానికి సాధు సంత్‌లు అనే పేర్లు వేషాని కావు ప్రవృత్తివి. ప్రవృత్తి అది అయితే, వేషం ఎలా ఉన్నా పరవాలేదు. శ్రేష్ఠ వ్యక్తిత్వం కలిగి, సేవా పరాయణులైన వ్యక్తులలో ఇల్లు వదలి తిరుగుతూ ఉండేవారిని సాధువులనీ, సమాజంలోనే ఉండేవారిని బ్రాహ్మణులనీ పిలుస్తారు.

పరమశివుడు మార్కండేయ మహర్షికి బ్రాహ్మణుని ప్రవృత్తినీ, పనులనూ వర్ణిస్తూ ఇలా అన్నాడు - బ్రాహ్మణుడు స్వభావ రీత్యా పరోపకారి, శాంతచిత్తుడు, అనాసక్తుడు అయి ఉంటాడు. అతడు ఎవరి పట్ల శత్రుత్వం వహించడు. సమదర్శిగా ఉంటాడు. అయినా ప్రాణుల కష్టాలను చూసి వాటి నివారణ కోసం నిండు మనసుతో నిమగ్నుడు అవుతాడు. అతడు నన్ను అనన్యంగా ప్రేమిస్తాడు. అతడు నాకు అనన్య భక్తుడుగా ఉంటాడు.

సంత్‌లకు వలెనే బ్రాహ్మణులకు కూడా ప్రముఖ కార్యం సమాజాన్ని కళ్యాణ పథంలో ముందుకు నడిపించడం. గుణాలలో, ఆలోచనలలో, ఆచరణలో శ్రేష్ఠులుగా ఉన్న వ్యక్తులే ఇతరులకు ప్రయోజనం కలిగించగలుగుతారు. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు - ఎవరి చెవులు వేదాలు వినడం వల్ల పవిత్రం అయినాయో, ఎవడు ఇంద్రియాలను వశపరచుకున్నాడో, ఎవరు జీవహింసకు పూర్తిగా దూరంగా ఉంటాడో, ఎవడు దానం తీసుకోడానికి వెనుకాడతాడో, ఎవడు గృహస్థాశ్రమంలో ఉన్నాడో - ఆ బ్రాహ్మణుడు ఇతరులను తరింపచేయడానికి సమర్థుడు.

అలాంటి నిజమైన బ్రాహ్మణులు తమకు లభించిన వాటిని అన్నింటినీ లోకకళ్యాణం కోసం వినియోగిస్తారు. వారి సాంగత్యం వల్ల వారికి సహకరించడం వల్ల పుణ్యం వస్తుంది. అయితే వంశం ఆధారంగా, వేషం ఆధారంగా తనను తాను బ్రాహ్మణుడని చెప్పుకునే వ్యక్తి, తన ఆచరణ ఆ విధంగా లేని వ్యక్తి - అలాంటి వారిని గురించి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు - యుధిష్ఠిరా ! వీరంతా విషయలోలురు. వీరు తమను తాము ఉద్ధరించుకోలేరు. ఇతరులను ఉద్ధరించలేరు.

ఇలాంటి వ్యక్తుల సాంగత్యం వల్ల ఇతరులకు హాని కలుగుతుంది. పాపం చుట్టుకుంటుంది. తపస్సు, విద్యాధ్యయనాల ద్వారా తన శక్తినీ, యోగ్యతను పెంచుకోవడం బ్రాహ్మణునికి సముచితమైన పని. అయితే మనస్సునూ అంతఃకరణనూ నిర్మలంగా నిలుపుకోవడం మరింత ముఖ్యమైన విషయం. అంతఃకరణ పవిత్రంగా లేకపోతే తపస్సు, విద్య అనర్థాన్ని కలిగిస్తాయి. తపస్సు వల్ల విద్య వల్ల అతడికి శక్తి లభిస్తుంది. కానీ అంతఃకరణ సాత్వికంగా లేకపోతే ఆ శక్తి దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది.

దుర్వాస మహర్షి తపస్వి, విద్యావేత్త కూడా. కానీ ఆయన మనస్సులో క్రోధం ప్రచండంగా ఉంది. ఆ క్రోధావేశం ఆ శక్తి దుర్వినియోగానికి సైతం ప్రేరణ ఇస్తూ ఉండేది. ఆయన భక్త అంబరీషునిపై అకారణంగా కోపగించుకున్నాడు. తన తపోబలంతో ఆయనకు హాని చేయడానికి సైతం సిద్ధపడ్డాడు. భక్త అంబరీషుడు ఆయన కోపానికి చలించలేదు. అయితే విష్ణుమూర్తి ఈ అన్యాయాన్ని ఎలా సహించగలడు? ఆయన తన సుదర్శన చక్రాన్ని దుర్వాసుని మీద ప్రయోగించాడు. దుర్వాసునికి ఎక్కడా శరణు దొరకలేదు. చివరకి ఆయన అంబరీషుడినే క్షమించమని ప్రార్థించవలసి వచ్చింది. అన్యాయానికి దూరంగా ఉండమని దుర్వాసునికి ఉపదేశిస్తూ విష్ణుమూర్తి ఇలా అన్నాడు - బ్రాహ్మణుల తపస్సు, విద్య పర కళ్యాణానికి సాధనాలే. అయితే, బ్రాహ్మణులు అన్యాయం చేస్తే ఆ రెండూ వ్యతిరేక ఫలితాలను ఇస్తాయి.

వాస్తవానికి నిజమైన బ్రాహ్మణుడు ఎన్నడూ అన్యాయం చేయలేడు. అతడు అన్యాయాన్ని సహించలేడు కూడా. వేన రాజు మరణం తర్వాత రాజ్యంలో అరాచకం వ్యాపించింది. నలుగడలా అన్యాయం రాజ్యమేలింది. ఎప్పుడూ బలహీనులూ, హీనులూ, దీనులూ, పీడితులపైనే అన్యాయం హెచ్చుగా జరుగుతూ ఉంటుంది.

**పచ్చని చెట్టును నరకడం నరహత్యతో సమానం.**

పాలకుల అన్యాయాలకూ దీనులే బలి అవుతూ ఉంటారు. ఆనాడు కూడా అదే జరిగింది. బ్రాహ్మణులు స్వభావ రీత్యా శాంతిప్రియులు, సమధర్ములు. అయితే అన్యాయాన్ని వ్యాపించనిస్తే అది పెరిగిపోతూ ఉంటుందని వారు గుర్తించారు. అన్యాయాన్ని సహించడమూ పాపమే. అన్యాయాన్ని ఎదిరించకపోవడమూ పాపమే. ఆనాడు ఆ బ్రాహ్మణులు సమావేశమై తమ కర్తవ్యాన్ని స్మరించుకుని ఇలా అన్నారు - బ్రాహ్మణులు సమధర్ములూ, శాంతిస్వభావులూ అయినప్పటికీ అన్యాయాన్ని, అవినీతినీ ఉపేక్షించడం వల్ల వారి తపస్సు పగిలిన కుండ నుండి నీళ్ల కారిపోయినట్లుగా నశించిపోతుంది.

తపస్సు ఒక ఈశ్వరీయ శక్తి. అది పాత్రత కలిగిన వారికే లభిస్తుంది. పీడితులను, దుఃఖితులను అన్యాయాల నుండి విముక్తి చేయడంలో దానిని వినియోగించకపోతే దానిని పొందిన వ్యక్తి పాత్రత క్షీణిస్తుంది. ఆ శక్తి నశించిపోతుంది. తమ దివ్య సామర్థ్యాలను సమాజంలో సమతూకాన్ని నిలిపి ఉంచడానికై వినియోగించడం శ్రేష్ఠ పురుషుల కర్తవ్యం. బ్రాహ్మణులు కూడా తన అవసరాలను వీలైనంత తక్కువ సాధనాలతో పూర్తి చేసుకుని తమ సమయమంతటినీ జనమానసాన్ని సంస్కరించడంలో, దానిని ఆదర్శం వైపు మళ్లించడంలో వినియోగించేవారు. కనుకనే తమ జ్ఞానాన్ని, యోగ్యతను బేరం పెట్టడం ఘోరమైన తప్పిదమని వారు భావించేవారు.

విశ్వరూపుడు అలాంటి ఒక బ్రాహ్మణుడు. పురోహితుడిగా పని చేయవలసినదనీ, అందుకు ప్రతిఫలంగా ఆయనకు సుఖసౌకర్యాలన్నీ కల్పిస్తామని దేవతలు ఆయనను కోరారు. ఆయన అందుకు అంగీకరించలేదు. ఆయన ఇలా అన్నారు - మేము అకించనులము. పంటకు కోతలు జరిగిన తర్వాత, లేదా కుప్పలు నూర్చిన తర్వాత పొలంలో మిగిలి ఉన్న కొద్ది ధాన్యపు గింజలను ఏరుకుని తెచ్చుకుంటాము. దానితోనే మా దేవకార్యం, పితృకార్యం ముగించుకుంటాము. లోకపాలకులారా ! ఇలా నా జీవితం గడిచిపోతున్నపుడు-పౌరోహిత్యమనే నిందనీయమైన పనిని నేను ఎందుకు చేయాలి? బుద్ధి వక్రించిన వారు మాత్రమే అలాంటి పనులకు ఇష్టపడతారు.

ఈ మాట సమాజ సేవకుల ఆదర్శాన్ని స్పష్టం చేస్తోంది. సత్పురుషులు తమ శరీర అవసరాలను శ్రమ ద్వారానే తీర్చుకోవాలి. యోగ్యతకు, జ్ఞానానికి, ఇతర సామర్థ్యాలకు బదులుగా సమాజం నుండి ఏమీ తీసుకోకూడదు. ఇదీ ఆదర్శం. పౌరోహిత్యంలో జ్ఞానానికి ధర వసూలు చేయడం జరుగుతుంది. తమ అవసరాలను పరిమితం చేసుకోలేని వారు ఇలా చేస్తారు. ప్రాపంచికమైన పేరు ప్రతిష్ఠలు వారికి అవసరం అనిపిస్తాయి. కనుకనే 'బుద్ధి వక్రించినపుడే పౌరోహిత్యం ఒక వృత్తిగా మార్చబడుతుంది'- అని విశ్వరూపుడు స్పష్టం చేశాడు.

ఇలా జ్ఞానానికి ధర తీసుకోవడం తప్పుగా భావించబడింది. బ్రతుకు దెరువు కోసం బిచ్చం ఎత్తడం మరీ తప్పు. అది నీచ కార్యమని శాస్త్రాలు చెప్పాయి. బ్రాహ్మణుడనని చెప్పే శ్రేష్ఠ వ్యక్తి ఈ పని ఎన్నడూ చేయకూడదు. ఆపద సమయంలో అతడు ఏమి చేయాలి? దానికి పరిమితులను పేర్కొంటూ శ్రీకృష్ణుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు - బ్రాహ్మణుడు అధ్యాపకత్వం ద్వారా, యజ్ఞయాగాదుల ద్వారా బ్రతుకుదెరువు సాగించలేకపోతే, అతడు వైశ్య వృత్తిని ఆశ్రయించాలి. ఆ ఆపద తొలిగే వరకు ఆ పని చేయాలి. మరింత ఘోరమైన విపత్తు సంభవిస్తే అతడు కత్తి పట్టి క్షత్రియ వృత్తి ద్వారా జీవించవచ్చు. కానీ ఎట్టి పరిస్థితిలోనూ అతడు నీచ కార్యాలు చేయకూడదు.

వ్యక్తుల ఆలోచనలను, ఆచరణలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బ్రాహ్మణుల కార్యం వర్ణవ్యవస్థలో అన్నిటికన్నా శ్రేష్ఠమైనదిగా పరిగణించబడింది. అతడు తన అంతఃప్రేరణ ఆధారంగానే ఏ పని అయినా స్వీకరించగలుగుతాడు. బ్రతుకుదెరువు సాగనపుడు తన పరిస్థితిని బట్టి మనిషి తన అభిరుచికి, పరిస్థితికి అనుగుణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలను అనుసరించేవాడు. వంశ పారంపర్యంగా కూడా ఈ వర్ణాలను నిర్వహించేవారు. ఎందుకంటే ఒక ఇంటిలోని పిల్లలు ఆ పనిని చిన్నతనం నుండి అర్థం చేసుకుంటారు. నేర్చుకుంటారు.

అయితే తన యోగ్యతకూ, అభిరుచికి అనుగుణంగా ఆ వర్ణాన్ని మార్చుకునే స్వేచ్ఛ వ్యక్తికి ఉండేది. ఇందుకు అనేక ఉదాహరణలు వినిపిస్తూ శుక మహర్షి పరీక్షిత్తు మహారాజుకు కొన్ని వాస్తవాలు చెప్పాడు. ఆయన ఇలా అన్నారు -

ధృష్టునికి ధార్ష్టుడనే క్షత్రియుడు జన్మించాడు. చివరికి అతడు ఆ శరీరంతోనే బ్రాహ్మణుడు అయినాడు.

నృగుని కుమారుడు సుమతి. అతని కుమారుడు భూతజ్యోతి. భూతజ్యోతి కుమారుడు వసువు. వసువు కూడా బ్రాహ్మణుడు అయినాడు. దేవతగా పిలువబడ్డాడు.

జైనమత ప్రవర్తకుడు, ప్రథమ తీర్థంకరుడు అయిన శ్రీఋషభదేవునికి వందమంది కుమారులు. వారిలో ఒకరైన బాహుబలి జైన పరివ్రాజకత్వం స్వీకరించాడు. ఋషభదేవ భగవానుని మిగతా 99 మంది పుత్రులలో తొమ్మిది మంది ఈ భరతవర్షంలో అన్నివైపులా ఉన్న తొమ్మిది ద్వీపాలకు అధిపతులు అయినారు. మిగిలిన పుత్రులు కర్మకాండలు జరిపే బ్రాహ్మణులు అయినారు.

మన్యు పుత్రుడు గర్గుడు. అతని పుత్రుడు శని. శనికి గార్గ్యుడు జన్మించాడు. గార్గ్యుడు క్షత్రియుడు. అయినా అతని నుండి బ్రాహ్మణ వంశం ఏర్పడింది.

మహావీర్యుని పుత్రుడు దురితక్షయుడు. దురితక్షయునికి

**సజ్జనునివలె వృక్షం పరోపకారంలో మునిగి ఉంటుంది.**

పుత్రులు ముగ్గురు - త్యారుణి, కవి, పుష్కరారుణి. వారు ముగ్గురూ బ్రాహ్మణులు అయినారు.

బృహక్షత్రుని పుత్రుడు హస్తి. అతడే హస్తినాపురాన్ని నిర్మించాడు.

*గాధి మహారాజు పుత్రుడు జ్వలించే అగ్నివలె పరమ తేజస్వి అయిన విశ్వామిత్రుడు. ఆయన తన తపోబలం వల్ల క్షత్రియత్వాన్ని వదలి బ్రహ్మతేజాన్ని పొందాడు. అయితే ఆ పరివర్తన ఎవరికి నచ్చిన తీరులో వారు జరుపుకునే వారు కారు. అందుకోసం కొన్ని గీటురాళ్ళు ఏర్పరచబడి ఉండేవి. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి పదవికి అనుగుణంగా మారాడా లేదా అని నిర్ణయించే బాధ్యత వశిష్ఠ మహర్షికి అప్పగించబడింది. విశ్వామిత్రుడు ప్రచండమైన తపస్సు చేశాడు. అయితే ఆయన మనస్సులో అహంకారం నిండి ఉంది. ఫలితంగా వసిష్ఠ మహర్షి ఆయనకు బ్రహ్మర్షిగా గుర్తింపు ఇవ్వలేదు. అందుకు ఆగ్రహించిన విశ్వామిత్రుడు ఒకరోజు రాత్రిపూట రహస్యంగా వసిష్ఠ మహర్షిని వధించడానికి వచ్చాడు. ఈ విషయం తెలియని వసిష్ఠుడు తన ధర్మపత్ని అరుంధతితో మాట్లాడుతూ విశ్వామిత్రుని తపస్సును ప్రశంసించాడు. ఆ తపస్సు పున్నమి నాటి పండు వెన్నెలలా ఉన్నదని పోలిక చెప్పాడు. అప్పుడు అరుంధతి అడిగింది - శ్రేష్టుడైన అలాంటి తపస్వికి మీరు బ్రహ్మర్షిగా ఎందుకు గుర్తింపు ఇవ్వలేదు? వసిష్ఠుడు అందుకు కారణం చెప్పాడు. ఆయనకు అహంకారం తగ్గలేదని. ఆ మాట విన్న వెంటనే విశ్వామిత్రుని అహంకారం కరిగిపోయింది. ఆయన వసిష్ఠుని పాదాలపై పడ్డాడు. ఆయన హృదయం నిర్మలం అయిందని గ్రహించి వసిష్ఠుడు ఆయనను బ్రహ్మర్షి అని పిలిచి తన గుండెలకు హత్తుకున్నాడు.*

శ్రేష్ఠ పురుషులు యోగ్యులైన తపస్వులు, సమర్థవంతులు కావడంతో పాటు అహంకార రహితులు కావడం కూడా అవసరం అన్నది దీని వల్ల స్పష్టమవుతోంది.

శ్రీకృష్ణుని ఉదాహరణ ద్వారా శ్రేష్ఠ పురుషుల లక్షణాలను వివరిస్తూ శుక మహర్షి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు- పరీక్షిత్తూ ! సమర్థవంతులైన ఆ పురుషులు అహంకార రహితులుగా ఉంటారు. శుభ కర్మ చేయడంలో వారికి ఎలాంటి ప్రాపంచిక స్వార్థమూ ఉండదు. అశుభ కర్మ చేయడంలో వారికి అనర్థమూ కలగదు. వారు స్వార్థానికీ, అనర్థానికీ అతీతులు.

సాత్వికులు, తేజోవంతులు అయిన అలాంటి పురుషులు ఏ పని చేసినా లోకహితం లక్ష్యంగా పెట్టుకుని చేస్తారు. శ్రీకృష్ణుడు కౌరవులతో యుద్ధం చేయించాడు. జరాసంధుడిని మోసంతో సంహరింపచేశాడు. అయినా అందువల్ల సమాజానికి ప్రయోజనమే కలిగింది. సంకుచిత స్వార్థానికి ప్రాధాన్యం ఇచ్చినపుడు మాత్రమే వికృతి ఏర్పడుతుంది. లోకకళ్యాణం కోసం తమ సర్వస్వాన్ని బలిదానం చేసే అలాంటి సంత్ పురుషులు తాము ఒక్కరూ ముక్తి పొందాలని కోరరు. వ్యథ, పతనముల పిలుపు వారి విరాట్ కరుణను నిరంతరం క్రియాశీలంగా నిలిపి ఉంచుతుంది.

ఈ కరుణ కారణంగానే మహాభక్తుడైన ప్రహ్లాదుడు నరసింహ భగవానునితో ఇలా అన్నాడు - పెద్దపెద్ద ఋషులూ, మునులూ తమ ముక్తి కోసం నిర్జనమైన అరణ్యంలోకి వెళ్ళి మౌన వ్రతాన్ని పాటిస్తారు. వారు ఇతరుల మంచి కోసం ప్రత్యేకమైన ప్రయత్నమేమీ చేయకపోవచ్చు. కానీ నా మనఃస్థితి మరో విధంగా ఉంటూ వచ్చింది. నిస్సహాయులైన ఈ నిరుపేదలను వదలి ఒంటరిగా ముక్తి పొందడం నాకు ఇష్టం లేదు. దారి తప్పిన ఈ ప్రాణులకు మీరు తప్ప మరో ఆసరా ఏదీ కనిపించడంలేదు.

సంపన్నులైన వ్యక్తులకే ఆదర్శాలు స్ఫురిస్తాయని, ఆకలితో ఉన్నవారికి తమ పొట్ట మాత్రమే కనిపిస్తుందనీ జనం ఒకోసారి అంటూ ఉంటారు. అయితే ఈ అభిప్రాయం సరైనది కాదు. వాస్తవానికి సంపన్నత ప్రజలను మరింత మదాంధులను చేస్తుంది. శ్రేష్ఠత్వ సంస్కారాలు కలిగిన వ్యక్తులు ఎట్టి పరిస్థితిలోను తమ స్థాయిని కోల్పోరు.

రంతిదేవ మహారాజు గొప్ప పరోపకారి. ఒకపుడు ఆయన దారిద్ర్యంలో జీవితం గడపవలసి వచ్చింది. చాలా రోజులు ఆకలితో మాడుతూ ఉండిపోయాడు. ఆ తర్వాత ఒకరోజున ఆయనకు కొద్ది భోజనం దొరికింది. తనకన్న ఆకలిగా ఉన్న వ్యక్తికి దాన్ని ఆనందంగా ఇచ్చివేశాడు. దాహంతో ఉన్న వ్యక్తికి ఒక గ్లాసు మంచినీళ్ళు త్రాగించాడు. ఆయన మనస్సులో రవంతయినా దుఃఖం లేదు. అందుకు దేవశక్తులు ప్రసన్నం అయినాయి. వరం కోరుకోమని ఆయనను అడిగాయి. ఆ స్థితిలో సైతం ఆయనకు ఆదర్శం గుర్తున్నది. ఆయన ఇలా అన్నాడు-

*నాకు అష్టసిద్ధులు అవసరం లేదు. అంతే కాదు. నాకు మోక్షం సైతం అవసరం లేదు. నేను కోరుకునేది ఒక్కటే. నేను ప్రాణులు అన్నింటి హృదయాలలో నిలిచి ఉండాలి. వారి దుఃఖమంతా నేనే సహించాలి. అందువల్ల ఏ ప్రాణికీ దుఃఖమనేది లేకుండా పోతుంది.*

ఈ విధంగా నిజంగా ఆదర్శవాది అయిన వ్యక్తి లేమిలోను కలిమిలోను కూడా తన గౌరవ గరిమను నిలిపి ఉంచుకుంటాడు. శ్రేష్ఠత్వం, ఆదర్శవాదానికి కట్టుబడి ఉండడం అనేవి బాహ్య పరిస్థితులపై ఆధారపడి ఉండవు. యుగయుగాలుగా భారత్ అలాంటి నరరత్నాలకు తరగని గనిగా ప్రఖ్యాతి గడించింది. ఆ కారణంగానే ఈ దేవభూమి 'స్వర్గాదపి గరీయసి' (స్వర్గం కన్న మిన్న) అయింది. ఇక్కడి ప్రజలు 'భూసురులు'గా పిలువబడ్డారు. వ్యక్తిత్వాల శ్రేష్ఠత్వం ఉపేక్షకు గురయిన నాటి నుండి దేశ పతనం ప్రారంభమయింది. ప్రజలలో తిరిగి అలాంటి ఆదర్శ నిష్ఠ, అలాంటి శ్రేష్టత్వం నిర్మాణం అయితే సుఖ వైభవాలు వెల్లివిరుస్తాయి. వాటితో పాటు మన దేశం తిరిగి జగద్గురు స్థానాన్ని పొందుతుంది.

H H H

**భువిపై దివి అవతరణను పారిశుద్ధ్యంతో, స్వచ్ఛతతో ప్రారంభించు.**

## బోధకథ

# నియమ పాలన మహిమ

ఆషాఢ మాసపు కారు మేఘాలు ఆకాశాన్ని క్రమ్ముకున్నాయి. కుండపోత వర్షంతో నేలంతా జలమయం అయింది. ఒక సాధువుల బృందం అడవిలో ప్రయాణం చేస్తోంది. అయితే నలువైపులా నీళ్ల పొంగి పొరలుతున్నాయి. నదులు హోరుమని పారుతున్నాయి. త్రోవలన్నీ బురదతో నిండిపోయాయి. సాధువులు ముందుకు వెళ్లలేకపోయారు. వారి నాయకుడు శాల్విన మహర్షి ఒక చెట్టు క్రింద ఆగి ఆలోచించసాగారు. ఇప్పుడు ఏమి చేయాలి ? ఆయనకు దిక్కు తోచడం లేదు. చాతుర్మాస్యం ఆరంభం కావడానికి ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉంది. నాల్గవ రోజు ఆషాఢ పూర్ణిమ నాటికి చాతుర్మాస్య స్థలాన్ని చేరుకుని తీరాలి. ఆ తర్వాత ప్రయాణం చేయడం నియమాలకు విరుద్ధం. ఈ అడవిలో ఆగిపోయి చాతుర్మాస్యం జరపడం అసాధ్యం. అయినా ముందుకు వెళ్లడానికి దారి లేదు. ఇతర సాధువులు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారు.

సరిగా ఆ సమయంలో చెట్ల గుంపులలో నుండి ధృఢకాయుడైన ఒక వ్యక్తి వస్తూ ఉండడం కనిపించింది. అతడి ముఖంలో తేజస్సు. కండలు తిరిగిన శరీరం. భుజాలకు ధనుస్సు, బాణాలు. సింహం లాంటి నిర్భయమైన నడక. అతడు ఒక వీర పురుషుడని ఈ లక్షణాలు చెపుతున్నాయి. అతడు సరాసరి ఆ సాధువుల వద్దకు వచ్చి ప్రణామం చేసి ఇలా అడిగాడు - స్వాములూ! మీరు ఈ కీకారణ్యంలోకి ఎలా వచ్చారు ? ఎందుకు వచ్చారు ?

సాధువులు తమ పరిస్థితిని ఇలా వివరించారు- సోదరా! మేము దారి తప్పి పోయాం. మేము విదిశ వెళ్లాలని బయలుదేరాం. కానీ, వర్షాలు కురియడంతో దారి బురద బురదగా ఉంది. కాలిబాట మూసుకుపోయింది. మూడు రోజులుగా దారి తెలియక అటూ ఇటూ తిరుగుతున్నాం. విదిశ చేరుకోవడం అసాధ్యం. కనుక, ఇక్కడే దగ్గరలో ఏదైనా బస్తీ ఉంటే చెప్పు. సాధువులకు అడవి అయినా ఒకటే, నగరమైనా ఒకటే. నీవు సూచిస్తే అడవిలోనే జపతపాలు చేస్తూ చాతుర్మాస్యం పూర్తి చేస్తాం.

ఆ వచ్చిన వ్యక్తి ఆలోచనలో పడ్డాడు. అతని రక్తంలో జీర్ణించి ఉన్న సంస్కారాలు క్రమంగా వెలికి వచ్చాయి. అతడు చూపుడు వ్రేలితో చూపుతూ ఇలా అన్నాడు- "ఆ చెట్ల గుంపుల అవతల గుడిసెలు కనబడుతున్నాయి చూశారా. అవి భిల్లులవి. మేమూ అక్కడే నివసిస్తాం. మీరు నాలుగు నెలల పాటు ఇక్కడ ఉండదలచుకుంటే, మేము ఉండడానికి స్థలం ఇస్తాం. అయితే ఒక షరతు. ఆ షరతును అంగీకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తే, మీరు ఇక్కడ ఉండవచ్చు.''

సాధువుల బృందం నాయకుడు శాల్విన మహర్షి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు- "ఆ షరతు ఏమిటి?''

ఆ వ్యక్తి ఇలా జవాబు చెప్పాడు - "చూడండి. మేము దొంగలం. మీరు సాధువులు. మీ దారి వేరు. మా దారి వేరు. మా దారి చంపే దారి. మీ దారి తరణోపాయం చూపే దారి. మా ధర్మం లూటీ చేయడం. మీ ధర్మం లూటీ చేయవద్దని ఉపదేశం ఇవ్వడం. మాతో స్నేహం చేస్తే మీరు చెడిపోతారు. మీతో స్నేహం చేస్తే మా బ్రతుకుదెరువు పోతుంది. కనుక మీరు మా దారికి అడ్డు రాకూడదు. నా నాయకత్వంలో 700మంది బందిపోటు దొంగలు ఉన్నారు. మా వృత్తి బందిపోటు దొంగతనం. ఈ దొంగతనంతోపాటు హత్యలూ, కొట్లాటలూ కలిసి ఉండడం సహజం. మీ దారి మంచి దారి అని నాకు తెలుసు. అయితే అది నాకు పనికిరాదు. అహింసను అవలంబిస్తే హత్య చేయడం ఎలా? అపరిగ్రహాన్ని అవలంబిస్తే పొట్ట గడవడం ఎలా? అందువల్ల - మీరు హాయిగా ఉండండి. కానీ, ఎవరికీ ఉపదేశం ఇవ్వకండి. ఇదీ షరతు. లేకపోతే ....''

దొంగల నాయకుడు ఇంత విజ్ఞతతో, ఇంత స్పష్టంగా మాట్లాడడం విని మహర్షి సంతోషించారు. సాధువులందరితో సంప్రదించి, ఆ షరతుకులోబడి భిల్లుల పల్లెలో నివసించడానికి ఆయన తమ అంగీకారం తెలిపారు.

ప్రకృతి మాత ఒడిలో ఉన్న ఆ పల్లె సహజ సుందరంగా ఉంది. అక్కడి వాతావరణం ప్రశాంతంగా ఉంది. సాధువు లందరూ ఒక కుటీరంలో చాతుర్మాస్యం ప్రారంభించారు. స్వాధ్యాయం, ధ్యానం, మౌనం, తపస్సు, ఆత్మ సాధనలతో ఆ నాలుగు నెలలూ క్షణంలా ఇట్టే గడిచిపోయాయి. దొంగలు దొంగ సొమ్ము, దొంగ సామాను తీసుకుని ఈ సాధువుల కుటీరం ముందునుంచే వెళ్లేవారు. సాధువుల తపస్సు వెలుగు తమ హృదయాలను తాకకముందే వారు వాయు వేగంతో ముందుకు వెళ్లేవారు.

నాలుగు నెలలు గడిచాయి. చాతుర్మాస్యం పూర్తయింది. నేడు సాధువుల బృందం తమ నివాసాలకు వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. దొంగల నాయకుడు వచ్చి, సాధువులకు నిండు మనసుతో ప్రణామం చేశాడు. అతడి అనుచరులు కొందరు సాధువులకు వీడ్కోలు చెప్పడానికి అతడితోపాటు వచ్చారు. సాధువులు ఉపదేశాలు అయితే ఇవ్వలేదు - షరతు ప్రకారం. అయినా, త్యాగం, తపస్సు, శాంతి, సంయమనాల మౌన ప్రభావం అందరి హృదయాలపై చెరగని ముద్ర వేసింది. కాలిబాట మలుపులో మహర్షి ఆగారు. దొంగల నాయకునికీ, అతడి అనుచరులకూ స్వస్తి వచనం పలికారు. మిగతా దొంగలందరూ తిరిగి వెళ్లిపోయారు. దొంగల నాయకుడు మాత్రం సాధువులతోపాటు నడుస్తున్నాడు.

**స్వచ్ఛంగా ఉండడం దైవత్వానికి సమీపంగా ఉండడం.**

శాల్వీన మహర్షి అతడితో ఇలా అన్నారు - "ఒక ప్రశ్న అడగనా? ఎందుకంటే - నీ షరతు ప్రకారం చాతుర్మాస్యంలో మిమ్మల్ని ప్రశ్న అడగడం భావ్యం కాదని మేమంతా భావించాం."

దొంగల నాయకుడు భావోద్వేగంతో ఇలా అన్నాడు - "నిస్సంకోచంగా అడగండి స్వామీ. మీరు అడిగే ప్రశ్నలకు నేను ఎలాంటి దాపరికం లేకుండా జవాబు చెపుతాను."

ఆ జవాబుకు సంతృప్తి పొంది, మహర్షి ఇలా అన్నారు - "నేను దొంగనని, బందిపోటు దొంగనని నీవు చెపుతున్నావు. కానీ, నీ సంస్కారం నీవు దొంగవని సాక్ష్యం ఇవ్వడం లేదు. నీవు ఉన్నత వంశానికి చెందిన వ్యక్తివని అనిపిస్తోంది. నీ గురించి వివరాలు తప్పకుండా తెలుసుకోవాలని అనిపిస్తోంది నీ గుణాలు చూచిన తర్వాత."

అతి సహజమైన ఆత్మీయతతో నిండిన మహర్షి వాణి విని దొంగల నాయకుని హృదయం ద్రవించసాగింది. భవ్యమైన తన గతానికి సంబంధించిన అస్పష్టమైన జ్ఞాపకాలు అతడి మనసులో స్పష్టంగా వచ్చి నిలిచాయి. వేదనతో కన్నీరు పెల్లుబకసాగింది అతడి కళ్లనుండి. కళ్లు తుడుచుకుంటూ అతడు ఇలా అన్నాడు - "ప్రభూ! ఇప్పుడు ఆ పాత విషయాలను కదిలించి నా గాయాలను కెలకకండి. ప్రస్తుతం నేను ఎవడినో తెలుసుకుంటే చాలు."

మహర్షి బుద్ధి మానవ రత్నాలను పరీక్ష చేయగలిగే బుద్ధి. ఆయన అతడికి మరింత దగ్గరగా వచ్చి, ఎంతో వాత్సల్యంతో తన చేతితో అతడి తల నిమురుతూ ఇలా అన్నారు - "నాయకుడా! జ్ఞాపకాల నిప్పుమీద మరపు అనే నివురును ఎందుకు కప్పుతావు? ఆ నిప్పు నిన్ను లోలోపల దహించి వేస్తుంది. దాన్ని బయటికి తీయి. జ్ఞానం, పశ్చాత్తాపం అనే జలంతో దాన్ని ఆర్పివేయి."

ఎంతో స్నేహంగా, ఎంతో ఆర్ద్రంగా మహర్షి చెప్పిన ఆ మాటలు నాయకుని గుండె లోతులను తాకాయి. అతడు ఇలా అన్నాడు -

"ప్రభూ! వేదన అనే నా అగ్నిగుండం జ్ఞానంతో, ప్రేమతో నిండిన మీ మాటలు అనే నీటి తుంపురులకు చల్లారదు. అయినా, మీ జిజ్ఞాసను చూచిన తర్వాత వ్యధతో నిండిన నా గాథను మీకు వినిపించాలని నాకు అనిపిస్తోంది.

"కోసల రాజు సుయశుని కుమారుడను నేను. నా తల్లి పేరు సౌమ్యదర్శన. నా పేరు అభయుడు. నాకొక సోదరి ఉంది. ఆమె పేరు ఉమ. నేను ఎంతో గారాబంగా పెరిగాను. ఈ ప్రేమాభిమానాలను, తల్లి దండ్రుల ఈ అపరిమిత వాత్సల్యాన్నీ నేను జీర్ణించుకోలేక పోయాను. క్రమక్రమంగా చెడు సహవాసంవల్ల నాలో విచ్చలవిడితనం, విశృంఖలత్వం పెచ్చు పెరిగాయి. నా ఆగడాలవల్ల ప్రజలు బాధలుపడ్డారు. తల్లి దండ్రులు ఎన్నో మారులు నాకు నచ్చజెప్పి చూచారు. అది వారి చేతకాని తనమని నాకు అనిపించింది. దసరా రోజున వారి సహనం నశించిపోయింది.

"విసిగి వేసారిపోయి, నా తండ్రిగారు చివరికి నాతో ఇలా అన్నారు - పాపాత్ముడా.పో. ఇక్కడనుంచి వెళ్లిపో. నీవల్ల నా పేద ప్రజలు నానా బాధలూ పడ్డారు. ఇక నాకు నీ ముఖం చూపించకు.

"ఆ మాటలు నా ఆత్మగౌరవానికి సవాళ్లు అయినాయి. ఆ క్షణంలోనే నేను ఇంటినుండి బయటికి వచ్చేశాను. నా చెల్లెలు ఉమకు నేనంటే ప్రాణం. తాను నాతో వస్తానంది. నేను ఎంత నచ్చజెప్పినా వినకుండా, నా వెంట వచ్చేసింది. తిరుగుతూ తిరుగుతూ అన్నా చెల్లెళ్లం మే మిద్దరం ఈ అడవిలోకి వచ్చి చేరాం. ఇక్కడ నాకొక భిల్లుడు కలిశాడు. నేను అతడికి నా దుఃఖ గాథను వినిపించాను. తన పల్లెకు రమ్మని అతడు నన్ను ఆహ్వానించాడు. నాటినుంచి నేటి వరకు మేము ఆ పల్లెలోనే నివసిస్తున్నాం. అదే మీరు చాతుర్మాస్యం గడిపిన పల్లె. వృద్ధుడైన ఆ భిల్లుడు చనిపోయిన తర్వాత భిల్లులందరూ నన్ను తమ నాయకునిగా ఎన్నుకున్నారు.

"నా నాయకత్వంలో ఇప్పుడు 700 భిల్లులు ఉన్నారు. నాపేరు చెపితే గొప్పగొప్పవాళ్లే వణకిపోతారు. అయినా - వాత్సల్యసముద్రులైన తల్లి దండ్రులు గుర్తు వచ్చినప్పుడల్లా నా హృదయం విషాదంతో నిండిపోతుంది. పాపం వాళ్లిద్దరూ నన్ను తలచుని ఏడ్చి ఏడ్చి చనిపోయారు. వారి చివరి క్షణాలలో సైతం నేను వారి దగ్గరకు వెళ్ల లేకపోయాను. అలాంటి దురదృష్టవంతుడను నేను. స్వామీ! ఇదీ నా విషాద గాథ."

అభయుని స్పష్టత, అతని గుండెలోతుల్లో ఉన్న వ్యథ మహర్షి హృదయాన్ని ద్రవింపజేశాయి. ఆయన ఇలా అన్నారు - "అభయుడా! దీని పేరే జీవితం. పాపపు చీకటి లోయలో గడచే జీవితానికి వెలుగు వచ్చే రోజు వస్తుంది. ఆ లోయలో కూడ ధర్మనియమాలనే మెట్లద్వారా ఆత్మ వెలుగు వరకు మనిషి చేరుకోగలుగుతాడు. నీ జీవన పథానికి ఏదో ఒక వెలుగు అందించాలని నాకు అనిపిస్తోంది. చాతుర్మాస్యం గుర్తుగా నేను నీకు నాలుగు నియమాలు ఇస్తాను. అవి కష్టమైనవి కావు. అయితే, అవి నీ జీవిత వికాసానికి సహాయపడతాయి.

"మొదటి నియమం ఇది. నీవు ఏ ప్రాణినీ హింసించకూడదని నేను కోరుతున్నాను. అయితే అది నీకు సాధ్యం కాదు. కనుకనే ఈ నియమం నీకు ఇస్తున్నాను. ఎవరిమీద అయినా దెబ్బ కొట్టే ముందు ఏడు అడుగులు వెనుకకు వేయాలి. ఏడు మారులు ప్రభువును స్మరించాలి."

"ఈ నియమాన్ని పాటిస్తాను ప్రభూ" - అన్నాడు అభయుడు.

"రెండవ నియమం ఇది - సాదాగా, సాత్వికంగా ఉండే ఆహారం తీసుకో. ఇప్పుడే ఆ పని చేయడం నీకు కష్ట మవుతుంది. కనుక, నీవు గుర్తుపట్టలేని ఆహార పదార్థాన్ని, నీకు పేరు తెలియని ఆహార పదార్థాలను నీవు తినకూడదు."

అభయుడు ఈ నియమానికి కూడా ఆనందంగా అంగీకరించాడు.

**సత్కర్మల ద్వారానే భగవంతునికి నిజమైన పూజ జరుగుతుంది.**

మహర్షి మూడవ నియమాన్ని ఇలా పేర్కొన్నారు - నీవు శీలవంతుడవు కావాలని నా కోరిక. కాని అలా చేయడం నీకు కష్టం కావచ్చు. కనుక - రాణిని చెడు దృష్టితో చూడాలనే భావనను. ఆమెతో సహవాసం చేయాలనే భావనను వదులుకో. ఎందుకంటే, రాణి ప్రజలకు తల్లి.''

అభయుడు ఆ నియమానికి శ్రద్ధగా అంగీకరించాడు.

మహర్షి నాల్గవ నియమాన్ని ఇలా తెలిపారు - ''నీవు మాంసాహారం తినకూడదని నా కోరిక. కాని అది ఇప్పుడు నీకు సాధ్యం కాదు. కనుక, నీవు కాకి మాంసం తినడం వదులుకో.''

''నియమాలు నాలిగింటినీ పాటిస్తానని చెప్పు. నియమాలను స్వీకరించడం తేలిక. వాటిని పాటించడం చాలా కష్టం. ఇది గుర్తుంచుకో.''

నాలుగు నియమాలనూ పాటిస్తానని మాట ఇస్తూ అభయుడు శాల్విన మహర్షితో ఇలా అన్నాడు - ''ప్రభూ! పుణ్య పురుషుడైన ఒక మహర్షి ఎదుట, చాతుర్మాస్యపు పుణ్య స్మృతికి చిహ్నంగా నేనీ నియమాలను స్వీకరించాను. అభయసింహుడు ఇక ఈ నియమాల పాలనలో పర్వతంలా దృఢంగా ఉంటాడు. మీరు ఏమాత్రం సందేహించకండి.''

మహర్షి వీడ్కోలు తీసుకుంటూ ఇలా అన్నారు - ''అభయుడా! ఈ నియమాలూ, సంస్కారాలు నీ జీవితానికి వెలుగు ఇస్తాయి. నీ జీవితాన్ని ఉన్నతం చేస్తాయి.''

ఆవెంటనే సాధువుల బృందం ముందుకు సాగిపోయింది. అభయుని గుండె భావోద్వేగంతో నిండిపోయింది. అతడు గురు చరణముల ధూళిని తలపై అద్దుకుని, నమస్కారం చేశాడు.

సాధువులకు వీడ్కోలు చెప్పి అతడు ఇంటికి తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి అయింది. ఇంటిలోకి అడుగుపెడుతూనే అతడు చూచాడు - గదిలో ఒకే మంచంమీద తన భార్యతోపాటు మరో పురుషుడు అంటుకుని నిద్రపోతూ ఉన్నాడు. ఆ దృశ్యం చూచీ చూడగానే అతడి క్రోధం కట్టలు త్రెంచుకున్నది. ఆవేశంలో ఒరలోనుండి కత్తి బయటికి తీశాడు. వ్రేటు వేయడానికి కత్తి ఎత్తాడు. ఆ క్షణంలో మహర్షి విధించిన మొదటి నియమం గుర్తుకు వచ్చింది. అతడు వెంటనే ఏడు అడుగులు వెనుకకు వేశాడు. ఏడు మార్లు దేవుణ్ణి స్మరించాడు. ఆనుకోకుండా - ఎత్తిన కత్తి వెనుక ఉన్న గోడకు కొట్టుకుంది.

ఆ శబ్దానికి ఉలికిపడి ఉమ తటాలున నిద్ర లేచింది. పురుష వేషంలో ఉన్న ఆమె ఇలా అన్నది - ''అన్నా! నీవు చిరంజీవివి కావాలి.''

అభయుని ఆశ్చర్యానికి అంతు లేదు. పురుష వేషం ఎందుకు ధరించావని తన చెల్లెలిని అడుగుతూ అతడు ఇలా అన్నాడు - ''ఇవాళ నావల్ల గొప్ప అనర్థం జరిగిపోయి ఉండేది. నేను నా చెల్లెలినే హత్యచేసి ఉండేవాడిని. దెబ్బ కొట్టే ముందు ఏడడుగులు వెనుకకు వేయాలనీ, ఏడు మారులు దైవ స్మరణ చేయాలనీ ఆ మహర్షి నాకు నియమం విధించడం మంచిదయింది.''

పురుష వేషం ధరించి వదినతో పరాచికం ఆడాలనే చిత్రమైన ఆలోచన తనకు కలిగిందని ఉమ చెప్పింది. ఆవిధంగా అతని అనుమానం తీర్చింది. ఈ సంఘటనవల్ల అభయుని నియమ దీక్ష మరింత గట్టిపడింది.

కొద్ది రోజుల తర్వాత అవంతి నగరంపై దాడి చేయవలసిన సమయం వచ్చింది. బయలుదేరే సమయంలో అపశకునాలు ఎదురైనాయి: వీరత్వ దర్పంతో అతడు వాటిని లెక్కచేయలేదు. అవంతీ నగరాన్ని లూటీ చేయడానికి అతడు ప్రయత్నించే సరికి - మొదట సాయుధులైన రక్షక భటులూ, నగర ప్రజలూ అతడి దళాన్ని ఎదిరించి నిలచారు. ఆవెంటనే రాజ్యసేన వచ్చిపడింది. ఇంత పెద్ద సైన్యంతో అతడు ఎంతవరకు పోరాడగలడు. కనుక, అదను చూచి దొంగల ముఠా అక్కడనుంచి పారిపోయింది. సైన్యం వారిని వెంట తరిమింది. అయినా దొంగల ముఠా ఎలాగో వారి కన్ను కప్పింది. దట్టమైన అరణ్యంలో ప్రవేశించింది. దొంగలందరూ కొండలమధ్య ఉన్న ఒక సొరంగంలోకి చేరుకున్నారు. వారందరూ ఆకలి దప్పులతో ఉన్నారు. అలసి సొలసి ఉన్నారు. నాయకుని ఆజ్ఞ మేరకు దొంగలు అడవిలో ఉన్న చెట్లనుండి అందమైన, సువాసన వెదజలుతూన్న పండ్లు కోశారు. వాటిని తమ నాయకుని ఎదుట గుట్టగా పోశారు. కొందరు మంచినీళ్లు తెచ్చారు.

నాయకుడు అభయుడు ఒక పండు తీసుకున్నాడు. దాన్ని వాసన చూస్తూ ఇలా అన్నాడు - ''ఈ పండు చాలా అందంగా ఉంది. దీని పేరు ఏమిటి?'' పేరు ఏదయితే ఏమిటి? ఆకలి తీరాలి కదా.తినండి - అని ఒక దొంగ అన్నాడు. కాని, తోడి దొంగలు ఎంత ఒత్తిడి చేసినా అభయుడు ఆ పేరు తెలియని పండు తినలేదు. ఆకలి దహిస్తోంది. మిగతా దొంగలందరూ ఆ పండ్లు కడుపునిండా తిన్నారు. అందరూ బాగా అలసిపోయారేమో - నడుములు వాల్చగానే నిద్రపోయారు. కాని అభయునికి నిద్ర రాలేదు. అందరినీ నిద్ర లేపడానికి అతడు ప్రయత్నించాడు. కాని ఇదేమిటి? నిద్రపోయిన వాళ్లంతా నిద్రలోనే ఉండి పోయారు. వారిని కుదిపి చూచాడు. గట్టిగా కేక వేశాడు. ఏ ఒక్కరూ నిద్రలేవలేదు. వారు ఎందుకు చనిపోయారో అభయునికి అర్థమయింది. తన సహచరులు చనిపోయినందుకు అతడికి ఒక ప్రక్క విచారం కలిగింది. ఆ మహర్షి విధించిన నియమాన్ని పాలించడంవల్ల తనకు ప్రాణం దక్కినందుకు అతడికి సంతోషమూ కలిగింది. ఆ నాలుగు నియమాలపట్ల అతడి శ్రద్ధ మరింతగా బలపడింది. అతడు బరువైన మనసుతో పల్లెకు తిరిగివచ్చాడు.

ఇప్పుడు అతడి మనసులో మహర్షి వచనాలపట్ల శ్రద్ధ అపారం అయింది. మరొక్క దొంగతనం చేద్దాం. ఆ తర్వాత శాశ్వతంగా దొంగతనానికి స్వస్తి చెప్పి మంచి వ్యక్తిగా జీవిద్దాం - అనే భావం అతడి మనసులోకి వచ్చింది. పున్నమి వెన్నెలలో ఒంటరిగా వెళ్లి

**నమ్రంగా ఉండే వ్యక్తి పెనుతుపానులను తట్టుకుని నిలుస్తాడు.**

అవంతి మహారాణి హారాన్ని దొంగలించాలని అతడు సంకల్పించాడు. లక్షలు విలువచేసే హారం అది. సరిగా పున్నమి రాత్రి అతడు తన సాధనాలతో రాజమహలులో ప్రవేశించాడు. రాణి మేడమీద గదిలో మంచంమీద నిద్రపోతోంది. పున్నమి వెన్నెల అందమైన ఆమె ముఖ మండలానికి మరింత అందాన్ని చేకూర్చుతోంది. అభయుడు నెమ్మదిగా అడుగులు వేస్తూ రాణి మంచం దగ్గరికి చేరాడు. ఆమె మెడకు రత్నాల హారం ఉంది. ఆ అడుగుల చప్పుడుకు రాణి ఉలిక్కిపడి లేచింది. ఎవరు నీవు- అని అన్నది. ఆ వెన్నెల వెలుగులో అతడి కండలు తిరిగిన శరీరం, పొంగిన అతడి వక్ష స్థలం, అతడి సుందర రూపం ఆమె చూచింది. ఆమె చకిత అయింది. మోహం ఆమెను ఆవహించింది. ఆమె దగ్గరకు వచ్చి ఇలా అన్నది - నీవు దొంగవని నాకు తెలుసు. కానీ, నేడు నన్ను నీకు సమర్పించుకుంటున్నాను. నీవు నా చిత్తాన్ని దొంగిలించావు. నగలతో పాటు నా శరీరాన్ని, మనస్సునూకూడ నీకు అర్పిస్తున్నాను. కాస్త దగ్గరకి రా.

ఇలా చెపుతూ నవ్వులు చిందిస్తూ రాణి ముందుకువచ్చి అభయుని చేయి పట్టుకున్నది. అదే క్షణంలో అతడికి తన నియమం గుర్తుకు వచ్చింది. ఎంత కఠినమైన పని అది. ఏకాంత స్థలం. ఏకాంత సమయం. ఉప్పొంగుతూన్న యౌవనం. యౌవన మదంతో మత్తెక్కిన స్త్రీ ఆహ్వానం.

నా శరీరం ముక్కలు ముక్కలు అయినా నేను నియమాన్ని ఉల్లంఘించను - అని అతడు లోలోపల ఆలోచిస్తున్నాడు. అభయుడు తన చేతిని విడిపించుకుంటూ ఇలా అన్నాడు - అమ్మా! నీవు చేస్తున్న పని ఏమిటి? నీ ధర్మాన్ని నీవు మరువకు. మేము నీ కుమారులం. తన కుమారులపై తల్లికి వికారపు దృష్టి ఎలా కలుగుతుంది.

రాణి అతడిని తన కామ జాలంలో ఇరికించడానికి విశ్వ ప్రయత్నం చేసింది. మోసం, బలం, భయం, ప్రలోభం - అన్ని ఆయుధాలనూ ప్రయోగించింది. అయినా, అభయుడు మేరు పర్వతంలా దృఢంగా నిలిచాడు.

ఆ ఇద్దరి సంభాషణనూ ప్రక్క గదిలో పడుకుని ఉన్న వ్యక్తి ఏకాగ్రంగా వింటున్నాడు. మరో ఉపాయమేదీ తోచకపోవడంతో, రాణి- పరుగున రండి! పరుగున రండి! దొంగ! దొంగ! నా మానాన్ని దోచుకుంటున్నాడు.

ఆ కేకలు విని కాపలాదారులు రాణి మహలులోకి వచ్చారు. అభయుణ్ణి ఖైదు చేయడానికి ముందుకు ఉరికారు. రహస్యంగా ఆ సంభాషణను వింటూవచ్చిన వ్యక్తి అకస్మాత్తుగా వెలికివచ్చి ఆజ్ఞాపించాడు - ఈ దొంగను నా మహలులోకి తీసుకురండి. రాణిని చీకటి గదిలో పడవేయండి.

కాపలా సైనికులు ఆశ్చర్యపోయారు. కానీ, రాజాజ్ఞను పాటించడం తప్పనిసరి అయింది. అభయుని దృఢ శీలంవల్ల ప్రభావితుడైన రాజు ఆ రాత్రంతా అతడితో కబుర్లు చెప్పాడు. అతడి వివరాలన్నీ తెలుసుకున్నాడు. రహస్యమంతా బయటపడింది.

మరునాటి ఉదయం రాజు తన నిర్ణయాన్ని ఇలా ప్రకటించాడు- రాజకుమారుడు అభయుడు నా దత్త పుత్రుడుగా ఉంటాడు. అతడిని మేము అవంతి రాజ్యానికి మహాసేనాధిపతిగా నియమిస్తున్నాం. ఇతడి సహచరులను సైన్యంలో చేర్చుకుంటాం.

రాణికి మరణ శిక్ష విధించబడింది. రాజకుమారుడు అభయుడు ప్రార్థించినమీదట ఆమె క్షమించబడింది. అవంతిలో ఆనంద తరంగాలు పొంగిపొరలాయి.

అభయుడు సేనాపతి కావడంతో రాజ్యమంతటిలో అభద్రతా వాతావరణం సమాప్తమయింది. సంవత్సరంలో సైనిక వ్యవస్థలో, రాజ్యంలో పెద్ద మార్పు వచ్చింది. అయినా, పొరుగు రాజ్యం అప్పుడప్పుడు కవ్విస్తూ ఉండేది. అది యుద్ధంగా పరిణమించింది. అభయుడు మహా పరాక్రమం చూపాడు. వ్యూహ రచనలో ఎంతో నైపుణ్యం చూపాడు. ఫలితంగా విజయం లభించింది. అయితే, శత్రువుల ఆయుధ ప్రహారాలవల్ల అతడి శరీరం తీవ్రంగా గాయపడింది. సైన్యం విజయోత్సాహంతో నగరంలోనికి తిరిగి వచ్చింది. అయితే తమ సేనాపతి పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో, ప్రజలు ఎంతగానో కలవరపడ్డారు.

మహారాజు, మహారాణి కలసి ఎన్నో వైద్యాలు చేయించారు. విషంలో ముంచిన బాణంవల్ల కలిగిన గాయం మానలేదు. చివరికి ఒక వైద్యుడు ఇలా సలహా ఇచ్చాడు - నా ఔషధంతోపాటు ఇతడికి కాకి మాంసం ఇవ్వాలి.

కాని కాకి మాంసం తిననని అభయుడు భీష్మించుకున్నాడు. అతడు ఇలా అన్నాడు - "ప్రతి ఒక్కడూ ఏదో ఒక రోజున మరణించవలసిందే. కానీ, పోయిన ధర్మం తిరిగి రాదు. నియమాన్ని పాటిస్తూ శరీరం నశిస్తే - అది సంతోషించవలసిన విషయమే."

మహారాజు, మహారాణి ఎంతో ప్రేమతో ఎంతో ఒత్తిడి చేశారు. నచ్చజెప్పడానికి శతవిధాల ప్రయత్నించారు. కానీ, అభయుడు ఇతర విషయాలన్నింటినుంచీ మనసును మళ్లించాడు. శాల్విన మహర్షి నియమాలతోపాటు ఇచ్చిన గాయత్రీ మంత్రాన్ని మనసులోనే జపించసాగాడు. సూర్య మండల మధ్యవర్తి అయిన ఆదిశక్తి, జగన్మాత మనోహర తేజస్సును దర్శించడంలో అతడి మనస్సు నిమగ్నం అయింది. శ్రీ గురు చరణాలపట్ల అచంచలమైన భక్తిని తన అంతరాంతరాలలో నింపుకుని రాజకుమారుడు అభయుడు తనువు చాలించాడు. అతడి ఆత్మ వెలుగు బాటలో ప్రయాణించి పరమపదాన్ని చేరుకున్నది.

సద్గురువుతో క్షణకాలం జరిపిన సత్సంగంతో, ఆయన చెప్పిన నియమాల పాలనతో - అతడి జీవితం ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ధన్యం అయింది.

W W W


**సంకల్ప శక్తి అసాధ్యాన్ని సాధ్యం చేస్తుంది.**

## ముఖచిత్ర కథనం

# సమైక్యతా శంఖారావం ఆదిశంకరుల సందేశం

వైశాఖ శుక్ల పంచమి (ఏప్రిల్ 24) జాతి ధార్మిక, ఆధ్యాత్మిక చరిత్రలో ఒక పుణ్య దినం. ఈ శుభ దినాన ఆది శంకరాచార్య భగవత్పాదులు భువిపై అవతరించారు. ఆ ఆదివారం నాడు కేరళలోని కాలడి గ్రామానికి ఆయన జన్మస్థలమయ్యే అదృష్టం లభించింది. ఆయన జీవిత చరిత్రలన్నీ ఆయన యశస్వి అనీ, తపస్వి అనీ, మనస్వి అనీ చాటి చెపుతున్నాయి. ఆది శంకరులు భారతీయ సంస్కృతికీ, సాధనకూ మారుపేరు అన్నది అక్షర సత్యం. ఆయన ఆధ్యాత్మిక సాధనలో శిఖరాగ్రాన్ని చేరుకుని ఏకత్వమనే సత్యాన్ని సాక్షాత్కరింపజేసుకున్నారు. అంతే కాదు. బాహ్య జీవనంలో కూడ జాతికి ఏకత్వ ప్రాముఖ్యాన్ని బోధించారు. జాతీయ సమైక్యతను స్థాపించారు.

శంకర భగవత్పాదుల జీవిత గాథ కూర్మ, లింగ, పద్మ, సౌర, స్కంద, భవిష్యోత్తర పురాణాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రస్తావనకు వచ్చింది. మార్కండేయ, శివ రహస్య సంహితలు భగవత్పాదుల యశో గాథను గానం చేస్తున్నాయి. పద్మపాదుని విజయ డిండిమ, చిత్సుఖ ఆచార్యుల బృహత్ శంకర విజయ, ఆనంద గిరి రచించిన శంకర దిగ్విజయ, వ్యాసాచల వారి శంకర విజయ, గోవిందనాథుల శంకరాచార్య చరిత, చిద్విలాసుల శంకర విజయ విలాస, రాజచూడామణి దీక్షితుల శంకరాభ్యుదయ, తిరుమల దీక్షితుల శంకరాభ్యుదయ, సదానందుల శంకర దిగ్విజయ సార మున్నగు గ్రంథాలు ఆది శంకరుల కీర్తిని గానం చేస్తున్నాయి.



శంకరాచార్య భగవానుని జీవితం దివ్యమైనది. లోకోత్తరమైనది. కనుకనే - ఆయన జీవితాన్ని సరైన రీతిలో వర్ణించే సామర్థ్యం భాషలకూ, లిపులకూ, అక్షరమాలలకూ లేదు.

బ్రహ్మర్షి శివగురువు, సుభద్ర దంపతులకు జన్మించిన శంకర భగవత్పాదులు పుట్టుకతోనే శివత్వ లక్షణాలతో ప్రకాశించారు. ఆయన జతకాన్ని చూచి జ్యోతిష విద్వాంసులు స్తంభించిపోయారు. వృషభ లగ్నం. మేష రాశిలో సూర్యుడు, బుధుడూ. వృషభంలో శుక్రుడు. చంద్రుడు పునర్వసు నక్షత్రంలో. శని తులలో. గురుడు వృశ్చికంలో. కుజుడు మకర రాశిలో.

ఆది శంకరుల శరీర చిహ్నాలను చూచి, బాలకుడు విలక్షణ వ్యక్తి అని జ్యోతిషవేత్తలు నిర్ణయించారు. బాలుని తలపై చందమామ వెలుగు వంటి వెలుగు నడయాడుతోంది. నొసట శివునికివలె మూడవ కన్నువంటి చిహ్నం ఉంది. అతడి బుజాలపై త్రిశూలం ముద్ర ప్రకాశిస్తోంది. శరీరం స్ఫటికంవలె వెలిగిపోతోంది. జ్యోతిషవేత్తలు ఈ శాస్త్రవచనాన్ని స్మరించుకున్నారు -

**మూర్ధని హిమకర చిహ్నో, నిటలే నయనాం కం ।**
**అంసయో శూలమ్ వపుషం స్ఫటిక సువర్ణం,**
**ప్రజాస్తం మేనిరే శుభమ్ ॥**

జ్ఞాన జ్యోతిని ప్రసరింపజేయడానికి పరమశివుడే స్వయంగా దిగివచ్చినట్లు వారికి అనిపించింది.

శంకరుని బాల్యదశలో ప్రజలలో దుర్భర దారిద్ర్యం తాండవిస్తోంది. వర్ణాల మధ్య, కులాల మధ్య కుమ్ములాటలు చెలరేగుతున్నాయి. రాజులమధ్య వైమనస్యాలూ, కక్షలూ పెచ్చు పెరిగి దేశాన్ని సర్వ నాశనం చేస్తున్నాయి. మత్తు పదార్థాల ఉత్పత్తి, వాడకం పెచ్చు పెరుగుతున్నాయి. మతం పేరిట అంతర్యుద్ధాలు దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. విదేశీయుల దుష్ప్రభావం మితిమీరిపోతోంది. మానవతా విలువలు మంటకలుస్తున్నాయి. మత మార్పిడుల కుట్ర పిశాచంవలె దేశం మొత్తాన్ని కబళించడానికి సిద్ధమై ఉంది. దేశంలోని వయోవృద్ధులు కుటుంబ తాపత్రయాలలో మునిగిపోయారు. యువతరం భోగవిలాసాలలో, విందు వినోదాలలో తలమునకలై ఉన్నారు.

అలాంటి విపత్కర సమయంలో ఎనిమిది సంవత్సరాల శంకరుడు జాతి ముందున్న సవాళ్లు అన్నింటినీ ఎదుర్కొనడానికై

**నిన్ను నీవు సంస్కరించుకో; ప్రపంచంలోని చెడుగుణాలన్నీ నశిస్తాయి.**

దృఢంగా నిలబడ్డాడు. ఆయనలో తపో జ్వాల ఉన్నది. జ్ఞాన జ్యోతి ఉన్నది. సన్యాసంలోని తేజస్సు ఉన్నది.

మహాజ్ఞాని అయిన ఈ సన్యాసి 11 ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు భాష్యాలు రచించారు. విష్ణుసహస్ర నామ భాష్యం, అధ్యాత్మపటం భాష్యం, యోగసూత్ర భాష్య వివరణ రచించారు. అపరోక్షానుభూతి, ఆత్మబోధ, పంచీకరణ ప్రక్రియ, వివేక చూడామణి, ఉపదేశ సాహస్రి రచించారు. దక్షిణామూర్తి స్తోత్రం, సౌందర్య లహరి, శివానంద లహరి వంటి సాధన రహస్యాలతో కూడిన స్తోత్రాలు రచించారు.

అలౌకిక శక్తి కలిగిన ఈ యువ సన్యాసి తన తపస్సుతో, తన జ్ఞానంతో, తన ఆధ్యాత్మిక శక్తుల ప్రచండ సామర్థ్యంతో దేశమంతటిలో నవజాగరణను ఉత్పన్నం చేశారు. ఫలితంగా నాలుగు వందల సంవత్సరాల పాటు జాతి తన స్వాతంత్ర్యాన్ని, సంస్కృతినీ రక్షించుకోగలిగింది. విదేశీయుల దురాక్రమణ నుండి తనను తాను కాపాడుకోగలిగింది. చరిత్ర లోతులు తెలియని వారికి ఇది చిత్రం అనిపించవచ్చు. కానీ, ఇది నూటికి నూరుపాళ్లు నిజం.

శంకర మఠాలలో లభ్యమవుతున్న బృహచ్ఛంకర విజయ గ్రంథం ప్రకారం ఆదిశంకరులు క్రీస్తు పూర్వం 508 నుండి 476 వరకు జీవించారు. కేరళోత్పత్తి అనే గ్రంథం ప్రకారం ఈ సమయం క్రీస్తు శకం 400. ఇతర చరిత్రకారుల ప్రకారం ఇది క్రీస్తుశకం 788. శంకరుల కాలం సుమారు క్రీస్తు శకం 630 అని చరిత్ర వేత్త ఫ్లీట్ నిర్ణయించాడు.

భారతీయ భారతీయేతర శాసనాలు ఆధారంగా ప్రఖ్యాత చరిత్ర వేత్త ఆర్.సి.మజుందార్ ఇలా వ్రాశారు-

రాజులూ, మహారాజులూ అందరూ కనౌజ్ మహారాజు మహిపాల్‌ను ఉత్తర భారతీయ సమ్రాట్టుగా స్వీకరించారు. ఆయన నాయకత్వంలో దేశరక్షణకై సమైక్యంగా పోరాడడానికి సన్నద్ధులు అయినారు. శంకరాచార్యుల కృషి ఫలితంగా దక్షిణ భారతంలోని ధార్మిక నాయకులు, రాజన్య వర్గము తమ మధ్య ఉన్న వైమనస్యాలను విస్మరించి ఏకమైనారు. ఈ రెండు పరిణామాల వల్ల విదేశీ దురాక్రమణ దారులు భారత్‌పై దండెత్తే సాహసం చేయలేకపోయారు. ఉత్తర భారతంలో మహీపాల్ మహారాజు, ప్రతీహార మహారాజు నాగభట్టు, కాశ్మీరు రాజు జయాపీడుడు- ఈ ముగ్గురి సమైక్య శక్తి సింధు ప్రాంతాన్ని విదేశీ పాలననుండి విముక్తి చేసింది. దక్షిణ భారతంలో బెరామెన్ పెరూమల్ వల్ల విదేశీ పాలన తలెత్తుతోంది. రాష్ట్రకూట మహారాజు గోవిందరాజు, చాళుక్య, చోళ, కేరళ రాజుల సైనిక శక్తి తుఫానులా వచ్చిపడి ఆ పరిణామాన్ని చూస్తూ ఉండగానే అణచి వేసింది.

ఈ ప్రమాణాలు ఆధారంగా ఆనాటి భాషలను పేర్కొంటూ ప్రొఫెసర్ మజుందార్, యవన భాష యవన (అరబ్బు) దేశపు భాష అని వ్రాశారు. ఈ చరిత్ర సత్యం కారణంగా శంకర భగవత్పాదులు భారత ప్రజలకు ఇచ్చిన నవజాగరణ మహామంత్రం వెలికి వచ్చింది. ఆదిశంకరులు సింధు ప్రాంతంలో పర్యటించినపుడు విదేశీ దురాక్రమణను ఎదుర్కోవడానికి మార్గం ఏమిటని ప్రజలు ఆయనను ప్రశ్నించారు.

**"హరేర్ నమ సదా, న యామినీ భాషా"** అని ఆది శంకరులు జవాబిచ్చారు. అనగా - హరి నామాన్ని సదా స్మరించు, అరబ్బుల భాషను స్మరించవద్దు.

ఈ నవ జాగరణ మంత్రం ఆనాడు ఇంటింటా మారుమ్రోగింది. విదేశీ భాషనూ, విదేశీ సంస్కృతినీ బహిష్కరించాలనే సూత్రం ఇది. జాతీయతను మేలుకొలిపిన సూత్రం ఇది.

ఆది శంకరులు సాధించిన ఈ నవ జాగరణ ప్రజలలో నవ చైతన్యాన్ని నింపింది. ప్రజలు ఆయనను శంకర భగవత్పాదులుగా ఆరాధించసాగారు. అన్ని మతాల, సాంప్రదాయాల, వర్గాల ప్రజలు ఏకమై ఆయనను సర్వజ్ఞ పీఠంపై అధిష్ఠింపజేశారు. శంకర భగవత్పాదులు దేశంలో ఉత్తరాన బదరీనాథ్‌లో జ్యోతిర్మఠం, దక్షిణాన శృంగేరిలో శృంగేరీ మఠం, తూర్పున పూరీలో గోవర్ధన మఠం, పడమట ద్వారకలో శారదా మఠం స్థాపించారు. ఈ మఠాల ద్వారా జాతిలోని సంస్కృతి సంవేదనను, సంస్కృతి స్పందనను ఒకే సూత్రంతో ఏకీకృతం చేశారు.

శంకర భగవత్పాదులు ఆనాడు తమ తపస్సుతో, త్యాగంతో, జ్ఞానంతో, కార్యశూరతతో, సంకల్ప శక్తితో జాతిలో నవ జాగృతిని నింపారు. స్వభాష, స్వ సంస్కృతి, స్వజాతి అనే ఆ మహా మంత్రాన్ని, ఆ ఏకతా సూత్రాన్ని తిరిగి ఇంటింటికీ ప్రసారం చేయడం ఈనాడు అత్యవసరం. 21వ శతాబ్దంలో జాతీయ నవజాగరణయే శంకర భగవత్పాదుల జయంతి ఇస్తున్న మహత్తర సందేశం.

H H H

**సాహసంతో నిండిన సంకల్పాన్ని మించింది ఏదీ లేదు ఈ ప్రపంచంలో.**

## సాధన విజ్ఞానం

# లోచూపు అలవరచుకో

ఈశ్వరుని పొందడమే మానవ జీవితానికి పరమలక్ష్యం. పరమ సత్యం కూడ ఇదే. పరమసత్యం లభ్యమైనపుడు ఇక పొందవలసిందంటూ ఏదీ ఉండదు. ఇందుకోసమే మానవుని ప్రయత్నం సాగాలి.

సత్యం, తథ్యం అనేవి రెండూ భిన్నమైనవి. తథ్యాన్ని అన్వేషించి తెలుసుకోగలుగుతాము. కానీ సత్యం అలా కాదు. దానికి అన్వేషణ అవసరం లేదు. అంతటా ఉన్న ఆ సత్యం అన్వేషించే వాడిలోకూడ ఉంది. తన వద్ద లేని వాటికోసం వెదకాలి కానీ తనలోనే ఉన్న వస్తువును ఎక్కడని వెదకగలం. మానవుడు తన బాహ్య ఆవరణలు తొలగించుకున్నప్పుడు సత్యం ప్రస్ఫుటమౌతుంది. సాధకునిలో ఆ ప్రకాశం వెలుగొందుతుంది. ఇది అంతర్జగత్తులోకి చేసే ప్రయాణం. ఆధ్యాత్మిక సాఫల్యం.

తథ్యం బాహ్యజగత్తుకు సంబంధించింది. భౌతిక విజ్ఞానానికి సంబంధించిన అన్వేషణలన్నీ ఈతథ్యంపైనే ఆధారపడ్డాయి. తథ్యం చేత విజ్ఞానం శక్తివంతమూ, ప్రామాణికమూ అవుతుంది. విజ్ఞానం నుండి దీనిని తీసివేసినపుడు కేవలం కల్పనలు తప్ప వేరే ఏమీ మిగలవు. ఈ విశ్వం పరబ్రహ్మ ప్రకాశం. విజ్ఞానం తనదైన రీతిలో దాన్ని పొందే ప్రయత్నం చేస్తుంది. భౌతిక పదార్థ సంబంధమైన సత్యాన్ని తెలిసికొని ఆవిష్కరణలు జరిపినపుడు అందరూ తథ్యాన్నే వెదికారు. సత్యం అనేది ఒక్కటే. మిగిలినవన్నీ ఈ సత్యాన్ని నిరూపించే తథ్యాలే. ఈవిశ్వమంతా పరమాణువులతో తయారైందని చెప్పబడుతుంది. ఈ పరమాణు పదార్థం ఒక సముదాయంగా కాక చాలా సముదాయాలుగా విభజింపబడింది. ఈ సూక్ష్మ పరమాణు సముదాయలన్నీ ఒక కేంద్రం ఆధారంగా పరిభ్రమిస్తున్నాయి. భౌతిక విజ్ఞాన సంబంధమైన ఈవిషయాలన్నీ తథ్యాన్నే ప్రకటిస్తున్నాయి. కానీ ఈ తథ్యం కూడా ఆఖరుకు ఏసత్యమైతే ఉందో దానినే నిరూపిస్తుంది. మూలకణాల విచారణ జరిపినపుడు ఉద్భవించే ప్రశ్న ఒక్కటే. ఈగతి శీలతకు మూలమేది? ఈ ప్రేరణ ఎక్కడ నుండి కలిగింది? అని. స్థూలజగత్తులోనైతే సునాయాసంగా ఏదీ ఉండజాలదు. దాని వెనుక ఏదో ప్రేరణ, కారణం ఉండి ఉండాలి. ప్రత్యక్ష్యంగా ఏకారణమూ దొరకనప్పుడు పరోక్షప్రేరణ ఉందని తెలిసికొని అంగీకరించాలి. ఇదే పరమ సత్యానికి ప్రమాణం. స్థూల విశ్వంలో చేసే అన్వేషణలన్నీ తథ్యానికి సంబంధించినవి. అన్వేషిస్తున్నది తథ్యాన్నికానీ సత్యాన్ని కాదు. ఎందువల్లనంటే సత్యం అనేది అనుభూతి జ్ఞానం. అది బుద్ధిద్వారా తెలుసుకోబడ జాలదు. దేన్నైనా తెలుసుకోగల సామర్థ్యం మహాప్రజ్ఞకు తప్ప మరి దేనిలోనూ లేదు. అదే పరమ జ్ఞానం.

కొమ్మనుండి ఒక పువ్వును కోస్తే అది కొన్ని గంటలకే వాడిపోతుంది. వృక్ష శాస్త్రజ్ఞులు ఇందుకు కారణం దానిలోని ఫార్మోలిన్ గ్యాస్ అధిక మొత్తంలో బయటకు పోవడం అని అంటారు. ఈ ప్రక్రియకు మూల మేది? ఒక వేళ ఇది ప్లాంట్ ఫిజియాలజీలో ఒక భాగమైతే అది భౌతికం కావాలి. భౌతిక ప్రక్రియలో ఒక క్రమం లేకపోవడం, అవ్యవస్థ తప్పనిసరిగా ఉంటాయి. యంత్ర ఉపకరణాలు తయారౌతాయి. పని చేస్తుంటాయి. చెడిపోతుంటాయి. మళ్ళీ బాగు పడుతుంటాయి. మార్పు కనబడదు. కానీ వృక్షజగత్తులో కొమ్మనుండి పువ్వును కోశాక అది వాడిపోకుండా సంవత్సరాల తరబడి ఉండడమనేది ఎన్నటికీ జరుగదు. ఈ భౌతిక ప్రక్రియకు ఒక అభౌతిక కారణం ఉందన్న విషయాన్ని అంగీకరించాలి. భౌతికజగత్తు ఈ అభౌతిక కారణం ఉందన్న విషయాన్ని అంగీకరించాలి. భౌతిక జగత్తు ఈ అభౌతిక కారణాలను వందల సంవత్సరాల నుండి అన్వేషిస్తోంది. తథ్యాన్ని కనుక్కుంటోంది. వారు కనుక్కుంటున్న ఈ తథ్యం "ఆదికారణం" నిరూపణతో ముడిపడి ఉంది.

శరీరం మరణ ధర్మం కలది. మరణ ధర్మమేమిటన్న విషయాన్ని గురించి లోతుకు వెళ్తే ఎక్కడి నుండి జీవితం మొదలైందో ఆ బిందువునే చేరుకుంటాము. మృత్యువును గురించి శరీర శాస్త్రజ్ఞులు - వృద్ధ్యాప్యం కారణంగా అవయవాల్లో పటుత్వం తగ్గిపోతుంది, కనుక చైతన్యం వృద్ధ శరీరాన్ని వదిలివెళ్తుంది - అని చెప్తారు. కానీ శరీరం ఆరోగ్యంగా ఉండి వయస్సు ఎక్కువగా లేనివారు కూడ మృత్యువాత పడుతున్నారు కదా! కారణం చూస్తే ఏదో 3,4 రోజులు జ్వరం వచ్చిందనో, 3,4 వాంతులైనాయనో అంటారు. వైద్యులు కూడ పెద్దగా ఆలోచించరు. ఇది జరగాల్సినంత పెద్దకారణం కాదు అంటారు. వయస్సుతో నిమిత్తం లేకుండా శరీరాన్ని వదలాలనే మార్గదర్శనాన్ని చైతన్యానికి ఎవరిచ్చారు? వైద్యుల వద్ద జవాబులేని ప్రశ్న ఇది. ఒకవేళ వ్యాధే కారణమనుకుంటే - అతనికి ఆవ్యాధి ఎందుకు వచ్చింది? పరిస్థితులూ, వాతావరణమే కారణమా? అదే వాతావరణంలో ఉన్న మిగిలిన వారికెవ్వరికీ రాని ఆ రోగం ఇతనికే ఎందుకు రావాలి? ఇలా ప్రశ్న పరంపరలను వేసుకుంటూ వెళ్తే దొరికే సమాధానం

**అందరి సుఖంలో ఇమిడి ఉంది మన సుఖం.**

ఒకటే. అ లౌకిక శక్తి అని. మృత్యు సంబంధమైన వేర్వేరు తథ్యములు అప్రత్యక్ష రూపంలో పరమ చైతన్యాన్నే నిరూపిస్తాయి. మానవుడు యధార్థంగా పొందవలసింది ఈపరమ చైతన్యాన్నే.

ఈ విరాట్ విశ్వం ఈశ్వరీయ చైతన్యానికి సాకారరూపం. ఇక్కడ అణువణువులో పరమాత్మశక్తి ద్యోతక మౌతుంది. మట్టి వస్తువులను చూచినపుడు కుమ్మరిని, యంత్రాలను చూచినపుడు దానిని తయారు చేసినవాడిని, ఇంటిని చూచినపుడు ఇల్లు కట్టినవానినీ, ఇంట్లో వాళ్ళనీ ఊహించుకుంటాం. అదే విధంగా విశ్వంలో అణువణువునా ఆ నియామకుని శక్తి ప్రతిబింబిస్తుంది. ఈ ప్రతిబింబం తథ్యం. సత్యాన్ని సాక్షాత్కరించు కోవటానికి ఇంకా ముందుకు వెళ్ళాలి. తథ్యం ద్వారా ఈశ్వరుని ఎడల విశ్వాసం ఉత్పన్నమౌతుంది. ఈ విశ్వాసం ఆధారంగా అంతరంగంలోని మురికిని కడిగేసుకుంటూపోతే, ఆత్మ ప్రకాశం, ఈశ్వరుని ప్రకాశం ప్రస్ఫుటమౌతాయి. ఇదే మానవుని ముఖ్య లక్ష్యం. కానీ ఈరోజుల్లో దాన్ని పొందే మాట అటుంచి దాని దరిదాపులకు కూడ మనం వెళ్ళలేక పోతున్నాం. సత్యాన్ని చేరుకోవాలంటే మనం పట్టుకునే ఆధారం సత్యమైందిగా ఉండాలి. ఇనుపముక్కల్ని ఆకర్షించడానికి ఇనుప అయస్కాంతం అవసరం. ఉన్నతమైన జ్ఞానాన్ని పొందడానికి సుశిక్షితుడైన ఆచార్యుడు అవసరం. ముల్లుని తీయాలంటే ముల్లే కావాలి. అదే విధంగా సత్య తత్వాన్ని తెలుసుకోవాలంటే వ్యక్తిత్వం సత్యమైందిగా ఉండాలి. అసత్య వ్యక్తిత్వం ద్వారా సత్యాన్ని సాక్షాత్కరించుకోలేము.

ప్రస్తుతం మనం మన జీవన వ్యవహారాల్లో బయటకు కనిపిస్తున్నట్లుగా అంతరంగంలో లేము. మానవుడు తన అసలు నైజాన్ని బయటకు కనబడనివ్వడం లేదు. అసత్యం, మిథ్య అనే ఆవరణాన్ని కప్పుకుంటున్నాడు. ధర్మ గ్రంథాల్ని తొమ్మిది రోజులు పారాయణం చేస్తాడు. కురాన్, బైబిల్ క్రమం తప్పక చదువుతాడు. భగవంతుని విగ్రహం ముందు కూర్చుని పూజలు చేస్తాడు. ఇష్టదైవాన్ని దర్శించుకోవాలని, ఆత్మసాక్షాత్కారం కలగాలని అనుకుంటాడు. కానీ తన వ్యక్తిత్వం మొత్తం అసత్యంపైన ఆధారపడిందని తెలుసుకునే ప్రయత్నం అతను చేయడం లేదు. అటువంటపుడు అతనికి సత్య జ్ఞానమెలా కలుగుతుంది?

సత్యాన్ని పొందాలంటే మన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సత్యంపైన ప్రతిష్ఠింపచేయాలి. వ్యక్తిత్వంలో సాధుత్వం, సరళత, స్వచ్ఛత ఉండాలి. మనలోని చెడును చెడుగా, అసత్యాన్ని అసత్యంగా తెలుసుకోవాలి. సత్యాన్ని చేరాలంటే ఇంకా చేయాల్సి ఉంది. విత్తనం నుంచి చెట్టు విస్తరించినట్లు మన ఆలోచనల్ని విస్తరింపచేయాలి. అప్పుడు మనకు పరమతత్వ సాక్షాత్కారంలో మూడింట రెండు వంతుల సఫలత కలిగినట్లు భావించవచ్చు. మిగిలిన ఒక వంతు ఈశ్వరుని ఎడల శ్రద్ధతో ఉన్నతమైన ఆదర్శాల కోసం సమర్పించుకోవడంలో పూర్తి చేసుకోవచ్చు. కాని ప్రస్తుత కాలంలో ఉన్న బాధ ఏమిటంటే వ్యక్తి తన దుర్గుణాన్ని దుర్గుణమని ఒప్పుకోడు. మంచి దిశగా పయనిస్తున్న మొదటి అడుగునే అణచివేస్తే ఈశ్వరునీ, ఆత్మనూ పొందేదెలా ? ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఎవరైతే చాలా మంచివారని కీర్తింప బడుతున్నారో, వారి వాస్తవ జీవితంలోకి తొంగి చూచినపుడు స్వచ్ఛత, సరళత, సహజత్వం అగుపించవు. ఎవరినైతే అపరాధులనీ, చరిత్రహీనులనీ అంటారో వారిలో సహజత్వము, సరళత కనిపించవచ్చు.

ఈ దోషం కూడా సత్యాన్ని చేరడానికి అవరోధ మవుతుంది. చెడ్డవాడిని చెడ్డవాడుగా, మంచివాడిని మంచివాడుగా చెప్పగలిగితే ఇద్దరికీ శుభం కలుగుతుంది. అలా కానప్పుడు పైకి మంచిగా కనిపించే వారికి ఇంకా ప్రోత్సాహం కలిగి, వారు మారరు. దుర్జనులకున్న ప్రోత్సాహం చూచి మంచితనమున్న వారు కూడా చెడిపోయేందుకు సిద్ధపడతారు. ఈ విధంగా రెండు రకాల వారు కూడా పతనోన్ముఖులై సత్యతత్వానికి దూరమవుతారు. సమాజంలో వాస్తవికతకు రక్షణ ఉంటే మానవులు ఇప్పటి దురవస్థ నుండి విడివడి ఆత్మోన్నతి పొందుతారు. సంస్కృతీ, సభ్యతలు కలవారు అవుతారు.

నేడు ప్రపంచంలో స్థితి దిగజారడానికి కారణం మానవుడు భౌతిక విషయములందు అతిగా అనురక్తుడు అవడం. కానీ ఉండాల్సింది అందుకు భిన్నంగా. మానవుడు అంతర్ముఖుడై చెడును ప్రక్షాళన చేయాలి. తనను తాను శోధించుకుని, పొందవలసిన దాని కోసం ప్రయత్నించాలి. ఆ విధంగా జరగడం లేదు. అందువల్లనే వేల సంవత్సరాల కాలంలో ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మహమ్మదు, ఒక వివేకానందుడు, ఒక అరవిందుడు మాత్రమే జన్మించగలిగారు. ఇది చాలా ఆశ్చర్యకరం, దుఃఖకరం, దౌర్భాగ్యకరం. మానవుడు తన దౌర్భాగ్యాన్ని కడిగేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. అతడు ప్రకృతిలో ప్రవేశించి సత్యాన్ని శోధించే ప్రయత్నం చేయాలి. ఈ స్థూల జగత్తులో తథ్యరూపంలో పరమ సత్యం మనకు ప్రత్యక్షంగా ఉంది. తథ్యం ఆకారం. సత్యం తత్వమూ, నిర్వికారమూ అయిన వాస్తవిక రూపం. అదే ఈశ్వరుడని పిలువబడుతుంది. అందరికీ యదార్థమైన శుభం ఇందులోనే ఇమిడి ఉంది. ఆ పరమ సత్యాన్ని పొందడానికి మనం ప్రయత్నించాలి.

అనువాదం - కె.అరవిందమ్మ

H H H

**శుభ సంకల్పం దేవత. అశుభ సంకల్పం అసురుడు.**

కుటుంబ నిర్మాణం

# బాల్యవివాహాల దుష్ఫలితాలు

మనిషికి వివాహం అనే ఏర్పాటు సాంఘికపరమైన ఒక ఆచారంగా, తప్పనిసరి సంస్కారంగా వస్తున్నది. పిల్లలను పెంచడం, పోషించడం బాధ్యతగా ఎలా భావిస్తారో అదే విధంగా ప్రతి ఆడపిల్లకు, మగపిల్లవానికి వివాహం చెయ్యడం కూడా అంతే అవసరంగా అంగీకరిస్తున్నారు. దీనికోసం ఉపయుక్తమైన వయస్సు రాకముందు నుండే సంబంధాలు వెదకడం ఆరంభిస్తారు.

చాలా వర్గాలలో బాల్య వివాహాలు ప్రచారంలో ఉన్నాయి. ఆడపిల్ల గలవారు ఆలోచించేదేమిటంటే - రేపోమాపో ఒకరింటికి పంపవలసిన పరాయి సొత్తే గదా ఈమె. ఎక్కువ రోజులు ఇంట్లోనే ఉంచుకుని అనవసరంగా తిండీ, బట్టా ఖర్చులు ఎందుకు భరించాలి? ఎక్కడకు పోవలసినదాన్ని అక్కడకు ఎంత త్వరగా పంపిస్తే అంత త్వరగా బరువు తీరిపోతుంది గదా అని. మరొక సౌలభ్యమేమంటే, పిల్ల పెద్దదై ఆలోచించగల శక్తి వస్తే వచ్చిన సంబంధాలకు వంకలు పెట్టి అంగీకరించకపోవచ్చు. ఆమెకు నచ్చిన సంబంధం తేవాలంటే పెద్దపెద్ద కట్నాలు, భారీగా లాంఛనాల వంటివి ఇవ్వవలసి వస్తుంది. అటువంటి అనేకరకాల ఇబ్బందులను ఎదుర్కొనే శక్తిలేక ఆమె బుద్ధి వికసించకముందే చిన్న పిల్లగా ఉన్నపుడే ఈ కార్యం ముగించివేస్తే అన్ని విధాలా శ్రేయస్కరమని భావిస్తారు. బొమ్మల పెళ్లి లాంటి వేడుక. పెత్తనమంతా పెద్దలదే. పిల్ల నుండి ఎటువంటి వ్యతిరేకతా ఉండదు. కనుక సరదాగా పెళ్లి ఉత్సవం చేసి బరువు-బాధ్యత తీర్చుకొనడం వివేకవంతమయిన పని అనుకుంటారు. తర్వాత, కాలం కలిసిరాక సంబంధాలు కుదరక రోజురోజుకీ పిల్ల పెరిగిపోతుంటే కన్నవారికి ఎంత మానసిక వేదన ! అందుకని జీవితంలో ఆచరించవలసిన అతి ముఖ్యమైన పనులలో దీనిని ఒకటిగా జమ చేశారు.

అత్తవారికి కూడా చిట్టిపొట్టి కోడలు పిల్ల ఇంట్లో తిరుగుతూ ఉంటే ముచ్చటగా ఉంటుంది. ఒక మాట అన్నా ఎదురు చెప్పదు. తల్లి తండ్రులు గుర్తుకు వస్తే అప్పుడప్పుడూ పుట్టింటికి పంపిస్తూనే ఉంటారు. రెండిళ్లనూ తనవిగా భావించుకుని అందరితో కలసిపోతుంది. అదే తరుణ వయస్కురాలైతే అత్తవారింట్లో ఇమిడి పోవడం కొంచెం కష్టంగా ఉంటుంది. అప్పటికే ఆమెకు తనకంటూ ఒక వ్యక్తిత్వం ఏర్పడి పోయి ఉంటుంది కాబట్టి.

బాల్య వివాహాలను సమర్థించేవారు పై విధమైన తర్కాన్నే ఆశ్రయిస్తారనుకోవచ్చు. దీనికుండే రెండో భాగం గురించి ఆలోచించకపోవడం వలన తమ సిద్ధాంతమే సరైనదని గాఢంగా నమ్ముతారు.

ఈ హడావుడి, తొందరపాటు అలా ఉంచి, ఈ వ్యవహారానికుండే రెండో వైపు చూడగలిగితే - అది మన బిడ్డల భవిష్యత్తును ఎంత నష్టపరుస్తున్నదో, ఎంత నిర్వీర్యం చేస్తున్నదో తెలుస్తుంది. జరిగే నష్టాలలో మొదటిది - ఆడపిల్లకు చదువుకునే అవకాశం శాశ్వతంగా మూసుకుపోతుంది. పెళ్లినాటికి పుట్టింట్లో ఉండి ఎంత చదువుకుని ఉంటుందో అంతే. అక్కడితో ఫుల్‌స్టాప్ పడిపోతుంది. కోడలుగా మారిన తర్వాత సిగ్గు, బిడియం, ఎవరేమనుకుంటారో అన్న శంక ప్రతిబంధకాలుగా మారుతాయి. అంతేకాక కోడళ్లు స్కూలుకి వెళ్లి చదువుకునే ఆచారం లేదు. అత్తవారింట్లో జనం ఆమె ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ తమకు చేదోడు వాదోడుగా ఉండాలని, తమ బరువు బాధ్యతలు తగ్గించాలని కోరుకుంటారు. ఆమె ఖర్చులన్నీ భరించవలసింది తామే గదా ! అందుకు బదులుగా కొంత పని చేయించుకోవడంలో తప్పేముందీ ? సర్వత్రా సాగుతున్న పద్ధతి ఇదే.

అంతేకాక - ఇంట్లో ఉన్న అత్తగార్లు, తోటికోడళ్లు మొదలైన స్త్రీలు అక్షరజ్ఞానం అంతంతమాత్రం కలవారే అయి ఉంటారు. అలాంటప్పుడు అందరిలోనూ క్రొత్త కోడలు ఒకర్తీ చదువుకున్నదైతే, ఆమె ప్రతివిషయంలో తన యోగ్యతను ప్రదర్శిస్తూ ఉంటుంది. తనను గొప్పగా భావించుకుంటూ మిగిలినవారిని చిన్న చూపు చూస్తుంది. అందుచేత ఆమె అందరిలా ఉండడం అన్ని విధాలా శ్రేయస్కరంకదా. అలా ఆమె చదువుకు గంట కొట్టబడుతుంది. బాల్యవివాహాలలో ఉండే మరో లాభం ఏమిటంటే, చిన్న పిల్లల పెళ్లి సందర్భంగా పెద్దగా ఆర్భాటాలు చేయనక్కరలేదు. దానివల్ల ఖర్చులు ఆదా అవుతాయి. వియ్యాలవారు కూడా కొద్దిలోనే తృప్తిపడిపోతారు. పెళ్లి కూతురు చిన్నపిల్ల అవడాన స్వంత ఇష్టాలంటూ ఉండవు. అది కావాలి ఇది కావాలి అన్న పేచీలూ ఉండవు. వరకట్నం గురించి కూడా పెద్ద బేరసారాలు జరగవు. చిన్నపిల్ల వాడవటాన అతని విలువ స్పష్టంగా చెప్పలేరు గదా! ఎంతో కొంత ముట్ట చెపితే చాలు. లాంఛనాలు - మర్యాదలు వంటి వాటి దగ్గర కూడా గొడవలేమీ రావు. అందినవాటితోనే సంతోషపడతారు. ఈ విధంగా ఇరువైపులా కొద్దిపాటి ఖర్చుతో పెళ్లితతంగం ముగిసిపోతుంది.

**ఒక చేతిలో ధర్మాన్నీ, మరో చేతిలో పురుషార్థాన్నీ ధరించు.**

ఇటువంటి సౌకర్యాలు, సులువులు చూసుకొని ఇప్పటికీ వెనుకబడిన ప్రాంతాలలో బాల్యవివాహాలు చేస్తూనే ఉన్నారు. ప్రత్యేకంగా అవిద్యావంతులు, వెనుకబడిన వర్గాల వారిలో జరుగుతూనే ఉన్నాయి. ఆడపిల్లకు 18 సంవత్సరాలు, మగపిల్లవానికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చెయ్యాలని ప్రభుత్వం చట్టం చేసినప్పటికీ దాన్ని అమలులో పెడుతున్నది విద్యావంతులు, నగరవాసులు మాత్రమే. విద్యావ్యవస్థ అందుబాటులో ఉన్నచోట ప్రజలు తమ కుమార్తెలను కూడా మగపిల్లలతోపాటుగా చదివిస్తున్నారు. కాని ప్రాథమిక స్థాయి పాఠశాల కూడా సరైనది లేని ప్రదేశాల్లోని జనం పిల్లలను ఎలా చదివించగలుగుతారు? అందునా ఆడపిల్లలను పొరుగూరు పంపి చదివించడమన్నది అందరికీ సాధ్యమయే పని కాదుగదా! యుక్త వయస్కులైన తర్వాత మగపిల్లలతో కలిసి చదువుకొనడాన్ని ఇంకా అందరూ ఆమోదించ లేకపోతున్నారు. అందుచేత ఆడపిల్ల చదువు వ్యవహారం అంతటితో ఆగిపోతే ఇక ఆమె బరువు వదిలించు కోవాలనుకోవడం, అందుకోసం హడావుడి పడడం తెలివైన పని కాకపోయినా సహజమైనదిగా అనిపిస్తుంది కదా!

ఇందులో వాళ్లకు కనిపించే మరొక లాభమేమిటంటే, చిన్న వయసుకావడాన స్వంత బుద్ధి, స్వంత ఆలోచన అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవు. అందుచేత ఎటువంటి కుటుంబంలో పడ్డా, అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నా అందుకు అనుగుణంగా మారి పోగలుగుతారు. తమకు నచ్చని వ్యవహారాలున్నా వాటిని వ్యతిరేకించాలన్న ఆలోచనలేకపోగా అది తమ తలరాతగానో దురదృష్టంగానో ఎంచి సర్దుకుపోతారు. అదే పరిణితి చెందిన యువతి అయితే తప్పక పరిస్థితులతో, వ్యక్తులతో పోరాటం చేయడానికో లేదా వ్యతిరేకించడానికో సిద్ధపడుతుంది. అనుకూలం లేని కుటుంబంలో ఇమిడి పోవడం కష్ట సాధ్యమవుతుంది. ఆమె తన రూప సంపద, విద్య, పుట్టింటి గొప్పతనం, తాను తెచ్చిన వరకట్నం, తన కాళ్ల మీద తను నిలబడగల శక్తి మొదలైన ప్రత్యేకతల విలువలు ఎరిగినదై ఉంటుంది. పర్యవసానంగా వారు ఒక హద్దు వరకే కుటుంబంలో కలిసిపోగలుగుతారు. ఇంట్లో సభ్యులు ఎవరైనా కటువుగా మాట్లాడడం, వ్యంగ్యంగా విమర్శించడం, అవమానించడం, పరిహాసాలాడడం వంటి వ్యవహారాలను కూడా సహించలేరు. పుట్టింట్లో పనిపాటలు చేసే అలవాటులేనందున అత్తవారింట్లో తోటికోడళ్ల చేసినంత చురుగ్గా అధికంగా పనులు చేయలేరు. భర్త సంపాదనాపరుడైతే ఇక కాపురానికి వచ్చింది మొదలూ వేరు కాపురం పెట్టాలని కోరుకుంటారు. కుటుంబంలోని ఇతర సభ్యులు అంగీకరించకపోయినా భర్త మీద అనేకరకాలుగా ఒత్తిడి తెచ్చి ఒప్పుకునేలా చేస్తారు. ఆ పరిస్థితిలో ఉమ్మడి కుటుంబం నుంచి సంపాదించే కొడుకు వేరుపోతే ఉమ్మడి ఆదాయంలో కొంత నష్టపోయినట్లే కదా! దాని ఫలితం కుటుంబం మొత్తం మీద పడుతుంది. ఇటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలని మగపిల్లవాడి తాలూకు వారు కూడా తమ కొడుక్కు చిన్న వయసులోనే వివాహం జరిపించి చిన్నపిల్లనే కోడలిగా తెచ్చుకోడానికి సుముఖంగా ఉంటారు. చదువుకున్న కోడళ్లు అత్తవారింట్లో చేసే ఆగడాలు, వారి తెలివి మీరిన ప్రవర్తన, గడుసుతనం చూస్తూ ఉండడం వలన వారి జాగ్రత్త వారు పడుతుంటారు. అంతేకాక చిన్నప్పటినుండే పిల్లవాడి మనసు మీద కుటుంబపు బరువు బాధ్యతలు పడితే అతడు తన నడవడికను అందుకు అనుగుణంగా మార్చుకుంటాడు. సమర్థత కూడా పెరుగుతుంది. తాను వివాహితుడైనందున మర్యాదస్తుడుగా మెలగుతూ ఉంటాడు. బాధ్యతలు లేని కుర్రకారువలె అల్లరి చిల్లర తిరుగుళ్లకు, వ్యసనాలకు అలవాటుపడరు. పెళ్లి అయినవాళ్లు ఇంటి పట్టునే ఉంటారు. దానివలన విశృంఖలతకు అవకాశాలుండవు. ఆడపిల్లల విషయంలో కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది. వయసు పెరిగే కొద్దీ స్కూళ్లలో కాలేజీల్లో తోటివారిని చూసి తాహతు ఉన్నా లేకున్నా ఫేషన్లకు, ఆడంబరంగా ఉండే వేషధారణకు అలవాటు పడతారు. తమ గొప్పతనాన్ని చాటుకొనాలన్న తపన ఆరంభమవుతుంది. కుటుంబ పరిస్థితి బాగుండకపోయినా తమకు కావలసిన అలంకరణ సామాగ్రి, ఖరీదైన దుస్తులు, సినిమాలు షికార్లు మానుకోరు. ఇదంతా వారు అమాయకత్వంతోనే చేస్తున్నప్పటికీ దీని ఫలితం వారి భవిష్యత్తును దెబ్బతీయక మానదు. ఫేషన్లను అనుకరించడం ఖరీదైన విషయమేకాక వాటికోసం గంటలకొద్దీ సమయాన్ని ఖర్చు చేయవలసి ఉంటుంది. దుస్తులను ఇస్త్రీ చేయించడం, భద్రపరచడం, ముఖానికి రకరకాల క్రీములు పూయడం, లోషన్లతో కడగడం, జుట్టును కత్తిరించు కోవడం వంటి పనులు పెద్ద భారంగా తయారవుతాయి. దానితో వారు వివాహం గురించి ఆలోచనలో పడతారు. తమ కోరికలను నిమిషాల మీద తీర్చగల సమర్థుడు, ధనవంతుడు, విద్యావంతుడు భర్తగా లభిస్తే ఇక కావలసినదేముంటుంది! ఇంట్లో పనిపాటలు నౌకర్లు చేస్తారు. భోజనం వేళకు వంట మనిషి రుచికరమైన వంటలు సిద్ధం చేసి డైనింగ్ టేబుల్‌పై సర్దిపెడుతుంది. తాను, భర్త కలసి పార్టీలకి, షాపింగులకి, సైట్ సీయింగ్‌లకి కార్లలో తిరుగుతూ ఉంటారు. ఇవీ వాళ్లు కనే పగటికలలు.

సామాన్యంగా మనదేశంలోని సగటు ఆడపిల్ల పరిస్థితి ఎలా

**న మాతః పరదైవతమ్ - తల్లిని మించిన దైవము లేదు.**

ఉంటుందంటే, చిన్న వయసులో తల్లిదండ్రుల అదుపాజ్ఞలకు లోబడి ఉండాలి. వివాహమైన తర్వాత భర్త చెప్పుచేతల్లో నడవాలి తప్ప తన కంటూ స్వంత అభిప్రాయాలుగాని, స్వంత నిర్ణయాలుగాని ఉండరాదు. ఎంత చదువుకున్నా ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా వీళ్లకు లోబడే ఉండాలి. వివాహ విషయంలో కూడా అంతే. పెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉండాలి తప్ప తన అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఉండదు. నీకిష్టమా కాదా అని ఆమెను అడగరు. మగవాడు తనకు నచ్చిన అమ్మాయిని బాహాటంగా ఎన్నుకోగలుగుతాడు. అందం ఉన్నచోట ఇతర లక్షణాల లోటు ఉండవచ్చు. దాని వలన యువతీ యువకులకు తమ కలలను నిజం చేసుకునే అవకాశా లుండవు. ఆడపిల్ల తగినంత కట్నం ఇచ్చుకోలేక నచ్చిన సంబంధం వదులుకోవలసి వస్తే, మగపిల్లవాడు డబ్బు అవసరం తీర్చుకోడానికి పిల్ల నచ్చకపోయినా కోరిన కట్నం ఇవ్వగల అమ్మాయిని వివాహమాడవలసి వస్తున్నది. అటువంటి పరిస్థితులలో వారు తమ దురదృష్టాన్ని నిందించుకుంటూ అసంతృప్తితో కాపురాలు చేస్తుంటారు. టి.విలు, సినిమాలు వారి అసంతృప్తి అనే అగ్నిలో ఆజ్యం పోస్తుంటాయి. అందులోని అందమైన హీరో హీరోయిన్లు, వైభవోపేతమైన వారి జీవిత విధానం, హీరోల ధైర్య సాహసాలు ఇవన్నీ అసహజమైన సంఘటనలని తెలిసినా జీవితభాగస్వామితో ఏర్పడిఉన్న అసంతృప్తికి బలం చేకూరుస్తుంటాయి. కోరికల గుర్రాలను పరుగులు పెట్టేలా ఉద్రేక పరుస్తుంటాయి.

ఇటువంటివే కాక వివాహసమయంలో ఇచ్చే విందులు, వినోదాలు, ఆభరణాలు, సామాను మొదలైనవి కూడా అల్లుడిని సంతోష పెట్టడానికే భరించవలసి వస్తుంది. ఈ కరవు రోజుల్లో కుటుంబ భారాన్ని మోయడమే ఎంతో కష్టంగా ఉన్న దశలో పెళ్లి ఆడంబరాలు అదనపు భారం. అయినా తప్పదు. వాళ్ల పరిస్థితులు, ఇబ్బందుల గురించి ఎవరికి కావాలి! ఆడపిల్లను కన్నందుకు జరిమానా రూపంలో వీలున్నంత వరకూ ఏదో ఒక పేరుతో పిండుతూనే ఉంటారు. అవి లభించనప్పుడు అనేకరకాల భేదాభిప్రాయాలు రెండు కుటుంబాలమధ్య తలెత్తుతుంటాయి. వధూవరుల మధ్యకూడా ఇదే విషయంలో అగాధం ఏర్పడుతుంది. వాటి వలన ఉత్పన్నమయే దుష్పరిణామాల గురించి ఒళ్లు గగుర్పొడిచే వివరాలు వార్తాపత్రికల్లో చదువుతూనే ఉన్నాము. కొన్ని ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాము.

ఇవన్నీ ఆలోచించి దర్జాలు, ఫ్యాషన్లు, వాళ్ల రూప సౌందర్యం మొదలైన వాటిగురించి పిల్లలలో ఆలోచన తల ఎత్తకముందే బాల్య వివాహం చేయడం ఉత్తమమన్న నిర్ధారణకు వస్తున్నారు. అనుభవజ్ఞులైన సంరక్షకులు ఇరువైపులా ఉన్న శక్తి సామర్థ్యాలు బేరీజు వేస్తారు. అన్నిటిలో పొదుపు - మితవ్యయం పాటించి తప్పని సరిగా పూర్తి చేయవలసిన ఆ జంజాటాన్ని వదిలించుకొని తల మీదనించి పెద్ద బరువు దించుకున్నట్లు భావిస్తారు.

ప్రజల మనసుల్లో నాటుకుపోయి ఉన్న ఈ లాభాలు, విలువల వెనుక ఉన్న దుష్పరిణామాల గురించి తెలియ చేయవలసిన బాధ్యత నేటి యువతరంపై ఉన్నది. గ్రామాలలోను, వెనుకబడ్డ వర్గాలలోనూ సాగుతున్న ఈ ఆచారంముందు చట్టం చేసే నిబంధనలు అశక్త మౌతున్నాయి. తరాలుగా వాళ్ల మనసు పొరల్లో పాతుకు పోయిన నమ్మకాలలోని నష్టాల గురించి విసుగు లేకుండా చెప్పి ఒప్పించాలి. ఈ దురాచార నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ నడుం కట్టాలి.

విజయకుమారి

a a a

## రాక్‌ఫెల్లర్ నిరాడంబరత

విశ్వంలోని అత్యధిక ధనవంతులుగా నిర్ధారణ గావించబడిన నల్గురిలో రాక్ ఫెల్లర్ ఒకరు. ఈయన తన కఠోర పరిశ్రమ, నాయకత్వ లక్షణాల ద్వారా పైస్థితికి చేరుకొన్నాడేగాని తాతల మూటల వల్ల ఎంత మాత్రం కాదు. ఈయన తల్లి చిన్న కోళ్ల ఫారం నడిపేది. ఆమె పనిలో సహాయపడుతూ ఉండటం వలన ఈయనకు నెలకు ఒక డాలరు కూలి డబ్బులు లభించేవి. ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ స్వేదబిందువులతో నేలను తడిపి నూనెతో వ్యాపారాన్ని చేసి కోటీశ్వరుడు కాగలిగాడు. ఈయన తరువాత అనేక సంస్థలను స్థాపించి నూరుకోట్ల డాలర్లు ఖర్చు చేసేశాడు. నడుస్తున్న అనేక సంస్థలకు కోట్లరూపాయలు విరాళాలిచ్చేవాడు. అయినా ఈయన గొప్పతనమేమంటే సదా వినమ్రుడై మితవ్యయంతో, సాదాజీవితం గడుపుతూ ఉండేవాడు. ఈయనను ఇంత వానిని చేసిన ఈ లక్షణాలను మాత్రం ఏనాడూ వదలిపెట్టలేదు.

పరమార్థ పథగాములైన ఇటువంటి వ్యక్తులవలన గోరింటాకు రుబ్బినవారి చేతులు పండినట్లే ప్రపంచానికంతకీ కీర్తి, వైభవం లభిస్తూ ఉంటాయి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**అభ్యాసం లేని విద్య జీర్ణంకాని భోజనం.**

## సమాజ నిర్మాణం

# కుల భేదం ఒక భయంకర శాపం

భారతదేశం పరాధీనమగుటకు గల అనేక కారణాలతో ఒకటి మనలో ఉన్న కుల భేదం. ఒక దేశవాసులైనప్పటికీ ఈ కుల భేదాలవలన ఇక్కడ నివసించే ప్రజలలో జాతీయతాభావం కానరావడం లేదు.

విదేశీయుల ఆక్రమణ కాలంలో ఈ దేశం చిన్నచిన్న రాజ్యాలుగా విభజన పొంది ఉండడం పరాధీనతకు ఒక కారణమైతే, ప్రజలు కులాల వారీగా విభజించబడి ఎవరికి వారు గిరిగీసుకుని కూర్చోవడం మరొక బలమైన కారణం. విదేశీయులు మన దేశంపై దండెత్తి ఒక రాజుతో యుద్ధం చేస్తున్నపుడు పొరుగు రాజులెవరూ అతనికి సహాయపడేవారు కారు. దీనివల్ల అతి సులభంగా విదేశీ దురాక్రమణ దారులు ఒక్కొక్క రాజ్యం చొప్పున భారతదేశంలోని రాజులందరిని ఓడించి వారి రాజ్యాన్ని తమ సామ్రాజ్యంలో కలుపుకొనడమో, వారిని తమ ఆధీనంలో ఉంచుకోవడమో చేసేవారు.

భారతదేశపు రాజుల మధ్య ఉండే విభేదాలు, కలహాలు, అనైక్యత మొదలైనవి కేవలం రాజకీయపరమైనవి కావు. వాటిలో వంశగతమైన, కులగతమైన భేద భావాలు, ఉచ్చ-నీచ కులములనే భావనలు ఎక్కువగా కలిసి ఉండేవి. రాజపుత్ర క్షత్రియ రాజులలో ఇతర జాతుల వలె వంశపు గొప్పతనం గురించిన భేదభావా లుండేవి. రాజపుత్ర రాజులలో ఉన్న ఈ వంశభేద భావాన్ని అడ్డం పెట్టుకుని విదేశీ ఆక్రమణకారులు బాగా లాభం పొందారు. వారి శౌర్యపరాక్రమాలను నీరు కార్చి తమ సామ్రాజ్యపు వేళ్లను భారతదేశంలో లోతుగా పాతుకునేలా చేయగలిగారు.

ఈ కులగర్వం రాజులను పరాధీనతకు, రాజ్యాలను కోల్పోవడానికి సైతం పాల్పడచేసిందంటే సామాన్య సమాజంలో ఇది చేయలేని పనంటూ ఏముంటుంది ! ఈ రాజులు ప్రజల క్షేమం పట్ల, రాజ్యం పట్ల తమకుండ వలసిన బాధ్యతను మరిచిపోయి, జాత్యహంకారానికి వశీభూతులై పొరుగు రాజులపై ఉండే కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవడానికి విదేశీయులతో చేతులు కలిపేశారు. వారికి సహాయ సహకారాలందించే వారు. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లు - సామాన్య ప్రజలు దురాక్రమణదారుల అత్యాచారాలు చూసి సంతోషపడుతుండే వారు. అగ్రకులాల వారు నిమ్నజాతి వారిని నాశనం చేయడానికి ఆక్రమణకారులకు మద్దతు నిచ్చేవారు. ఇటు నిమ్నకులస్థులు కులం పేరుతో, వంశం పేరుతో అగ్రజాతి వారి బాధలు భరించలేక, వారి తిరస్కారాలను సహించలేక విదేశీయుల పంచకు చేరేవారు. వారి మతాన్ని స్వీకరించి వారితో కలిసిపోయేవారు. భారతదేశంలో నేటికీ మేవ, మలకాన్, ఘోసియా మొదలైన రూపాలతో ముసల్మానులుగా మారిన హిందూ కులాలు కనబడతాయి. సరహద్, ఆఫ్ఘనిస్తాన్‌లలోని పఠానులు నిక్కమైన రాజపుత్ర వీరులు. (అప్పటి భారతదేశపు ప్రవేశ ద్వారం "ఆవాగమన్‌స్థాన్" పలుకుబడిలో మార్పు చెంది ఆఫ్ఘనిస్తాన్ అయింది). దురాక్రమణదారులను నిలువరించేందుకై సరిహద్దులో కాపలాగా అక్కడే ఉండి పోయేవారు. భారతీయుల దురహంకారం, కులగర్వం వారిని రాజపుత్రులుగా చూడడం మాట అటుంచి హిందువులుగా అయినా అంగీకరించలేదు. దేశవాసులవల్ల బహిష్కృతులైన ఆ వీరులు గత్యంతరంలేని పరిస్థితిలో విదేశీయుల మతంలో కలవకతప్పలేదు.

రాజపుత్రరాజులు, సైనికవర్గాల మధ్య అహంకారంతో కూడిన కుల భేదభావం, అగ్ర - నీచ వర్గములనే వైమనస్యం లేకున్నట్లయితే, అందరిలోనూ సమానభావము సోదరభావము ఉండి ఉంటే మనదేశం మీదికి ఇన్ని వైపులనుండి ఇంతమంది దురాక్రమణదారులు రాగలిగేవారే కాదు. ఒకవేళ వచ్చినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయగలిగేవారు కాదు. అటునుంచి అటే పలాయనం చిత్తగించవలసి వచ్చేది. మనుషుల మధ్య ఆత్మీయత, జాతీయభావాలు ఉన్నంతకాలం భారతదేశపు శౌర్య పరాక్రమాలు తేజోవంతంగా ఉన్నాయి. సంకుచిత భావాలు పెరిగిన కొద్దీ అవి మసకేసిపోయాయి. తిరిగి అవి పూర్వపు వైభవాన్ని ఎప్పుడు పొందుతాయో!

ఇప్పుడు భారతదేశంలో కనపడుతున్న హిందూయేతర సమాజాలలో 80శాతంపైగా జనం ఒకప్పటి హిందువులే. అగ్రవర్ణాలలో పాతుకుపోయి ఉన్న కుల దురహంకారం, తిరస్కారాలతో భయకంపితులై అన్యమతాలలో కలిసిపోయినవారే వీరంతా. నేటికీ వర్గాలకు వర్గాలు, గ్రామాలకు గ్రామాలు ఇతర మతాలలో కలిసి పోతుంటే కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప దానిని నిరోధించే చర్యలేవీ చేపట్ట లేదు. మేధావులంతా మౌనంగా ఉండి పోయారు. దాన్ని గురించి ఆలోచించేవారే లేకపోయారు.

ఈ కుల భేదమనేది హిందువులకు మతపరమైన విషయమూ కాదు, వైజ్ఞానిక పరమైన వ్యవస్థా కాదు. ఇది ఒక విధమైన సాంఘిక దురాచారం, మరొకరకంగా సాంఘిక దుర్గంధం కూడా, శతాబ్దాల నుండి జరుగుతున్న రాజకీయ మార్పులు చేర్పులనుండి, మారే మత ధోరణుల నుండి ఆవిర్భవించిన రాచపుండు ఇది.

బ్రాహ్మణులు పేదరికంలో ఉన్నా అధ్యాపనకు ప్రతిరూపాలుగా పొందే గౌరవ మర్యాదలతో సంతృప్తి పొందారు. క్షత్రియులు రాజ దండాన్ని చేజిక్కుంచుకొని అందులో నిమగ్నులైపోయారు. వైశ్యులు వర్తక వ్యాపారాలు, సమాజంలోని సంపూర్ణ అర్థవ్యవస్థ మీద ఏక ఛత్రాధికారం లభించడంతో సంతోషంగా ఉండేవారు. ఈ మూడు

**సజ్జనుల సంపదలు పరోపకారానికే.**

వర్ణాలవారు ధనమూ, దర్పమూ, అధికారముల బలం ప్రయోగించి శూద్రులను తమ సేవలకు వినియోగించు కున్నారు. ఈ విధంగా ఈ నాలుగు వర్ణాలు ముఖ్యమైన నాలుగు విభిన్న కులాలుగా రూపొందాయి. ఎవరి వృత్తి ధర్మాలను వారు నిరాటంకంగా పాటించుకున్నారు.

అయితే, సమాజ వికాసం జరిగి జనాభా అవసరాలు పెరగడంతో ఒక వృత్తివారు మరోవృత్తిలోకి జొరబడక, ఆయాపనులు చేపట్టక తప్పలేదు. వృత్తితో సంబంధంలేకుండా వివిధ వర్ణాలమధ్య పెళ్లి పేరంటాలు కూడా జరిగాయి. ఇలా కుల సంకరం నుండి పుట్టినవారు ఒక కులంగా రూపాంతరం చెందితే, వ్యాపారము - వృత్తులు, బ్రతుకు తెరువుకు సాధనాలైన దేశాంతరయానం, ఆహార - విహారాలు, ఆచార - విచారాలు ఆధారంగా మరికొన్ని కులాలు పుట్టుకువచ్చాయి. ఆవిధంగా కులాల నుండి ఉపకులాలు, వాటినుండి మఱికొన్ని కులాలు, ఈవిధంగా పెరిగిపోయాయి.

హిందువులు మతానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. మత గురువులపై అపారమైన భక్తి శ్రద్ధలు కలిగి ఉంటారు. వారి నోటివెంట వచ్చే ప్రతి మాటను వేదవాక్కుగా శిరసావహిస్తారు. మతపరంగా లాభం పొందజూచే గురువులు, మఠాధిపతులు దీనిని సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టారు. తమను ఎవరు ఎక్కువగా గౌరవించి కానుకలతో సత్కరిస్తారో వారిని గొప్పగా చూచేవారు, తమను లెక్కచేయని వారిని తక్కువగా చూడడమే కాక వీలుదొరికి నప్పుడల్లా వారిపై కక్షసాధించ చూసేవారు. చిన్నచిన్న తప్పిదాలకే సామాజిక బహిష్కార శిక్ష వేసేవారు. కొద్దిపాటి పొరపాట్లకే కులం నుండి వెలి వేసేవారు. ఆరోజుల్లో పీఠాధిపతులు నిర్దయగా, నిరంకుశంగా ఉండేవారు.

హిందువుల మధ్య వైమనస్యానికి పైన చెప్పబడిన కారణాలేకాక ఆక్రమణదారుల కుట్ర కూడా మరోబలమైన కారణంగా చెప్పాలి. విదేశీయులు భారతదేశంలో కాలుపెట్టింది ఇక్కడ నివసించడానికి, ఈ దేశాన్ని జయించడానికే కాదు. ఇక్కడ ఉన్న హిందూమతాన్ని పూర్తిగా తుడిచిపెట్టి తమ మతాన్ని స్థాపించాలన్నదే వాళ్ల ముఖ్యమైన కోరిక. తమ కోరిక తీర్చుకోవడానికి వాళ్లు కత్తులు, కటార్లు ఉపయోగించి, దానికి వందరెట్లు ఎక్కువగా భేద నీతిని ప్రయోగించారు. విభజించు - పాలించు అన్నది విదేశీయుల కుటిల రాజనీతి.

## కుల భేదాల పుట్టుక

అతి జటిలమైన, మహాదుర్భేద్యమైన ఈ ఉచ్చ - నీచ కులాలకు మూలం ఏమిటి? అని పరిశోధిస్తే అతి ప్రాచీన సాహిత్యంలో కేవలం నాలుగు వర్ణాల గురించిన ప్రస్తావనయే కనపడుతుంది. నేటి విద్వాంసులు ఋగ్వేదంలోని ఈ మంత్రాన్ని ముఖ్యమైన ప్రమాణంగా తీసుకుంటారు -

బ్రాహ్మణోస్య ముఖమా సీ ద్బాహూ రాజన్యః కృతః ।
ఊరూ తదస్య యద్వైస్యాః పదభ్యాం శూద్రో అజాయత ॥

ఈ మంత్రంలోని అసలైన అర్థం ఇది - "సమాజరూప శరీరమునకు జ్ఞానవంతులైన బ్రాహ్మణులు ముఖము (శిరస్సు) వంటివారు. క్షత్రియులు భుజముల వంటివారు. వైశ్యులు మధ్యభాగమైన ఉదరము వంటి వారు. శ్రామికులు (శూద్రులు) కాళ్ల వంటివారు. అయితే ఒకటికి పది అర్థాలు చెప్పడమే విద్వత్తు లక్షణమని నమ్మే పండితులు ఈ శ్లోకానికి తమదైన బాణిలో అర్థం ఇలా చెప్పారు - బ్రాహ్మణులు భగవంతుని ముఖం నుండి జన్మించారని, క్షత్రియులు భుజాలనుండి జన్మించారని, వైశ్యులు ఉదరమునుండి శూద్రులు పాదాలనుండి జన్మించారని వ్యాఖ్యానించసాగారు. అమాయక ప్రజలు అదే నిజమని నమ్మారు. ఈ పండితుల ఉద్దేశ్యం బహుశ ఇది కావచ్చు - మానవదేహంలో ముఖమున్న భాగం అన్నిటికన్నా విలువైనదిగా భావించబడుతుంది. పాదాలు మంచి చెడు అన్న వివక్షలేకుండా అన్ని స్థానాలను స్పర్శిస్తూ తిరగవలసి వస్తుంది కనుక బ్రాహ్మణులు అందరికన్నా శ్రేష్ఠులు, శూద్రులు నికృష్ట స్థానం నుండి పుట్టినందున హీనులని వారి ఉద్దేశ్యం. కానీ ఈ అర్థాలు బుద్ధి హీనతను, అపరిపక్వతను తెలియజేస్తాయి. భగవంతుడు గారడీవానిలా తన ముఖం నుండీ, చేతులనుండీ, కాళ్ల నుండీ మనుషుల్ని పుట్టిస్తూ ఉండడు. తత్వశాస్త్రం మనుషులకు పరమాత్మతో ఏవిధమైన ప్రత్యక్ష సంబంధాన్నీ అంగీకరించదు. ఈ విశ్వంలోని సమస్తం ప్రకృతి నుండే ఉత్పన్న మవుతుందని చెపుతుంది. ఆత్మను మాత్రం పరమాత్మ అంశగా తప్పక అంగీకరిస్తుంది. అందరికీ, అన్నిటికీ స్థూల సూక్ష్మ శరీరాలను ప్రకృతే ప్రదానం చేస్తుందని చెపుతుంది దర్శన శాస్త్రం.

అందువలన పైన పేర్కొన్న వేదమంత్రము కర్తవ్య విభజనను మాత్రమే పరిచయం చేస్తున్నదని తెలుసుకోవాలి. దానిని వేరు కులాలుగా ఎక్కువ - తక్కువలుగా నమ్మడం అజ్ఞానానికి చిహ్నం.

## కుల భేదం వల్ల హాని

భారతదేశంలో ఈ కులభేదాన్ని పాటించే ఆచారం, మూర్ఖపు పట్టుదల సమాజంలోని విభిన్న సముదాయములలో వేర్పాటు భావనను కలిగించేవిగా తయారైనాయి. ఈ భావన దేశానికి ఎంత హాని కలిగిస్తున్నదో ఎవరూ గుర్తించలేక పోతున్నారు. హిందూ సమాజం ముఖ్యంగా దీనివల్లనే బలహీనపడింది. ఇప్పుడు దాని సంఖ్య ప్రపంచంలోని ఇతర జాతులు, మతాల కన్నా తక్కువగా ఉన్నది. గడచిన వందా, నూట యాభై సంవత్సరాలలో క్రైస్తవులు పదిరెట్లు, ముసల్మానులు నాలుగు రెట్లు పెరిగారు. హిందువులు ఒకటిన్నర లేక రెండు రెట్లు పెరిగారు. హిందువుల్లో ఈ కులభేద భావన లేనంతకాలం విదేశాలనుండి వచ్చే విభిన్న జాతులవారు సహజంగా హిందువుల్లో కలిసిపోయేవారు. హిందువుల సంఖ్య, శక్తి పెరుగుతూ ఉండేది. కనిష్కులు, హువిష్కులు విదేశీయులైనప్పటికీ భారతీయ సమాజంలో ఒక భాగంగా మారి సుదూర దేశాలలో హిందూ సంస్కృతిని ప్రచారం చేశారు. రాజపుత్రులు హిందూమత రక్షకులుగా

**సుఖ దుఃఖములలో సమభావం మోక్షానికి మార్గం.**

అందరిచేత అంగీకరించబడ్డారు. దేశంలో ఉన్న అధికశాతం ఆలయాలు, మఠాలు, తీర్థస్థానాలు వారి సహాయ సహకారాలతో నిర్మించబడినవే. వారు మనదేశం వచ్చి రెండువేల సంవత్సరాలు మాత్రమే అయినది. బ్రాహ్మణులు ఆబూ పర్వతం మీద యజ్ఞంచేసి వారిని హిందూ మతదీక్షితులను చేశారు. ఆతర్వాత వారు బౌద్ధ మతమును క్షీణింపచేసి వైదిక మత పునరుద్ధరణకు కృషి చేశారు. అయితే వర్తమానకాలంలో హిందువులలోని సంకుచితత్వం మూలంగా సిక్కులలోని చాలా భాగం హిందూమతంతో సంబంధాలు తుంచేసుకున్నారు. ఇదే రకంగా గడచిన మూడువందల సంవత్సరాల్లో మల్కానే, జోగీ, మేవ, సంయోగీ, ఘౌస్, కాంగరియా, లావానా మొదలైన అనేక కులాలవారు హిందువుల నుండి బహిష్కృతులై ముసల్మానులలో కలిసిపోయారు. హిందువులు ఈ విషయంలో తెలివిగా వ్యవహరించి ఉంటే, ముందు చూపు చూపితే, భారత ముసల్మానుల సంఖ్య ఇంతగా పెరిగిపోయేది కాదు. హిందువుల సంఖ్య తరిగేది కాదు. మతం మార్చుకునే ముందు ఈ కులాల వాళ్లంతా అనేకసార్లు వినయంగా ప్రార్థించినప్పటికీ కూడా వాళ్లను నిర్దాక్షిణ్యంగా, బలవంతంగా హిందూమతం నుండి వెలివేశారు. దానివల్లనే వారు కఠినాత్ములుగా తయారయి తమను అవమానించిన జాతిపై పగపట్టినట్లు ప్రవర్తిస్తుంటారు.

ఈ భావన దేశరక్షణ విషయంలో కూడా పెద్ద అవరోధంగా తయారైంది. దేశవాసులై ఉండీ మాతృభూమి రక్షణలో కర్తవ్య విముఖులుగా ఉంటున్నారు. ఫలానా పఠాను దురాక్రమణచేసి బీహారులోని ఒక పెద్ద భూభాగం మీద అధికారం సాధించాడన్న వార్త వింటారు. అక్కడ పఠానులను ఎదిరించి యుద్ధం చేసే క్షత్రియులెవరూ లేక పోవడం, ఉన్న జాతులు మాకేం పట్టిందని నిర్లక్ష్యంగా ఉండడంవల్ల జరిగిన దుర్ఘటన అది.

కులాలలోని మూర్ఖపు ఆచారాల మూలాన హిందువులు విదేశాలు వెళ్లడం నిషేధింపబడింది. దీనితో ప్రపంచంలో వస్తున్న క్రొత్త క్రొత్త మార్పులతో అపరిచితులై వారు కూపస్థ మండూకాల్లా తయారయినారు. వాళ్ల భయమంతా ఇది - అక్కడి మనుషులతో ఆహారపానీయాలతో కొంత సంపర్కం తప్పనిసరి అవుతుంది. అంతేకాక చాలాకాలం అక్కడే ఉన్నవారు అక్కడి స్త్రీలతో వివాహ సంబంధాలు కుదుర్చుకుంటారు. వీటి మూలాన వాళ్లను తిరిగి స్వదేశం వచ్చినప్పుడు తమలో కలవనివ్వరు. పరాయి మతస్థులను చూసినట్లు చూస్తారు. దీనివల్ల కూడా హిందువుల జనసంఖ్య తగ్గిపోయింది. ఇలా అర్థం లేని కుశ్శంకలతో జాతిశక్తిని బలహీన పరచారు.

ఈ జాతి భేదం వలన కలుగుతున్న మరొక అన్యాయం - ఎంతో మంది యోగ్యులైన వ్యక్తులకు సమాజంలో కులంకారణంగా తగు గౌరవం లభించకపోవడం. అభివృద్ధి సాధించగల ప్రతిభావంతులైన విద్యార్థులు, వ్యక్తులకు తగిన ప్రోత్సాహ సహకారాలు అందలేదు. గడచిన వంద సంవత్సరాలలో కబీరు, రైదాసు, దాదూ, ధనా, సేన, తుకారామ్, నామదేవ్ వంటి అనేకమంది భక్తులు, సంతులు జన్మించారు. వీరంతా తామ ఆధ్యాత్మిక దృష్టిలో అప్పుడు గొప్పవారనబడే బ్రాహ్మణులకన్న శ్రేష్ఠులు. కానీ వీరికి ఉన్నత కులాల వారికి జరిగే గౌరవ మర్యాదలు అందలేదు.

అనంతర మత గ్రంథాలలో సముద్రప్రయాణం నిషిద్ధమని పేర్కొనబడినది. దానివలన ఇక్కడి వారికి కోరిక, యోగ్యత ఉన్నా విదేశాలు వెళ్లి ఉన్నతి సాధించగలిగే మార్గాలు మూసుకుపోయాయి. ప్రాచీన కాలపు చరిత్ర చెప్పేది ఏమంటే - హిందువులు ప్రపంచం మొత్తం పర్యటించి తమ దేశపు సభ్యత - సంస్కృతులను ప్రచారం చేశారని. మధ్య కాలంలో కూడా వారు సుమత్రా, జావా, సయాం, కంబోడియా మొదలైన దేశాలలో గొప్ప గొప్ప వలస గ్రామాలు స్థాపించారు. వాటి చిహ్నాలు, దేవాలయాలు, గ్రంథాల రూపంలో ఇప్పటికీ అక్కడ దర్శనమిస్తాయి. కాని సంకీర్ణ నియమ నిబంధనల మూలాన విదేశీయానం హిందువులకు పూర్తిగా నిషేధింపబడింది. ధైర్యం చేసి వెళ్లిన వారు తిరిగి స్వదేశం రాలేక పోయారు. అందుకు కారణం ఆయాదేశాలు వెళ్లిన భారతీయులు మన ఆచారవ్యవహారాలు పాటించరని కనుక వారిని వెలివేయబడిన వారుగా పరిగణించాలని భావించడం.

## సామాజిక ఏకతకు చెదపురుగులు కుల భేదాలు

భారతదేశంలో ఉన్నన్ని తెగలు, వర్గ భేదాలు ప్రపంచంలో ఏ ఇతర సమాజంలోనూ ఉండవు. ధనవంతుడు - పేదవాడు, చదువుకున్నవాడు - చదువుకోనివాడు, పట్నవాసి - పల్లెవాసి మొదలైన వర్గాలు క్రొత్తగా ఇటీవల పుట్టిన వర్గ భేదాలు. ఇంకా అవి వేళ్లు పాతుకుపోలేదు. అంతేకాక ఇందులో ఉన్న మరొక సౌలభ్యం ఏమిటంటే- ఒక వర్గంలోని వ్యక్తి మరో వర్గంలోకి అతి తేలికగా ప్రవేశించగలడు. పేదవాడు కాస్త కష్టపడి డబ్బు సంపాదించాడంటే ధనవంతుల జాబితాలో చేరిపోతాడు. చదువుకోని వారికి చదువుకునేందుకు ఎన్నో సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఇదే విధంగా నగరవాసానికి పల్లె వాసానికి వర్గ మార్పిడి, హద్దులు మారగల వీలు ఉన్నవే. ఇక మనం చెప్పుకునే కుల భేదం మాత్రం శతాబ్దాలనుండీ ఎన్నిప్రయత్నాలు చేసినా మార్పు చెందకుండా భారత సమాజానికి చెరుపు చేస్తూనే ఉన్నది. తన విష గుణాన్ని ప్రతిచోటా ప్రదర్శిస్తూనే ఉన్నది.

ఈ విధంగా లోతుగా పరిశీలించగలిగితే హిందువులలోని కులాల విభజనలో కుట్రలే దర్శనమిస్తాయి తప్ప ఏవిధమైన మత, సామాజిక ఆధారాలు కానరావు. కాబట్టి ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరిచి తమ పొరపాటు చక్కదిద్దుకునేందుకు నడుం కట్టాలి. ఒకే జాతి, ఒకే దేశం అన్న ఆలోచనయే మన పూర్వపు గౌరవాన్ని కాపడగలదు. మనలోని శక్తిని, ఐకమత్యాన్ని సజీవంగా ఉంచగలదు.

అనువాదం : విజయకుమారి

G G G

**కష్టాలలోనే కానవస్తాయి కటిక నిజాలు.**

## బోధకథ

# ప్రభువు సన్నిధిలో ...

జేతవనం అంతటిలో అలౌకికమైన ఒక సుగంధం వ్యాపించి ఉంది. అపురూపమైన ఆ కమల గంధం బుద్ధభగవానుని దివ్య దేహం నుండి ప్రవహిస్తోంది. నిరంతర తపసాధన భగవానుని దేహాన్ని అన్ని విధాలా దివ్యంగా చేసింది. ప్రభువు ఎక్కడ ఉంటే ఆ స్థలం సువాసనతో నిండి పోతుంది. వెలుగుల వెల్లువ ఆ స్థలాన్ని ఎల్లపుడూ ఆవరించి ఉంటుంది. విలక్షణమైన ఆ వెలుగులో భగవానుని తపస్సు, జ్ఞానముల రశ్మి మెరుస్తూ ఉంటుంది. దాని సంపర్కంలోకి వచ్చిన ప్రతి వ్యక్తీ శాశ్వతంగా ఆయన వాడు అయిపోతాడు. అతడు కోరుకున్నా, కోరుకోకపోయినా భగవానుని ప్రేమ పాశంలో బందీ అయిపోతాడు. ప్రభువు తనవాడు, ఆయనను మించిన శ్రేయోభిలాషి మరొకరు లేరు - అనే సత్యం అతడికి సహజంగా అనుభవం అవుతుంది.

భగవానుని ఈ సహజ కరుణ, వారి అపరిమిత ప్రేమ, ఆ ప్రభువు అపురూప వాత్సల్యం వారి వ్యక్తిత్వం నుండి సుగంధంగా, వెలుగుల వెల్లువగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రభువు తన వ్యక్తిత్వంతో, తన వేయి చేతులతో లక్షలాది వరాలను పంచుతూ ఉంటారు. వారి ఉనికి ఆశీస్సుల వానగా, కృపా వర్షంగా వ్యక్తం అవుతూ ఉంటుంది. అందులో తడిసిన వారి వ్యక్తిత్వాలు ధన్యములు అవుతాయి. అయినా కొందరు దురదృష్టవంతుల కుసంస్కారాలు వారికి ఈ ఆశీస్సులు, ఈ దయామృతం అందకుండా చేస్తున్నాయి. వారి దుష్ట ప్రవృత్తులు అందుకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. తమ వంచనయే వారిని ప్రభువు కృపకు దూరం చేస్తోంది. ఒకోసారి ఈ పరిస్థితి అతి దారుణంగా, అతి దుష్కరంగా పరిణమిస్తుంది. వారు భగవానుని ఉనికిని చూసి అసూయ చెందుతూ ఉంటారు.

సమ్యక్ సంబుద్ధుడైన తథాగత భగవానుని పేరు ఈ సంకుచిత బుద్ధులను భయభ్రాంతులను చేస్తుంది. ప్రభువు అస్తిత్వం మానవ జీవనంలో ఆమూలాగ్ర విప్లవానికి మారుపేరు. తమ జీవితంలోని క్షుద్రత్వాలను వదలలేక వాటిని అంటిపెట్టుకుని ఉండే జనం భయభీతులై, భగవానునికి దూరంగా ఉండడమే మంచిదని భావిస్తున్నారు. అంతే కాదు. తమ పిల్లలను కూడా ప్రభువుకు దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు. బుద్ధుని గాలి కూడా తమకు సోకకుండా జాగ్రత్త పడవలసిందిగా ఇలాంటి జనం తమ పిల్లలను కట్టడి చేశారు. బుద్ధునికి కాని, ఆయన భిక్షువులకు కాని ఎన్నడూ ప్రణామం చేయము అని అలాంటి జనమంతా తమ పిల్లల చేత ఒట్లు వేయించుకున్నారు.

అయినా జేతవనం నుండి వెలువడుతూన్న సుగంధం ఆ పరిసరాలలో నివసించే పిల్లల లేత మనసులలో వారికి తెలియకుండానే ప్రవేశించింది. కల్లా కపటం లేని వారి హృదయాలు ప్రభువు వెలుగుతో అప్రయత్నంగానే నిండిపోయాయి. ఏదో అదృశ్య చైతన్యం తమను జేతవనానికి ఆహ్వానిస్తున్నదని వారికి తరచుగా అనిపించేది. అయితే తమ తల్లిదండ్రుల కట్టడి వారిని నిస్సహాయులను చేసింది. జేతవనంలోకి వెళ్లవద్దని మన తల్లితండ్రులు మనపై ఆంక్ష విధించారు. నిజమే. కాని దాని పరిసరాలకు వెళ్లవద్దని వారు చెప్పలేదు కదా. ఆ చుట్టుప్రక్కల ఆడుకుంటే తప్పేముంది? అని ఒకరోజు ఆ పిల్లలలో ఒకడు తన మిత్రులకు సూచించాడు. పిల్లలకు ఆ మాట నచ్చింది. వారంతా జేతవనం బయట ఆడుకోవడం మొదలుపెట్టారు. అలా ఆడగా ఆడగా వారికి దాహం వేసింది. అలసట కలిగింది. ఈ దాహంలో ఈ అలుపులో వారు తమ పెద్దల మాట మరచిపోయారు. మంచినీళ్లకోసం వెదుకుతూ వారు జేతవనంలోకి ప్రవేశించారు. అదృష్టం కలసి వచ్చి వారలా ప్రవేశించడంతోనే వారికి భగవానుని దర్శనం లభించింది. భగవానుడు వారికి తన చేతులతో మంచినీళ్లు ఇచ్చారు. ఎంతో ఆప్యాయంగా వారి చేత మిఠాయిలు తినిపించారు. భగవానుని సమీపించడంతో - అలౌకికమైన ఆ వెలుగు, ఆ సువాసనా ఆయన నుండే వెలువడుతున్నదని వారు గ్రహించారు. కరుణావతారం అయిన తథాగతుని కరుణ, ప్రేమ, వాత్సల్యం వారందరినీ ముగ్ధులను చేశాయి.

ప్రభువు వచనాలు వారికి ఎంతో తృప్తి నిచ్చాయి. తథాగతుడు క్షణకాలం పాటు చూపిన ప్రేమ తమ తల్లితండ్రులు సంవత్సరాల తరబడి చూపిన ప్రేమ కన్న మిన్న అని వారు అనుభూతి పొందారు. వారంతా ఆనందంతో తన్మయులైనారు. ప్రేమతో పులకించిపోయారు. అలాంటి ప్రేమ వారికి మున్నెన్నడూ తెలిసినది కాదు. సూదంటు రాయి వంటి ఆ ఆకర్షణ వారెన్నడూ ఊహించినది కాదు. అలాంటి అద్భుత ఆకర్షణ, అలాంటి అపూర్వ సౌందర్యం, అలాంటి అపూర్వ ఉత్సవ హేల వారెన్నడూ చూచి ఎరుగరు. వారంతా తమ ఆటపాటలు మరచిపోయి రోజంతా భగవానుని దగ్గర

**అనృశంసం పరో ధర్మః - అహింసయే పరమధర్మం.**

ఉండిపోయారు. వారి ఆంతరిక చేతన భగవానుని సుగంధంలో తనను తాను మరచిపోయింది. భగవానుని కరుణ రసంలో వారు తడిసి పోయారు. తథాగతుని అలౌకికత వారి పసి హృదయాలను చూరగొన్నది.

అలా భగవానుని ప్రేమ వారికొక వ్యసనంగా మారింది. వారు రోజూ ఏదో విధంగా ప్రభువు వద్దకు చేరసాగారు. క్రమక్రమంగా వారు భగవానుని వద్ద ధ్యానంలో కూర్చొనసాగారు. అమాయకమైన వారి శ్రద్ధ చూడముచ్చట అయింది. ప్రభువుకు అంకితం కాసాగాయి వారి మనస్సులు, వారి ప్రాణాలు. ఎలాంటి పరిస్థితి ఏర్పడిందంటే - వారు ప్రభువు వద్ద ఉన్నా, ఇంటిలో ఉన్నా వారి భావ చైతన్యం ప్రభువు చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది.

చివరికి వీరి ఉన్మత్త స్థితి వీరి తల్లితండ్రుల దృష్టికి వచ్చింది. వారు కోపంతో ఊగిపోయారు. వారి క్రోధం కట్టలు త్రెంచుకుంది. తాము ఎంతో గారాబంగా పెంచిన తమ పిల్లలను వారు చావబాదారు. కుల పురోహితులు ఆ పిల్లలకు నచ్చచెప్పారు. వారిని సముదాయించారు. వారిని భయపెట్టారు. నయానా, భయానా చెప్పిచూచారు. ఆ చిన్న పిల్లల మీద సామ దాన భేద దండ ఉపాయాలను ప్రయోగించారు. అయినా వారి హృదయాల లోతులలోకి చేరుకున్న భగవానుని అలౌకిక ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. వారి నిశ్చల హృదయాలపై పడిన బుద్ధుని ముద్ర ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

పిల్లల తల్లితండ్రులు ఏడుపులూ, పెడబొబ్బలూ సాగించారు. వారి కోపతాపాలు పెరిగిపోయాయి. భ్రష్టుడైన గౌతముడు అమాయకులైన తమ పిల్లలను కూడా భ్రష్టు పట్టించాడని వారు అడిగిన వారికీ, అడగని వారికీ తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ కోపం పెరిగి పెరిగి వారు గంగవెర్రులు ఎత్తిపోయారు. తమ పిల్లలను వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరోజున తమ పిల్లలను అప్పగించివేయడానికై బుద్ధుని వద్దకు వెళ్లారు. అలుక, కోపం, ఆక్రోశం నిండిన మనస్సులతో వారు జేతవనంలో అడుగు పెట్టగానే - ప్రభువు వెలుగు, ప్రేమ, సుగంధం వారిని క్రమ్ముకున్నాయి. భగవానుని సన్నిధిలో వారి చీకటి జీవితాలలో జ్యోతులు వెలిగాయి. ఆశ్చర్యంలో మునిగిన ఆ తల్లితండ్రులందరికీ భగవానుడు ఈ ధర్మవచనాలను వినిపించారు-

**అవజ్జే వజ్జమతినో వజ్జే చావజ్జదస్సినో ।**
**మిచ్ఛాదిట్ఠిసమాదానా సత్తా గచ్ఛంతి దుగ్గతి ॥**
**వజ్జంచ వజ్జతో త్రత్వా అవజ్జం చ అవజ్జతో ।**
**సమ్మాదిట్ఠి సమాదానా సత్తా గచ్ఛంతి సుగ్గతిం ॥**
అనగా -

అదోషంలో దోషబుద్ధి చూపేవారు, దోషంలో అదోష దృష్టి కలిగిన వారు మిథ్యా దృష్టిని అలవరచుకుని దుర్గతి పొందుతారు.

దోషాన్ని దోషంగా, అదోషాన్ని అదోషంగా తెలుసుకున్న వ్యక్తులు సమ్యక్ దృష్టిని కలిగి సుగతిని పొందుతారు.

ఈ చిన్న సూత్రాలు రెండింటినీ ఇచ్చి, ప్రభువు వారికి సమ్యక్ దృష్టిని ప్రసాదించారు. బుద్ధ భగవానుని వద్దకు చేరినపుడు మన ఆంతరిక భావనలు ఎలా ఆయనవే అవుతాయో వారికి అనుభవం అయింది.

f f f

## వరమా, శాపమా

ఒక ఒంటె చాలా కాలం తపస్సు చేయగా దేవతలు ప్రసన్నులై ఒక వరాన్ని కోరుకోమన్నారు. ఒక దగ్గర కూర్చొని ఎక్కడెక్కడో దూరాలలో ఉన్న పచ్చగడ్డిని తినగలిగేటట్లు అనుగ్రహించమని అది వరాన్ని కోరింది. తక్షణం దాని మెడ ఒక మైలు పొడవు పెరిగింది. ఒంటె పరమానందభరితురాలై దేవతలకు ధన్యవాదాలు తెలిపింది. ఇంతలో వర్షఋతువు ప్రవేశించి తల దాచుకోవటానికి ఎక్కడా చోటు దొరక్క ఒంటె ఒక గుహలో ప్రవేశించింది. దానిలో ఉన్న రెండు చిరుత పులులు ఒంటె మెడను కొరికివేసి నెలల తరబడి దాని మాంసాన్ని తింటూ గుహలో గడపసాగాయి. దైవం ప్రసాదించిన వరం కూడ ఈ విధంగా ఎందుకూ పనికిరాకుండా పోయింది.

భగవంతుడు ప్రసన్నుమయ్యేటట్లు తపస్సు చేస్తే సరిపోదు. ఆయన ప్రత్యక్షమైనపుడు మనకు కోర్కెలను కోరుకోవటం కూడా చేతకావాలి. ప్రసాదించబడిన వరాలవల్ల మనం ఆనందంగా ఉంటామనే గ్యారంటీ ఏమీ లేదు. పురుషార్థం, మనోయోగం, పరిశ్రమ వీటివలననే మానవుడు శాశ్వతమైన లాభాలను పొందగలడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**చెరువులోని నీటికి పారుదలయే రక్ష.**

మహిళా జాగరణ

# ఈ యుగంలో జరిగే అద్భుతం

ఈ కాలం చాలా గొప్పది. ఎవరో చేయి పట్టుకులాక్కు వచ్చినట్లు ప్రతిభ, తెలివి తేటలు పనిపాటలలో కొట్టవచ్చినట్లు కనబడి వికసిస్తున్నాయి. అవసరమైన సాధన జరుపబడుతోంది. ఫలితంగా అనేకానేక శుభారంభాలు జరుగుతున్నాయి. అవికూడా అప్రయత్నంగానూ, అనాయాసంగాను ఏర్పడుతున్నాయి. పరమాత్మ కోరికవలన తయారయిన పథకం ప్రకారం ప్రాణవంతములైన ప్రతిభలు ప్రవహిస్తున్నాయి. మొదట్లో ఊహించనట్లుగా బుద్ధుడు, గాంధీగారు నిర్వహించిన ఉద్యమాలలో అత్యంత ఉన్నత వ్యక్తులు పాల్గొన్నారు. ఈ ఏర్పాటు మనుష్యులు చేసినది కాదు. సృష్టికర్త నిర్ణయమే సమస్తమును చేయడం జరుగుతుంది.

నారీజాగరణ రంగంలో కూడా అదే జరుగుతోంది. ఇందులో కూడా ఉత్తమ ప్రతిభ ముందుండి కీర్తిని పొందుతుంది. నిజానికి అనుకూల పరిస్థితుల నేర్పాటు చేసే బాధ్యత కనబడని ఆ దైవీశక్తి స్వీకరించింది. అది బురదలోంచి కమలమును, సంధ్యాకాలంలో ఆద్భుత కుతూహలమును నిర్మించే కనబడని శక్తి. మహిళ ఉత్కర్ష కూడా మనకాలంలో అటువంటి అద్భుతమే.

అట్టిస్థితిలో భవితవ్యానికి ఎవరైనా ఏమి చేయగలరు? అది పర్వతాలమీద మంచు పేర్కోడము వంటిది, సముద్రం నుండి మేఘము లేర్పడడంవంటిది. అనుకోకుండా తుఫాన్ లేచి అంతటినీ అస్తవ్యస్తమొనరించే ఆశ్చర్యకర వాతావరణాన్ని నిర్మించినట్లౌతుంది. సమాజంలో సగం జనాభాగల మహిళలను పునరుద్ధరణ మొనరించడానికి మన సమయాన్ని వినియోగిస్తే అది ఒక అద్భుతమే అవుతుంది.

ప్రతిభకల మహిళలు ఈ ప్రయోజనాన్ని సాధించడానికి జోన్ ఆఫ్ ఆర్క్ పద్ధతి నవలంబిస్తే ఫలితం కలుగుతుంది. వారు నిరాశను కలిగించే పరిస్థితులను అధిగమించగలుగుతారు. తమ వెనుకబాటు తనాన్ని ప్రగతి శీలతలోనికి మార్చడంలో సఫలులౌతారు. మహిళలు తమ పాత్రను పురుషుల సహకారముంటే చక్కగా నిర్వహించవచ్చు. పురుషులు ఉచితము, ఉత్తమమునైన సహకారాన్ని అందించగలిగితే సరేసరి. లేకుంటే మహిళల ప్రగతికి కలిగే అవరోధాలను తొలగించడానికి ముందుకు రాగలిగితే చాలు. ఇందువలన వారికి కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. లేకుంటే కాలప్రవాహాన్ని మళ్లించడంలో వారికి అపకీర్తి రావడం తప్పదు.

నారీ జాగరణ కార్యాన్ని నూతన సృజనకు బాధ్యత వహించగల వారు, దాని ననుసరించి లభించిన ఫలితాన్ని సాధించగలవారునైన మహిళామణుల చేతుల్లో పెట్టాలి. వారికి అడ్డంకులను తొలగించడానికి తమ సహకారాన్ని అందించగలిగితే అది పెద్ద అదృష్టమనుకోవాలి. దాని ద్వారా వారి భవిష్యత్తు అడుగడుగునా మహోజ్వలంగా వెలుగుతుం దనడంలో సందేహం లేదు.

మహిళలకు అభ్యుదయం కలగడమన్నది అరుణోదయం వంటి నిజం. దానిపైన బురదజల్లడం వల్ల గాక అర్ఘ్యప్రదానం చేయడం వలన ఉపయోగముంటుంది. పురుషవర్గం మహిళల ప్రగతికి ప్రత్యక్షంగా కాకున్నా పరోక్షంగా నైనా సహకరిస్తూ ఉండాలి.

పురుష సముదాయం ఆలోచనలలో ఎన్నో విప్లవాలు తెస్తున్నారు. అందులో ఒకటిగా నేడు లోకుల మనస్సులలో స్త్రీల విషయంలోగల దుష్టభావాలను, అశ్లీలభావాలను నిర్మూలించే కృషిని సమ్మిళితం చేయాలి. అది సురస, తాటకి, శూర్పణఖల నెదిరించినట్లుండాలి. నారీమణి అన్నిటికన్న పవిత్రమైనదిగాను, శ్రద్ధకు ప్రతీకంగానూ ఉండేది. ఇకముందు ఆమెకా స్థితి లభించబోతోంది. ఈ మాటు ఆమె శక్తి స్వరూపిణిగా, ప్రచండ కాళీమాతగా కనిపించబోతోంది. ఈ స్థితిలో ఆమెను కాముకురాలుగా చిత్రించే కళాకారులనబడేవారికి జాగ్రత్త పడవలసిందిగా హెచ్చరిక చేయబడుతోంది. వారు చేసే అసహ్యకర కార్యకలాపాలవలన మహిళను అధఃపతనంలో పడవేసే ప్రయత్నం ఫలించదు. పైగా అలా ప్రయత్నించే వారికి మహిషాసురునకు, భస్మాసురునికి, మధు - కైటభులకు పట్టిన గతి పడుతుంది. నేడు వారికి ఏ పని మనోరంజనకు, ఆకర్షణకు, ధనసంపాదనకు సాధనంగా కనబడుతోందో అదే పని రేపు వారికి అపకీర్తిని తెచ్చేదిగా తయారవుతుంది.

కనుక, రచయితలు, గాయకులు, చిత్రకారులు, విగ్రహాలు తయారు చేసేవారు నేడు వారు చేసే పనిని మార్చుకుని క్రొత్త పద్ధతుల నలవరచుకోవాలి. తమ దృష్టి కోణమును మార్చుకోవాలి. ఆ పని వీలయినంత వెంటనే ప్రారంభించడం శ్రేయోదాయకమౌతుంది. మహిళనొక శక్తిరూపిణిగా భావించి గౌరవించాలి. ఇది యుగధర్మానికొక హెచ్చరిక. ఈ విషయాన్ని పురుషులు అర్థంచేసుకుని పథకం ప్రకారం కార్యనిరతులు కావాలి. తమ పద్ధతిని మార్చుకుని, స్త్రీకి శక్తిస్వరూపిణి స్థాయినిచ్చి గౌరవించడానికి తమ కళాకౌశలాన్ని నూతన పద్ధతిలో ప్రదర్శిస్తూ యుగధర్మాన్ని నిర్వహిస్తున్న గౌరవాన్ని వారు పొందగలగాలి.

ప్రగతిశీలురైన మహిళలు కూడా తమకుగల సహజ ప్రతిభద్వారా ముందుకు సాగే ప్రయత్నానికి సహకరించనివారిని సరియైనత్రోవకు తెచ్చే ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నం ఫలించకుంటే అట్టివారి నెదిరించినా తప్పులేదు. నారీజాగరణ కార్యంలో అట్టిస్థితి తప్పక పోవచ్చు. ఐతే ఔచిత్యానికి భంగం కలుగనీయని పద్ధతిలో వారు కార్యాన్ని కొనసాగించాలి.

L L L

**జపతో నాస్తి పాతకః - జపంవల్ల పాపం నశిస్తుంది.**

సాధుసంత్‌ల జీవితాలు

# మహాయోగి తపోబలం

అజ పా జాప్ సుని మన్‌ధరే
పాంచో ఇంద్రియ నిగ్రహకరే ॥
బ్రహ్మ అగ్ని యో హోమేకాయా
తాన్ మహాదేవ్ బందేపా యా ॥
ధన జీవన్ కీ కరేవ ఆన్
చిత్ న రాఖే కామినీ పాన్ ॥
నాద బిందు జాకే ఘట్ జరై
తా కీ సేవా పార్వ తీ కరై ॥

మహాయోగి గోరక్షనాథ్ ఈ స్వర మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. సాధన మహత్తును వివరించే సమయంలో వారు పొందే తన్మయత్వం అద్భుతం. గంగాకుండ్ వద్ద చేరిన సాధక బృందం మహాయోగి మాటలనే మహామంత్రంగా భావించి తన్మయత్వం పొందసాగారు. వారిలా ప్రబోధించారు - "యోగులారా, సాధనయే జీవనసారం. దేశం ఇప్పుడు భ్రష్టమయింది. ప్రజలేకాక, పరిపాలించు నాయకులు కూడ పాప పంకంలో కంఠం వరకు పూడుకు పోయారు. వారిని మంచిదారిలోనికి తేవడానికి, పాపపంకము నుండి ఉద్ధరించడానికి ఆత్మబల సంపన్నులైన సాధకుల ఆవశ్యకత ఉన్నది. తపస్సంపన్నుల ఆత్మచైతన్యమే దేశంలో నవజీవనం నింపగలదు. కనుక మీ సాధనను తీవ్రతరం చేయండి.'' సాయంసంధ్య అరుణిమ శాంతించింది. మహాయోగి స్వరం నెమ్మది నెమ్మదిగా శాంతించింది. పరిసరాల్లో అపూర్వమైన నిశ్శబ్దం ఆవరించింది.

సాయంకాల ఉపదేశానంతరం గోరక్షనాథ్ హోమకుండం వద్ద పులిచర్మం మీద ధ్యానమగ్నులైనారు. బ్రహ్మముహూర్తంలో ప్రాణాయామం ప్రారంభించారు. ధ్యానాన్ని ఏకాగ్రం చేసి ఇళ, పింగళ నాడుల శక్తిని పూరక కుంభక ప్రాణాయామముల చేత సుషుమ్నలో చేర్చారు. మందకొడిగా ఉన్న కుండలినిని ఊర్ధ్వముఖం కావించారు. వారి చేతనాశక్తి దెబ్బతిన్న నాగిని వలె పైకెగసి మూలాధార చక్రంలో పరిభ్రమిస్తోంది. యోగిసంకల్పంచేత అది ఊర్ధ్వంగా పయనించింది. వారు మూలాధార చక్రాన్ని చతుర్దళపద్మరూపంలో చూచారు. కమలంలో నాలుగు దళములు. కుండలినీశక్తి వజ్ర, చిత్రిణి, బ్రహ్మనాడి, సుషుమ్నలలో నిలిచింది. ఇది భూలోకం. ఇక్కడి రంగు ఎరుపు. గోరక్షనాథ్ దీనినే సంసారమని చెప్పారు. సంసారులు మూలాధారం నుండిపైకి పోలేరు. వారి కుండలిని ఈ భూలోకంలోని రాగారుణ జీవనపు సుఖ దుఃఖాలలోనే కలసిపోతుంది.

గోరక్షనాథ్ మూలాధార చక్రంలోని నాలుగు కమలదళాలనుండి వం, శం, షం, సం అక్షరముల ధ్వనిని లం తత్వ బీజ నాదాన్ని విన్నారు. ఒక చతుష్కోణయంత్రం నుండి బ్రహ్మ ఢాకినీ శక్తులు వెలువడుట కనుగొన్నారు. బ్రహ్మకు, బ్రహ్మశక్తికి అజపా జపంతో వందనం చేశారు.

గురు గోరక్షనాథ్ మరల పూరక ప్రాణాయామం ద్వారా చాలా సేపటి వరకు కుంభకంలో ప్రాణశక్తిని నిలిపారు. ఇప్పుడు కుండలినీశక్తి బుసకొట్టుతూ పైకి వెళ్ళి లింగస్థానంలోని స్వాధిష్ఠాన చక్రంలో విలీనమయింది. ఇక్కడ సింధూర వర్ణం గల ఆరుదళాల కమలం ఉంది. ఇక్కడ యోగి బం మొదలుకొని లం వరకు అక్షరాలను గమనించారు. ఇక్కడ జలతత్వం ఒక్కొక్క సారి స్థిరంగా, ఒక్కొక్కసారి అలలుగా ఉంది. బం తత్వ బీజ నాదం ప్రతిధ్వనిస్తోంది. విష్ణుమూర్తి తన రాకినీశక్తిలో కూడి దర్శనమిచ్చాడు. వారు చంద్రాకార యంత్రంలో విరాజమానులయ్యారు. ఇక్కడ మకరం వీపుమీద బం బం నాదం ఉంది. ఈ నాదం మూలాధారచక్ర ఐరావత అధరంపై ఉంది.

స్వాధిష్ఠాన స్థానం కూడ సాంసారిక జీవుల కొరకేనని గురువుగారు తలచారు. మూలాధారంలో పశుజీవులు కట్ట బడిఉంటాయి. ఇక్కడ కూడ విలాసం, వైభవం, సుఖం. తన కుండలిని ఈస్థానంలో కూడ ఎక్కువసేపు నిలువకూడదు. కొంత ఎత్తులో ఉన్నప్పటికీ ఇది కూడ పశుక్షేత్రమే, ఇక్కడ కూడ భవద్వంద్వమేనని గురువుగారు తలచారు.

గురువుగారు మరల శ్వాసను ఊపిరితిత్తులలో నింపి ధ్యానమగ్నులయారు. అది బుస కొట్టుతూ, పడగవిప్పి మార్గంలోని అవరోధాలను భస్మం చేస్తూ రాగ భావనలలో తేలుతూ, లోభ, క్రోధ పాశాలను ఛేదించుతూ మణి పూరక చక్రంలో ప్రవేశించి సేదతీరింది.

మణి పూరకచక్రంలో వారికి కొంత సంతోషం కలిగింది. వారు ఉదరాన్ని సంకోచింపజేసి, నాభిని లోతుగా జేశారు. నాభిస్థలంలో చక్రంలో పరిభ్రమిస్తూ చైతన్య శక్తి ఆనందాన్ని అనుభవించ సాగారు. ఇక్కడ పదిదళముల నీలవర్ణ కమలంపై డం నుండి ఫం వరకు అక్షర చిహ్నాలు ఉన్నాయి. మధ్యలో రం బీజతత్వం ర ఆకారంలో

**శ్రమించడమే ఆరోగ్యానికి రాచబాట.**

తిరుగుతూ చేసే నినాదం అధోకాయంలో ప్రతిధ్వనిస్తోంది. ఈ బీజమంత్రం మండూకంపై కూర్చొని త్రికోణ యంత్రంలో ఉంటుంది. ఈ బీజ మంత్రంలో సనాతన రుద్రుడు, లాకినీదేవిని ఎడమవైపున కూర్చుండబెట్టుకొని ధ్యానమగ్నులుగా ఉన్నారు. నాభిచక్రంలో అగ్ని జ్వలిస్తోంది. యోగి చిత్తం ఈ జ్వలించు అగ్నిలో విశ్రాంతి పొందింది.

గోరక్షనాథునికి ఈ చక్రపు హద్దు అవగతమయింది. ఇక్కడ రూపరాజ్యమున్నది. ఎచ్చట రూపం ఉంటుందో అక్కడ ఆసక్తి ఉంటుంది. కనుక ఇది లక్ష్యం కాదు. ఇది కేవలం విశ్రాంతి తీసుకొనుటకు గుడారంలాంటిది. ఇచ్చట కోరిక లేకపోయినప్పటికీ సూక్ష్మరూపంలో ఆసక్తి ఉన్నది.

గురువు మరల ప్రాణాయామంద్వారా అనాహత చక్రంలో ప్రవేశించారు. మణిపుర చక్రాన్ని, హృదయంలోని బాధలను దాటారు. ఇక్కడ సాంసారిక ఆకర్షణ లేవీ తమను ఆకర్షించజాలవని తలచారు.

ఇక చైతన్యం అధో ముఖం కాలేదు. అగ్ని మార్గంలో ఏ ఆటంకాలూ లేవు. వారు వక్షాన్ని విశాలం చేసి హృదయంలో భ్రమిస్తున్న ఆత్మకు ఆనందాన్ని కలుగచేశారు. ముగ్ధులయి ద్వాదశదళ కమలం సుగంధాన్ని ఆస్వాదించసాగారు. ఇచ్చట అరుణిమ భావనాప్రపంచం ఉంది. వాయువు నామ తత్వం. వాయువు అధికంగా ఉంటే పశుజీవుల భావసరోవరంలో వృత్తి ప్రవృత్తులు నిరంతరం ఉద్భవిస్తూ ఉంటాయి. ఇక్కడ యం బీజమంత్రం జింకమీద కూర్చున్నది. దాని మధ్య ఈశానురుద్ర, కాకినీ జంటలను యోగి దర్శించారు. షట్కోణయంత్రం మధ్యలో విశ్రాంతిగా యం నాదం వినిపిస్తోంది. హృదయ స్థలం వాయుప్రధానమైనది. ఇక్కడ రసానుభూతి కలుగుతుంది. రాగం పోయి భావనాతరంగాలు ఉద్భవిస్తాయి. కొంత తటస్థంగా కొంత నిమగ్నతతో కళారసం వల్ల చైతన్యం తన్మయం పొందుతుంది. చైతన్యం భావనా తరంగాలలో ఆనందంతో కేరింతలు కొడుతుంది. కాని ఇక్కడ కూడ స్థూల జీవన శేషమున్నది. రాగానురాగములు ఉన్నాయి. ఏకాగ్రత ఉన్నది. కానీ బ్రహ్మానందమిది కాదు. ఈ ఆనందం బ్రహ్మానందానికి కనిష్ఠ సోదరుడు. ఇక్కడ ఆత్మలోని తళుకు ఉన్నది. భావుకతలోని ఆర్ద్రత ఉన్నది. భావమును బట్టి గదా ఇది భవమైనది. కనుక ఈ భావావాత్య చక్రంలో తాను ఎక్కువ సేపు నిలవ లేనని యోగి గ్రహించారు.

గోరక్షనాథుడు విశుద్ధ చక్రాన్ని సంకల్పించి పూరక, కుంభక ప్రాణాయామంలో సాక్షీ ఆత్మ తత్వమును జాగృతపరచారు. దానినే ఇంకను పొడిగించి విశుద్ధ చక్రంలో చేర్చి వారే ద్రష్టగా, వారే భోక్తగా అనుభవం పొందారు. కంఠంలో పదహారు దళముల పద్మం వికసించింది. ఈ కమల దళముల పైన అ నుండి అః వరకు గల స్వరాక్షరాలు లిఖింపబడి ఉన్నాయి. హం తత్వ బీజమునకు దిగువ భాగంలో సదాశివ, డాకినీ జంటలను దర్శించారు. సదాశివునికి, వారి శక్తికి కూడ పంచముఖములు ఉన్నాయి. హంకు దిగువన శూన్యం. ఇక్కడే సృష్టిలోని ధనాత్మక, ఋణాత్మక శక్తి దైవీ జంటగా కేంద్రీకృతమై ఉన్నది. యోగి శరీరంలో పరస్పర విరుద్ధశక్తుల ఐక్యతానాదం ఝంకృతమయింది. దేవజంట క్రింద ఏనుగు తన తొండంను పైకెత్తి నిలిచి సత్యాన్ని అన్వేషిస్తోందా అన్నట్లుంది.

ఇచ్చట శబ్దానందమున్నది. కానీ శబ్దం మాయావీ కావచ్చు. మాయాకారకం కూడా. కనుక యోగి ఇక్కడ ఎక్కువ సేపు నిలువ లేక పోయారు. శబ్దం వలన కలిగే భయం వారికి తెలుసు. సదాశివ భావము ఉన్నప్పటికీ వారిని కం చక్రంలో ఉన్న సాంసారిక శంక పీడించ సాగింది. అక్కడ నిలువక అంతరాత్మను ఇంక ముందుకు నడిపించారు.

ఆజ్ఞా చక్రంలో వారు ఆనందాన్ని అనుభవించారు. భ్రూ మధ్యంలో త్రికుటియందు కేంద్రీకరించిన వారి చైతన్యం ఓంకారంతో రమించింది. నాదమే వాహనంగా వేదాంతంలో ప్రతిధ్వనిస్తోంది. నాదమందే గోరక్షుడు సృష్టి రహస్యాన్ని కనుగొన్నారు. విశ్వమునకు మూలం నాదం తప్ప మరేమీలేదు. నాదం ఓంకార స్వరూపం. ఓం కారం నుండి విశ్వం సృజింపబడింది. పంచభూతములు నాదం నుండే ఉద్భవించాయి. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వీ తత్వం - వీటిలో నాదం జడరూపంలో ఉంటుంది. అనంతమైన ఈనాదమే లింగాకారాన్ని ధరించింది. దీని శక్తి బహుముఖమైన హాకిని. గోరక్షనాథుడు చాలా సేపు ద్విదళ కమలపు శ్వేతవర్ణంలో ఈశ్వరుని వ్యాపకత్వాన్ని గురించి ఆలోచించసాగారు. కాని ఎంత ఆలోచించినా అంతం కానరాలేదు. శివలింగం లింగాకార మంత్రంలో శివరూపంలో నిబిడీకృతమై ఉంది.ఆ ప్రకాశం విమర్శ మార్గంలో మిళితమై ఫలితంగా పదార్థములు, ప్రాణులు జనిస్తున్నాయి. గోరక్షనాథుని యోగం జాగృతమై, వారు ఓం శబ్దాన్ని వినసాగారు. ఈ సమస్త విశ్వంలో ఓం కారం అంతర్లీనమై ఉంది. వారికి అంతటా అన్నింటిలో ప్రకాశం గోచరించింది. మానవజాతి భూత, భవిష్య, వర్తమానాలు వారి మనస్సులో భాసించాయి. ఆధ్యాత్మికతయే సమస్యలకు పరిష్కారమనే దైవ సందేశం ఆయన మనస్సులో ప్రతిధ్వనించింది. ప్రయత్నం ద్వారా లభించే ఆత్మ బలమే దేశ సమస్యలకు, మానవ సమస్యలకు పరిష్కార మార్గం కాగలదు. స్వయంప్రకాశిత జ్ఞానం చేత వారి మనస్సుకు ఆనందం కలిగింది. వారి ధ్యానం సహస్రార చక్రంవైపు ఉన్ముఖం అయింది.

**యోగో భవతి దుఃఖహా - యోగం దుఃఖాన్ని హరిస్తుంది.**

పూరక ప్రాణాయామం చేత. వారు మనస్సును త్రికుటిపైకి తీసుకువెళ్లారు. ఇక్కడ బిందువు పైన పరబ్రహ్మ స్వరూపమైన పరమశివుని అనుభూతి కలిగింది. హం మొదలు క్షం వరకు ఉన్న అక్షరాలన్నీ కమలం సహస్రదళములపైన తళతళా మెరుస్తున్నాయి. నిరాకార పూర్ణచంద్రునిలో శివ, శక్తులు ఏకంగా, తిరిగి వేర్వేరుగా గోచరించారు.

ఇక్కడ నాదం బిందువులో, బిందువు నాదంలో, శివుడు శక్తిలో, శక్తి శివునిలో ఏకమవుతూ, వేర్వేరుగా తమ భూమికను నిర్వహిస్తున్నాయి. వీటిమధ్య పరమ సత్యాన్ని, దాని సమీపంలో ఒకే శక్తి నుండి వెలువడిన రెండు సహోదర శక్తులను గురువు గారు కనుగొన్నారు. శివ బిందువులో శక్తి విలీనమై, బీజం నుండి అంకురించింది. వాటి రెండు దళములే శివుడు, శక్తి. ఆ అంకురం తిరిగి వృద్ధి పొందుతోంది. శివ బిందువు నుండి అనేకములైన శాఖలు, ఆకులు విస్తరిస్తున్నాయి.

చైతన్యం తన గమ్యమైన మస్తిష్కంలోని సహస్రారాన్ని చేరింది. అది నామ రూపమయ సంసారమును దాటిన స్థితి. ఇదే నిర్వాణం, పరమశూన్యం, ప్రళయానుభూతి. నిశ్చలమైన సృష్టి పర్వం. ఇక్కడే శాంతి. శూన్యంలోనే శాంతి లభిస్తుంది. మెలకువలో కష్టం వల్ల అశాంతి కలుగుతుంది. ఇక్కడ చైతన్యం తన కష్టాన్ని స్వయంగా చూడగలదు.

క్రమంగా గోరక్షనాథుడు శూన్యాన్ని కూడ అతిక్రమించారు. దిక్ కాలములు, నామ రూపములు అన్నీ అదృశ్యమైనాయి. నీటి బిందువు సముద్రంలో కలిసింది. ఇదియే అత్యున్నతమైన స్థితి. అవస్థాతీత సమాధి. ఇక్కడ రెండవదేదీ లేదు. చేతులు కలసినవి. కుండలోని నీరు నదిలో కలిసింది. అహమ్ అను ఉప్పు కల్లు నీటిలో కరిగి పోయింది. స్వచైతన్యం మరుగున పడింది. పిండ, బ్రహ్మాండాలు ఏకమయినాయి. గోరక్షనాథుడు సమాధి స్థితుడు అయినాడు.

శిష్యులు ఈస్థితిని గమనించి గురువు శరీరాన్ని రక్షించడానికై వారి చుట్టూ చేరారు. వారు నమః శివాయ, నమః నాథాయ, నమః గోరక్షాయ అని జపించసాగారు. గురుదేవునికి సమాధి స్థితిలో అందే దివ్య సందేశాన్ని వినడానికి వారందరూ ఆతురతతో ఉన్నారు.

సూర్యోదయం కాగానే గోరక్షనాథులు సమాధి నుండి విడిపడి ఓం కారాన్ని బిగ్గరగా ఉచ్చరించారు. శిష్యులందరూ త్వరితగతిని హోమాన్ని ప్రజ్వలింప జేశారు. గురువు ముఖ మండలంలో దివ్యమైన ప్రకాశం కన్పించింది. వారు జీవకారుణ్యం, దేశహితముల చింతనతో వెలిగిపోతున్నారు. వారు హుంకారం చేశారు. అగ్నిపర్వతం బ్రద్దలైనట్లు వారి నోటి నుండి అగ్ని కణాల వంటి మాటలు బయలు దేరి మనస్సును ఛేదిస్తున్నాయి. వారి మాటలు స్వచ్ఛంగా ఉన్నాయి. వారి శబ్దాలు హోమకుండంలోని అగ్నిజ్వాలలలో, సూర్యుని తేజస్సులో విలీన మయినాయి.

వారు ఇలా చెప్పారు - "నేను భారతదేశాన్ని ఒక మహాయోగి వలె దర్శిస్తున్నాను. ఈ మహాయోగి శిరస్సే కాశ్మీరం, కుడి చేతిలోని కమండలం, మాల, భుజంలోని శృంగం, అంగ, వంగ, ఒరిస్సా రాష్ట్రములు. ఎడమ చేతిలోని త్రిశూలం, డమరుకం, కత్తి ప్రక్కన ఉన్న గండ్రగొడ్డలి, అమ్ముల పొది ధనుర్బాణములు గుజరాత్ రాజస్థాన్, పంజాబు, వాయువ్య రాష్ట్రాలు. బుద్ధి, అంతరాత్మ, దానిలోని తత్వం మధ్య ప్రదేశ్. మహాకాలుని అనుచరులు ఈ పుణ్యభూమి ఆత్మ. వారిలోని అత్యున్నతమైన చైతన్యశిఖరాలు మానవునికి ఔన్నత్యాన్ని, గంభీరతను, దివ్య అనుభూతుల మహాసముద్రాన్ని కల్పించాయి. అద్భుతమైన దివ్యత్వం ప్రతిబింబిస్తోంది. క్రొత్త, క్రొత్త ఆధ్యాత్మిక ఆలోచనలు, తర్కం, ధ్యానం లభించాయి. దక్షిణ ప్రాంతం ఈ మహాయోగి దివ్య చరణములు. సముద్రజలం ఈ పాదములను కడుగుతోంది. నేను ఈ కర్మ భూమి దుర్దశను సహించలేకున్నాను."

గోరక్ష నాథులు ఇంకా ఇలా చెప్ప సాగారు - "మహాశివుడు నాలో తాండవం చేస్తున్నాడు. నాలో లయకాదు ప్రళయమున్నది. నేను తేజస్సులో మండి మసైపోతున్నాను. రాగ, అనురాగాల వీణను మీటి రాష్ట్రచైతన్యాన్ని ఉన్మత్తం చేయడానికి ఇష్టపడను. తపోబలం, ఆత్మబలమనే దండంతో జాతిని మేల్కొలుపదలచాను. దేశం సాధన అనే దండం ఆజ్ఞాపించే దిశలో ప్రగతి సాధించాలి. ప్రగతి, సమృద్ధి అనే చక్రాలను తోసుకుంటూ ముందుకు సాగాలి."

గహనీనాథ్, నివృత్తినాథులతో కూడిన సాధు బృందం తమ గురువును తదేకంగా చూస్తున్నారు. వారందరూ గురువుగారి స్పష్టమైన ఆదేశాలకోసం ప్రతీక్షిస్తున్నారు. అంతర్జ్ఞాని అయిన గురువు శిష్యుల మనోగతాన్ని గ్రహించి ఇలా అన్నారు -

"భారతభూమిని తపోభూమిగా మార్చమని మహేశ్వరుడు ఆదేశించాడు. వారి ఆదేశం ప్రకారం సాధకులందరూ తమలాంటి సాధకులను అనేకమందిని తయారు చేయాలి. వారు ప్రచండమైన సాధనాగ్ని ద్వారా అసురత్వాన్ని భస్మీపటలం చేయగలరు. దీనికోసం మన సర్వస్వాన్నీ ఆహుతి చేయాలి. నేడు మనం చేసే సాధనద్వారా దేశ ఉజ్వల భవిష్యత్తును రూపొందించగలం."

గురువుగారి ఈ దివ్య సందేశం సాధకుల ఉత్సాహాన్ని వందరెట్లు పెంచినది.


అనువాదం : కె.అరవిందమ్మ

**వ్యాధి శేషాన్ని, అగ్ని శేషాన్నీ, శత్రు శేషాన్నీ, ఋణ శేషాన్ని పూర్తిగా నిర్మూలించు.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 4

# యమున నుండి గంగకు

1915 అక్టోబరులో బనారస్ హిందూ యూనివర్సిటీ చట్టం ఆమోదం పొందింది. నాలుగు నెలల తర్వాత మాఘ శుక్ల పాడ్యమినాడు విశ్వవిద్యాలయ స్థాపన జరిగింది. వైస్రాయ్ లార్డ్ హార్డింజ్ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారు. బెంగాల్ గవర్నరు, మూడు రాష్ట్రాల డిప్యూటీ గవర్నర్లు, 12 మంది మహారాజులు, పలువురు విద్వాంసులు, జమీందార్లు, వాణిజ్య వేత్తలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏనీ బీసెంట్ స్థాపించిన సెంట్రల్ హిందూ కాలేజీ ఈ విశ్వవిద్యాలయంగా వికసించింది. అయిదు సంవత్సరాలక్రితం దీని స్థాపనకు సంకల్పం తీసుకున్నారు. ఇందుకోసం ఏనీ బీసెంట్, మహామనా మదనమోహన మాలవ్యా, దర్భంగ మహారాజు రామేశ్వర సింగ్‌లు కలిసి పని ప్రారంభించారు. 50 లక్షల రూపాయలు బ్యాంకులో జమ చేసి, కోటి రూపాయల సేకరణ జరిగే పరిస్థితి ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాన్ని అధికారికంగా స్థాపించాలని నిర్ణయించారు.



ప్రభుత్వము, రాజులూ మహారాజులూ కలిసి ఈ నిధిని సేకరించగలిగేవారే. అయితే, సంపన్నుల సహకారంతోపాటు సామాన్య ప్రజల నుండి విరాళాలు సేకరించాలని మహామనా మాలవ్యాజీ సూచించారు. మామూలు వ్యక్తులనుండి విరాళాలు సేకరించడంలోని ఉద్దేశ్యం వారితో ఆత్మీయతా బంధాన్ని ఏర్పరచుకోవడం. సంపన్నుల విశేష సహకారంతోపాటు చిన్న చిన్న అంశదానాలను కలుపుకుని 1913 మార్చి నాటికి 11 లక్షల సేకరణ జరిగింది. 50 లక్షల సేకరణ లక్ష్యాన్ని చేరడానికి మరో రెండు సంవత్సరాలు పట్టింది. బికనీరు, జోధపూరు, కాశ్మీరు సంస్థానాల నుండి లభించే వార్షిక విరాళాలు ఈ మొత్తంలో చేరి ఉన్నాయి. ప్రజా సహకారాన్ని సమీకరించ వలసిందిగా విద్వాంసులకు, నాయకులకు, సామాజిక కార్యకర్తలకు, పురోహితులకు, ధార్మికరంగ ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాలకూ చెందిన వ్యక్తులు భారీ సంఖ్యలో ఇందుకు స్పందించారు. రాత్రింబవళ్లు కృషి చేశారు. అయిదు సంవత్సరాలలో లక్ష్యంలో సగానికిపైగా పూర్తయింది. పిడికెడు ధాన్యం, పైసా, అణా, రెండణాలు - ఇలా చిన్న చిన్న మొత్తాలు ఈ అంశదానంలో చేరి ఉన్నాయి.

వ్రజ భూమి (మథుర - ఆగ్రా ప్రాంతం)లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంకోసం విరాళాలు సేకరిస్తున్న కొద్దిమంది వ్యక్తులలో పండిత రూపకిశోర్ శర్మ అగ్రగణ్యులు. ఆగ్రా సమీపంలోని ఆవల్‌ఖేడాలో నివసిస్తున్న పండిత రూపకిశోర్ శర్మ భాగవతంలో ఉద్దండ పండితులు. పురాణం చెప్పడానికీ, ప్రవచనాలు ఇవ్వడానికీ ఆయన సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. ఆయన ప్రవచన పద్ధతి మహామనా మదనమోహన మాలవ్యాను ఎంతగానో ప్రభావితం చేసింది. వీరిద్దరూ కొంత కాలం ఒకే గురుకులంలో కలిసి చదువుకున్నారు. అయితే భాగవతంపట్ల భక్తి గౌరవాలు వీరిద్దరిమధ్య గల స్నేహ సంబంధాలకు మూలాధారాలు. భాగవత పురాణం చెప్పేటప్పుడు సనాతన ధర్మంకోసం శ్రోతల సహకారాన్ని సమీకరించమని మాలవ్యాజీ పండిట్‌జీకి సూచించారు. ప్రజలనుండి చిన్న మొత్తాలలో విరాళాలు సేకరించాలనే నిర్ణయం జరిగిన తర్వాత, అందుకు కనీసం 11,000ల రూపాయలు సేకరించవలసిందిగా మాలవ్యాజీ పండిట్‌జీని కోరారు. పండిట్‌జీ దశలవారీగా కొంత మొత్తం సేకరించి పంపారు. భాగవత పురాణం చెప్పించుకున్నవారు ఇచ్చిన పైకం ఈ మొత్తంలో ఉంది. ఆయన ఖచ్చితంగా ఎంత మొత్తం పంపారో తెలియదు. ఒక పెద్ద మొత్తాన్ని గుప్తదానం రూపంలో పంపారు. పండిట్‌జీ కుటుంబీకులు ఈ సంగతి చెపుతూ ఉండేవారు.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయం స్థాపనలో ప్రముఖ పాత్ర వహించిన పెద్దగా ఆనాటి శంకు స్థాపన కార్యక్రమానికి పండిట్‌జీ కూడ వచ్చారు. వ్రజ భూమిలోని కొందరు పురోహితులూ, విద్వాంసులూకూడ ఆయనతోపాటు వచ్చారు. వారి కుటుంబాలు, బంధువర్గం కాశీ యాత్ర కూడా కలిసివస్తుందని వారితో వచ్చారు. ఒక $5^1/_2$ సంవత్సరాల బాలుడుకూడ వీరిలో ఉన్నాడు. పండిట్‌జీ తన సహచరులు ఇద్దరిని తీసుకుని శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లు చూడడానికి వెళ్లారు. ఆ బృందంలోని ఇతరులు కాశీలో దేవ దర్శనం, గంగాస్నానం, అనుష్ఠానం మున్నగు కార్యాలలో మునిగిపోయారు.

శంకుస్థాపన ఉత్సవాలు పెక్కు రోజులపాటు జరిగాయి. విద్యార్థులకు ఆధునిక విషయాలను బోధించడంతోపాటు సనాతన ధర్మంలోని, భారతీయ సంస్కృతిలోని మూల సూత్రాలను కూడా నేర్పాలన్నది విశ్వవిద్యాలయం లక్ష్యం. విశ్వ విద్యాలయం హిందూ ధర్మ విజ్ఞానంలో ఉన్నత స్థాయి శిక్షణ ఇస్తుంది. ఇందరూ అన్ని మతాలకు చెందిన విద్యార్థులూ చేరవచ్చు. విశ్వవిద్యాలయ నియమావళిలో పై విషయాలను పొందపరచారు. రెండు ముఖ్య విషయాలను కూడ చేర్చారు. విశ్వవిద్యాలయ వ్యవస్థలో, నిర్వహణలో హిందూ మతాన్ని ఆమోదించే వారికే బాధ్యతలు అప్పగిస్తారు. పాలక వర్గంలో ప్రభుత్వేతర సభ్యులు అధిక సంఖ్యలో ఉంటారు. ఇలా విశ్వవిద్యాలయ స్వరూప స్వభావాలు పూర్తిగా సనాతన ధర్మానికి అనుగుణంగా ఉన్నాయి.

ధర్మఏవ హతో హంతి - తనను నాశనం చేసేవారిని ధర్మం నాశనం చేస్తుంది.

విశ్వవిద్యాలయం సంకుచితత్వంతో, మతతత్వంతో తిరోగమనవాదంతో కూడుకుని ఉన్నదని కొందరు మొదటినుంచీ విమర్శిస్తూవచ్చారు. విశ్వ విద్యాలయం పేరు నుండి 'హిందూ' పదాన్ని తొలగించాలంటూ కొందరు ఒత్తిడి తేవడానికి ప్రయత్నించారు. శంకు స్థాపన రోజు వరకు ఈ యత్నాలు సాగాయి. విశ్వవిద్యాలయం సూత్రధారులు మొదటి నుంచి వీటిని పట్టించుకోలేదు. హిందూ అనే పదాన్ని తొలగించాలని కోరేవారు పొరపడుతున్నారని ఆ తర్వాత మహాత్మా గాంధీ కూడా ప్రకటించారు. నేడు ప్రసిద్ధి పొందిన 'బనారస్ హిందూ విశ్వవిద్యాలయం' అనే పేరే దానికి ఉండాలని ఆయన చెప్పారు.

## తన శిష్యునితో దీక్షాగురువు కలయిక

హిందూ ధర్మవిజ్ఞానాన్ని ఉచ్చస్థాయిలో వ్యక్తీకరించడం కోసం విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కనుక శంకుస్థాపన మహోత్సవంలో యజ్ఞయాగాలు, ప్రవచనాలు, పురాణ కాలక్షేపాలవంటి కార్యక్రమాలు ఉండడం సహజమే. పండిట్‌జీ ఈ కార్యక్రమాల నిర్వహణలో పాల్గొన్నారు. యజ్ఞయాగాలకు ఇతర ధర్మ అనుష్ఠానాలకు వచ్చిన పురోహితులకు వసతి, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం, వారికి పట్టణాన్ని చూపించడం వంటి పనులలో ఆయన నిమగ్నమై ఉన్నారు. ఆ కార్యక్రమాల ఒత్తిడి మధ్య ఆయన తన కుటుంబ సభ్యుల గురించి అసలు పట్టించుకోలేదు. ఎవరు ఎక్కడ ఉన్నారు. ఏమి తింటున్నారు. ఎక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు అనే సంగతి ఆయన ఆలోచించనే లేదు. అసలు వారి విషయమే ఆయన దృష్టిలో లేకుండా పోయింది.

ఉత్సవాలలో నాలుగురోజులు గడిచాయి. వసంత పంచమి రోజు వచ్చింది. విద్యా దేవి సరస్వతి అవతరించిన ఆ పర్వదినాన ఉపన్యాసాలు, గోష్ఠులు, అధికారుల సమావేశాలు నిర్ణీత కార్యక్రమం ప్రకారం జరుగుతున్నాయి. ఆరోజున సరస్వతీ పూజను ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. మామిడాకులతో, అరటి బోదెలతో వేదికను అలకరించారు. 60-70 మంది విద్యార్థులూ, అధ్యాపకులూ వేదిక ఎదురుగా కూర్చున్నారు. వేదిక ఎదుటనే యజ్ఞకుండం ఏర్పరచారు. మంత్రోచ్చారణతో యజ్ఞం ప్రారంభమయింది. మాలవ్యాజీ కర్మకాండలను నడిపిస్తున్నారు. ఎదురుగా కూర్చున్న విద్యార్థులుకూడ ఆ మంత్రాలను పఠిస్తున్నారు. ఈ పిల్లలలో పండిట్‌జీ పుత్రుడు శ్రీరామ్‌కూడా ఉన్నారు. అతడి వయస్సు 5-6 సంవత్సరాలు ఉంటుంది. మామూలుగా ఆ పిల్లవాడు తన తల్లితో, ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఉండేవాడు. ఆ రోజున పండిట్‌జీ కొంత దూరాలోచన చేసి అతడిని అక్కడకు తీసుకువచ్చారు. సరస్వతీ పూజలో పాల్గొనడంతో పాటు, మాలవ్యాజీ సాన్నిధ్యంలో కొద్ది సమయం గడిపే సదవకాశం ఆ పిల్లవాడికి కలిగించాలని ఆయన భావించి ఉండవచ్చు.

సరస్వతీ పూజ యథావిధిగా జరుగుతోంది. పిల్లలు మంత్రాలను పఠిస్తూన్నపుడు, వల్లిస్తూన్నపుడు వాతావరణం మరింత మనోహరంగా రూపొందుతోంది. వాళ్లు చిన్నపిల్లలు కదా. అపుడపుడు వారి ఉచ్చారణలో దోషం వస్తున్నది. కాని ఆ విషయం పట్టించుకున్న వారు అరుదు. వారి ఉత్సాహాన్ని పెంచడమే సముచితమని అక్కడి పండితులూ, అధ్యాపకులూ భావించారు. ఈ పిల్లలలో అందరి కన్న చిన్నవాడు శ్రీరామ్. ఇతడు మంత్రాలు పఠిస్తూన్నపుడు మాలవ్యాజీ దృష్టి ఇతడి మీద పడింది. ఇంత చిన్న వయసులో బాలుడు మంత్రోచ్చారణ చేస్తూ ఉంటే, ఆయన కళ్లు ఆర్పకుండా తదేకంగా చూస్తూండిపోయారు. సరస్వతీ పూజ ముగిసింది. ప్రసాద వితరణ పూర్తయింది. ఆ వెంటనే మాలవ్యాజీ ఆ బాలుడి దగ్గరకు వచ్చారు. చేతితో ఆప్యాయంగా అతడి తల నిమిరారు.

ఆయన సమీపించగానే శ్రీరామ్ ఆయన చరణాలకు ప్రణామం చేశాడు. "నాయనా ! నీ తండ్రిగారు ఏరి?" అని ఎంతో ముద్దుగా అతడిని అడిగారు. శ్రీరామ్ జవాబు చెప్పేలోగా పండిట్‌జీ మాలవ్యాజీ ముందుకు వచ్చారు. ఆయన ముందు వినమ్రంగా నిలబడి, "మహామనా ! మీ స్నేహ వాత్సల్యాలను పంచుకున్న నేనే." అన్నారు. మాలవ్యాజీ ఆ బాలుడి గురించి మరి నాలుగైదు విషయాలు అడిగారు. అతడిని కాస్సేపు అలా నిశితంగా చూస్తూ ఉండిపోయారు. "ఇతడికి ఉపనయనం అయిందా?"అని అడిగారు. "త్వరలో చేయాలి. మీ చేతులతో జరిగితే మా అదృష్టం పండినట్లే"- అని పండిట్‌జీ జవాబు చెప్పారు.

మాలవ్యాజీ ముఖంపై చిరునవ్వు వెలిగింది. తెల్లటి ఆయన మీసాల వెనుక విచ్చుకున్న ఆయన పెదవులు మందహాసాన్ని చిందించాయి. తన మనసులోని మాట పండిట్‌జీ నోటి వెంట వెలువడిందన్న భావం ఆ మందస్మితంలో కదలాడింది. 'నేను మంత్రదీక్ష ఇస్తాను. సంకల్పం జరిగిపోయింది. కనుక ఈ బాలుడు ఇప్పటి నుండి దీక్షలో ఉన్నట్లే, ఇంకా క్రియ జరగలేదు. సంకల్పం జరిగింది కదా. దీక్ష ప్రారంభమయిందని భావించండి. తగు సమయంలో దీక్ష కూడా జరుగుతుంది' - అని మాలవ్యాజీ అన్నారు.

ఆ శుభ ముహూర్తం కొద్ది సంవత్సరాల తర్వాత వచ్చింది. ఆ రోజున చుట్టు ప్రక్కల స్థలాలలో కార్యక్రమాలు జరిగాయి. ఏనీ బిసెంట్ ఉపన్యాసం ఇవ్వవలసి ఉంది. మైసూరు మహారాజు కృష్ణరాజ వడయార్, డాక్టర్ సుందరలాల్ మున్నగు ప్రముఖులతో మాలవ్యాజీ విడివిడిగా సంప్రదింపులు జరుపవలసి ఉంది.

ఆ శంకుస్థాపన మహోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో ప్రధానమైన ఘట్టం. చరిత్రకు కొత్త మలుపు ఇచ్చిన సంఘటనలు మరెన్నో జరిగాయి. ఈ మహోత్సవం ఫలితంగా సనాతన ధర్మ సంస్కృతులు నవోన్మేషం పొందాయి. విద్య, ధనం, శక్తి, కళ, సాధన, శౌర్యం, అనే పాయలు గల గంగ అక్కడ ప్రవహించింది. మహాత్మా గాంధీ జాతీయతా భావనలతో పొంగిపొరలే ప్రసంగాన్ని ఆ సందర్భంగా ఇచ్చారు. ఆ ప్రసంగంలో ఆయన ప్రతిభా మూర్తులకు పిలుపు నిచ్చారు. ప్రతిభా మూర్తులు తమ కర్తవ్యాలకు విముఖులు అయినారని ఆయన అన్నారు. గాంధీజీ ఆ ప్రసంగంలో రాజులు, మహారాజులను, సంపన్నులను తీవ్రంగా విమర్శించారు.

**గుణిషు నచ లింగం నచ వయః - గుణవంతులకు లింగ వయో భేదాలు లేవు.**

శ్రోతలలో రాజులూ, మహారాజులూ ఉన్నారు. గాంధీజీ చేసిన ఈ విమర్శకు వారు ఉద్రేకం పొందారు. కార్యక్రమాన్ని బహిష్కరించి, సభా మండపం వెలుపలికి వెళ్లిపోయారు. ఇలా వెళ్లిన వారిలో ఏనీ బిసెంట్ కూడా ఉన్నారు. మాలవ్యాజీ మాత్రం ప్రశాంతంగా కూర్చుని ఉండిపోయారు. కొందరు సభ విడిచి వెళ్లిపోవడాన్ని ఆయన పట్టించుకోలేదు. ఎలాంటి ఒత్తిళ్లకూ లొంగకుండా సత్యాన్ని స్వీకరించడం, దానికి అండగా నిలబడడం ప్రతిబింబించిన మరెన్నో సంఘటనలు ఆ రోజుల్లో జరిగాయి. వాటి సంస్కారాలు వాతావరణంలో జీర్ణించిపోయాయి. అక్కడికి వచ్చిన ప్రజల మనస్సులను, వారికి తెలిసీ తెలియకా, ప్రభావితం చేశాయి.

## మాలవ్యాకు సహచరులు పండిట్‌జీ

మలవ్యాజీ సహచరులలో పండిట్‌జీ చిరస్మరణీయులు మలవ్యాజీ రాజకీయాలలో, విద్యా రంగంలో, సాంఘిక సంస్కరణలో, సేవా కార్యక్రమాలలో నిమగ్నులు అయ్యేవారు. అయినా, భాగవత కథాగానం, భాగవత తత్వములను వ్యాఖ్యానించే పని వారికి ప్రియతమమైన ధర్మానుష్ఠానం. పండిట్‌జీ తమ వ్రజ భూమిలో అపర వ్యాసుడుగా ప్రసిద్ధి పొందారు. తాను మాలవ్యాజీకి వినమ్ర శిష్యుడననీ, అనుచరుడననీ పండిట్‌జీ చెప్పుకునే వారు. ఆయన కార్యరంగం కొంతవరకు పరిమితమైనదే. అయినా మాలవ్యాజీ కథాకథన శైలికి ప్రాతినిధ్యం వహించే ప్రవక్తగా వ్రజ మండలంలో ఆయన పేరు ప్రఖ్యాతులు గడించారు. ఆ ప్రాంతంలోని రాజ కుటుంబాలలో పండిట్‌జీపట్ల అపారమైన భక్తి,గౌరవాలుండేవి.

పురాణ ప్రవచనం మాటలు అల్లే కళ కాదు. ప్రవచనం ఇవ్వాలంటే మన మనసులోని మాటను అందంగా ఆకర్షకంగా చెప్పే సామర్థ్యం ఉండాలి. వాటి ప్రభావం ఉంటుంది. అయితే చెప్పే విషయం వెనుక విశ్వాస బలం కూడా ఉండాలి. ఆయా ఉపదేశాలను తమ జీవితాలకు అన్వయించుకోవడం వల్ల ఆ బలం వస్తుంది. భాగవతం కరుణ, భక్తి సంగమించిన శాస్త్రం. ఆ మహా పురాణం ప్రేత పిశాచాల కషాయ కల్మషాలను సైతం క్షాళన చేస్తుంది. భాగవత పురాణంలో దాని మహిమను వర్ణించేటపుడు మహా పిశాచం కథను తప్పకుండా వినిపిస్తారు. కరుణ తత్వం, భక్తి తత్వం పండిట్‌జీ జీవితంలో వెలుగుల వెల్లువ వలె ప్రకాశించేవి. ఆయన సంపర్కంలోనికి వచ్చిన ఫలితంగా ఎందరెందరో తమ చెడుగులను వదులుకున్నారు. అలా వ్యక్తులు తమ దోషాలకూ వికృతులకూ పూర్తిగా దూరమైన సంఘటనలు కోకొల్లలు.

పండిట్‌జీ నివాసానికి కొద్ది దూరంలో ఉన్న అడవిలో నివసించే ధాంధూ అనే బందిపోటు దొంగ దొంగతనాన్ని వదులుకున్న సంఘటన ఒకటి ఉంది. ఆ ప్రాంతంలో అతడు భయోత్పాతం సృష్టించాడు. అతడికి స్వంత ముఠా లేదు. అయితే అతడు మహా బలవంతుడు. 25-30 మందిని ఒంటరిగా ఎదుర్కొనే సామర్థ్యం అతడికి ఉంది.

పండిట్‌జీ పురాణం చెప్పడానికి వెళుతున్నారు. దారిలో ధాంధూ ఎదురైనాడు. అతడు ఇలా అన్నాడు- మీరు బ్రాహ్మణులు. పూజనీయులు. కనుక మిమ్మల్ని అగౌరవపరచను. అయినా నేను దొంగను. దొంగతనం మానివేస్తే నాకూ, నావాళ్లకూ జీవితం ఎలా గడుస్తుంది? మీపై బలప్రయోగం చేయను. అయితే మీ దగ్గర ఉన్నదంతా మారుమాట లేకుండా నాకు ఇచ్చి వేయండి.

ఈ మాటలు ధాంధూ తీవ్ర స్వరంతో అన్నాడు. మామూలు మనఃస్థితి గల వ్యక్తి అయితే అతడి ఉద్దండతకు, కఠోర స్వరానికీ, దురాక్రమణ ధోరణికీ వణికిపోతాడు. భయభ్రాంతులు కల్పించే అతడి వ్యక్తిత్వం పండిట్‌జీ మీద ఏ మాత్రం పని చేయలేదు. ఆయన ఎంత నిశ్చింతగా వెళుతున్నాడో అంత నిర్ద్వంద్వంగా నిలబడ్డారు. ధాంధూ కళ్లలోకి సూటిగా చూడసాగారు. తన బెదిరింపు ఎంతమాత్రం పనిచేయకపోవడం చూచి, ఆ దొంగ ఆశ్చర్యపోయాడు. అతడు ఇలా అన్నాడు - పండిట్‌జీ! నేను చెప్పింది మీరు విన్నారు కదా.

పండిట్‌జీ ఇలా అన్నారు - విన్నాను. కాని నేను ఇప్పుడు దమ్మిడీ అయినా ఇవ్వను. పురాణం వినడానికి నీవు నాతో వస్తే మాత్రం - అక్కడ నాకు అందే దాన దక్షిణలు మొత్తం నీకు ఇచ్చివేస్తాను. ఇది నా వాగ్దానం.

ధాంధూ కళ్లు అలా తెరిచి ఉండిపోయాయి. మొదట కలిగిన ఆశ్చర్యంకన్న మరింత గొప్ప ఆశ్చర్యం ఇప్పుడు అతడికి కలిగింది.

ఇద్దరిమధ్యా కొంతసేపు సంభాషణ జరిగింది. పండిట్‌జీ చెప్పిన ఏ మాట పని చేసిందో మరి. పురాణం వినడానికి ధాంధూ ఒప్పుకున్నాడు. ఆయనవెంట బయలుదేరాడు. భాగవత సప్తాహం ఏడు రోజులూ శ్రద్ధగా కథ విన్నాడు. పాత సంస్కారాలు మధ్యమధ్యలో వెలికి వచ్చేవి. ప్రజలను బెదిరించాలని, భయపెట్టాలని అనుకునేవాడు. అయితే ఆ స్థితి ఎక్కువ కాలం సాగలేదు. సప్తాహం పూర్తి కాగానే, పండిట్‌జీ తనకు అందిన దాన దక్షిణలను ప్రోగుచేసి ధాంధూ చేతుల్లో పెట్టారు. రూపాయలు, పైసలు, నగలు, తినుబండారాలు ఆ మూటలో ఉన్నాయి. దొంగ ఆ మూట ఎత్తి, తలమీద పెట్టుకుని - స్వామీ! ఎక్కడికి వెళ్లాలో సెలవీయండి, అన్నాడు. పండిట్‌జీ ఇలా అన్నారు - నీవు దీన్ని ఎక్కడికి తీసుకువెళ్లాలని అనుకుంటే అక్కడికి తీసుకువెళ్లు. నేను నా మాట నిలబెట్టుకున్నాను.

ధాంధూ ఆ మూట ఎత్తి ప్రక్కన పెట్టాడు. పండిట్‌జీ కాళ్లమీద పడ్డాడు. అదే పనిగా ఏడుస్తూ ఇలా అన్నాడు -

స్వామీ! నాకు దారి దొరికింది. నన్ను క్షమించండి. ఇక నుంచి నిజాయితీగా కష్టించి పనిచేసి పొట్టపోసుకుంటాను. అలా వచ్చిన డబ్బుతోనే నా కుటుంబాన్ని పోషిస్తాను.

పండిట్‌జీని బ్రతిమాలి, కాళ్లావేళ్లా పడి ఆ మూటను వారి ఇంటివద్దకు తీసుకువెళ్లడానికి బయలుదేరాడు.

అతడిని చూచినవాళ్లు ఇతను బందిపోటు దొంగ ధాంధూ ఏనా అని విస్తుపోయారు.

K K K

**మిత్రుణ్ణి రహస్యంగా మందలించు. బహిరంగంగా అభినందించు.**

మాతాజీ దివ్య జీవనం - 6

# యుగశక్తి ప్రాణప్రతిష్ఠ

గాయత్రీ తపోభూమిని నిర్మాణం చేయవలెననే మూల ప్రేరణ మాతాజీ అంతఃకరణంలో అంకురించింది. ఒకరోజు ప్రొద్దున్న ధ్యానం యొక్క భావదశలో ఆమె జగన్మాత యుగశక్తి గాయత్రీ రూపంలో ఒక మందిరంలో ఉన్నట్లు దర్శించింది. అనేకమంది మాత పూజ, అర్చనా చేయుచున్నారు. తద్వారా ఆ తల్లినుండి ప్రజ్ఞ, మేధ, సద్బుద్ధులతోపాటు తమ కష్టములనుండి ముక్తిచెందే వరదానాలు కూడా పొందుతున్నారు. ఈ జగదాంబ మందిరంలో ఇంకొక విశేషం మాతాజీ తన ధ్యానంలో గమనించారు. ఈ మందిరం ఇతర సామాన్య మందిరములవలె కేవలం పూజ, అర్చనా జరిగే స్థలం కాదు. ఇక్కడి నుండి లోకహితం కోరే అనేక కార్యకలాపాల సంచాలన జరుగుతున్నది. లెక్కలేనన్ని సద్‌జ్ఞాన ధారలు "ధియో యోనః ప్రచోదయాత్" సందేశం ప్రసారితం చేస్తూ భువన వ్యాప్తమగుచున్నవి. ఇక్కడి నుండే భగవాన్ మహాకాలుడు తన యుగ ప్రత్యావర్తన ప్రక్రియను శుభారంభం చేయుచున్నారు.

ఈ అద్భుత అనుభవంలో మునిగి ఉన్న మాతాజీ ఆరోజు సాధననుండి కొంచెం ఆలస్యంగా బయటికి వచ్చింది.

సాధనానంతరం తన నిత్య నియమానుసారం ఆమె ఇంటిలోని, అఖండజ్యోతి కార్యాలయంలోని ముఖ్యమైన పనులు యథావిధిగా నిర్వర్తించింది. ఆ తరువాత పరిజనుల నుండి వచ్చిన ఉత్తరములు చదివి వాటికి జవాబిచ్చే కార్యక్రమం మొదలైంది. ఈ పని పరమ పూజ్య గురుదేవులు మాతాజీ కలిసి చేసేవారు. మధ్యలో కొన్ని మాటలు మాట్లాకునేవారు. ఆరోజు ఉత్తరం విప్పుతూ మాతాజీ తన అనుభూతులను కూడా చెప్పింది. మాతాజీ మాటలు విన్న తరువాత పరమ పూజ్య గురుదేవులు ఇలా అన్నారు - ఇవాళ సాధన చేస్తున్నపుడు నా మార్గదర్శకుని నుండి నాకు కూడా ఇలాంటి సందేశమే వచ్చింది. ఈ సందేశానుసారము, దేశపు విభిన్న భాగాలనుండి అనేకమంది సాధకులు వచ్చి నిజమైన ఆధ్యాత్మ సాధన చేయగలిగేటటువంటి ఒక కేంద్రం స్థాపించ వలసి ఉన్నది. వారికి ఆధ్యాత్మిక తత్త్వదర్శన నిజ స్వరూపం అనుభూతిలోకి రావాలి. అంత మహత్తర కార్యం ప్రారంభించడానికే భగవంతుడు మనల్ని పృథ్వీమీదకి పంపాడు.

మాతాజీ, గురుదేవుల మాటలలోని సారం ఒకటే. తమ మాటలయ్యాక ఒకరినొకరు చూసుకుని పనిలో నిమగ్నమయ్యారు. ఆరోజునుంచీ గాయత్రీ తపోభూమి నిర్మాణ సంకల్పం సక్రియం అయినది. దాని కొరకు ఉపయుక్తమైన భూమిని వెతకటం మొదలుపెట్టారు. ఇంట్లో అప్పుడు 6,000 రూ॥ మాత్రమే ఉన్నవి. వాటి నుపయోగించి భూమిని కొనుగోలు చేసే ఆలోచన చేశారు. అప్పుడు మథురలో కిశోరి రమణ కాలేజిని ఆనుకొని జీర్ణావస్థలో ఉన్న ఒక గాయత్రీ మందిరం ఉండేది. అది కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉండటం వలన గ్రామస్థులు దానిని "గాయత్రీ టీలా" అనేవారు. కొందరు దీనిని కొనమని సలహా ఇచ్చారు. కానీ కుదరలేదు. ఎందుకంటే అది ఎత్తైన ప్రదేశంలో ఉండటమేకాక క్రిందనుంచి చాలా కోసుగా ఉన్నది. పైన ఉన్న స్థలం చాలా స్వల్పం. ఈ కారణం వలన ఈ స్థలం తీసుకొనబడలేదు.

భూమి కొనుగోలు చేయుటకు 'మండి రాందాస్'లోకూడా చాలా ప్రయత్నాలు చేశారు. కానీ ఎక్కడా దొరకలేదు. నెలల తరబడి చేసే ఈ ప్రయత్నాలు సానుకూలం అవకపోవటం వలన మాతాజీ తాను ఖాళీ ప్రదేశం వెదుకుటకు ప్రయత్నించింది. ఒకటి రెండు రోజులు ఈవిధంగా ప్రయత్నించడంతోనే ఆమెకు ఒకచోటి నుండి ప్రకాశపుంజం బయటికి రావటం కనిపించింది. ఆ స్థలంలోని ఆధ్యాత్మిక స్పందనలు ఆమెకు తన అంతశ్చేతనలో అనుభవంలోకి వచ్చాయి. ఒకరోజు గురుదేవులతోపాటు బయటికి వెళ్ళినప్పుడు ఆమెకు ఈ భూమి ప్రత్యక్షంగా కనిపించింది. ఈస్థలం మథురనుండి సుమారు కిలోమీటరు దూరంలో మథుర - బృందావనం మార్గంలో ఉంది. అప్పుడు అక్కడ ఒక బావి, హాలు, ఒక వరండా ఉండేవి. ఈ స్థలం రోడ్డుకి చాలా దగ్గరగా ఉంది. మాతాజీ ఈ స్థలమును గురుదేవులకు చూపించి తన ధ్యానానుభూతిని వివరించినప్పుడు గురుదేవులు కొంతసేపు కళ్ళు మూసుకుని భావసమాధిలోకి వెళ్ళారు. తన తల్లీనతనుంచి బయటికి వచ్చాక ఇలా అన్నారు - "మీరు సత్యమునే చెప్పుచున్నారు. ఈ స్థలం ఒకప్పుడు మహర్షి దుర్వాసుని తపోభూమి. ఇప్పటికీ ఆయన తపస్సు ప్రభావం ఉన్నది. ఈ భూమి మన కార్యక్రమాలకు సరిపోతుంది." ఒకప్పుడు బాల్యంలో ఆయన ఈ స్థలమునకు వచ్చారు కూడా.

దీనిని కొనుగోలు చేయుటకు అవసరమైన ప్రయత్నాలు చేయబడినవి. ఎవరి పేరుమీద ఆ కాగితం ఉన్నదో అతను సులభంగానే రాజీ అయినాడు. కొద్దిరోజులలో అవసరమైన ప్రభుత్వ

**తుప్పుపట్టి చావకు. తుదివరకు జ్వలించు.**

కార్యకలాపాలు పూర్తి చేసుకుని భూమిని రిజిష్టరు చేయించిరి. ఈవిధంగా భూమి సమస్య తీరిన తరువాత క్రొత్త సమస్య వచ్చిపడింది. భూమిని కొన్న తరువాత వారి దగ్గిర ఒక్క చిల్లిగవ్వ లేదు. భూమిపై ఏదైనా కట్టి దానిని ఉపయోగించుకొనుటకు ధనం అత్యంత అవసరం. ఇతరులను అడగటం కానీ తన అవసరములు అందరికీ తెలుపుటకానీ తపోమూర్తి గురుదేవుల తపో నియమములకు విరుద్ధములు. ఆకాలంలోకూడా ఆయనను తెలిసి గుర్తించి ఆయనమీద విశ్వాసం, నిష్ఠ, భక్తి ఉన్నవారు చాలామంది ఉండేవారు. ఆయన కనుసైగ చేస్తే చాలు ధనరాశి ఆయన కాళ్ళమీద వచ్చి పడేది. కానీ ఇది ఆయన తపోనిష్ఠ, జీవన మర్యాదలకు విరుద్ధం. కానీ ధనం అవసరమేకదా!

ఈ అవసరమును మాతాజీ గమనించుచున్నది. ఆమె కొద్దిసేపు ఆలోచించి ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా తన దగ్గరున్న అన్ని నగలు, డబ్బు గురుదేవుల చరణములపై పెట్టెను. ఏమీ చెప్పకుండా, ఏవిధమైన సంకేతమూ ఇవ్వకుండా, ఏవిధమైన మాటాలేకుండా మౌనంగా మాతాజీ తన సర్వస్వం ఇచ్చివేసెను. గురుదేవులు ఒక్కసారి నెమ్మదిగా "మీరిలా ఎందుకు చేస్తున్నారు? ఏదోవిధంగా ధన వ్యవస్థ జరుగుతుందికదా!" గురుదేవుల ఈ మాట విన్న మాతాజీ ఏమీ అనలేదు. ఆమె కన్నులలో నీరు తిరిగెను. ఆమె భావ సంవేదన చూసి గురుదేవులు ఏమీ అనలేకపోయారు. మౌనంగా మాతాజీ సమర్పించిన ఈ నిధిని స్వీకరించారు. గాయత్రీ తపోభూమి నిర్మాణం, గాయత్రీ పరివార్ సంఘటనల కొరకు మాతాజీ చేసిన ఈ అంశదానం అపూర్వం.

సాధారణ స్త్రీలలో తమ భూషణములమీద విశేషమైన వ్యామోహం చూస్తూ ఉంటాం. వయసుతో పాటు ఈ మోహం పెరుగుతుందే తప్ప తగ్గదు. మొదట తమ కొరకు ఆ తరవాత కూతురు లేక కోడలు కొరకు భూషణములు చేయించటం జరుగుతూ ఉంటుంది. ఈ ప్రక్రియ ఎక్కడా ఆగదు. జరుగుతూనే ఉంటుంది. కానీ మాతాజీ స్త్రీలోని సహజ బలహీనతను వదులుకొని అత్యంత సాధారణంగా ఈ అద్భుత కార్యాన్ని చేసి చూపించింది. ఆమె ఇలా ఎందుకు చేయగలిగిందంటే - నిజమైన అలంకరణ శరీరం వల్ల కాదు, వ్యక్తిత్వం వలన జరుగుతుంది అనే సత్యం తరచి తరచి లోతుగా తెలుసుకొనెను. ఈ సత్యమును గుర్తించిన మాతాజీ ఆరోజు తన భూషణములను ఇచ్చివేయుటయేకాక అప్పటినుండి బహుమూల్య వస్త్రములను ధరించటం మానివేశారు. ఈవిధంగా ఆంతరికమేకాక బాహ్య తపశ్చర్యలోని అన్ని నియమములను పాటించడానికి సంకల్పించారు.

ఆ క్షణంలో వనవాసం చేస్తూ శ్రీరామచంద్రమూర్తితోపాటు వెళ్ళుటకు సీతమ్మ తల్లి తపస్విని వేషం ధరించిందా అనిపించెను. ఏ కళ్ళు ఈ దృశ్యాన్ని చూసాయో అవి ధన్యమైపోయాయి. ఎవరు భావజగత్తులో ఈ క్షణంలో ఈ దివ్య దృశ్యమును సాక్షాత్కరించుకుంటున్నారో వారిమీద కూడా మాతా భగవతి, శ్రీరాముల అద్భుతమైన కృప ఉంటుంది. తపోనిరతులైన ఈఋషి యుగ్మం సంకల్పం రూపుదాల్చుచున్నది. గాయత్రీ తపోభూమి తన స్వరూపం పొందుచున్నది. దీని ఊర్జాకేంద్రం రూపంగా యుగశక్తి మాతా గాయత్రీ మందిరం మాతాజీ తన ధ్యాన స్థితిలో ఎలా చూసెనో అలాగే నిర్మించబడింది. యుగశక్తి ప్రాణప్రతిష్ఠకి ముందు మాతాజీ తన ఆరాధ్యునితో కలిసి విశేష సాధనలలో నిమగ్నమై ఉండెను. ఈ శుభ ఘడియలలో 2400 తీర్థములలో నీరు, 2400 పవిత్ర స్థలములనుండి మట్టి తీసుకురాబడింది. అంతేకాక రహస్యంగా కొన్ని దివ్య ప్రక్రియలు చేయబడ్డాయి. తద్వారా జగన్మాత చేతన ఈ మహామందిరంలో నిరంతరం జాగృతంగా ఉండి, ఈస్థానపు అమోఘ ప్రభావం అందరికీ దీర్ఘకాలం అనుభవంలోకి వస్తూఉంది.

మందిర నిర్మాణంతోపాటు మిగతా అన్ని కార్యక్రమములు, సంచాలనా వ్యవస్థకూడా అక్కడ నుంచే చేయబడినది. పవిత్ర యజ్ఞశాలలో దివ్య అగ్ని స్థాపించబడినది. సాధనా శిబిరాలతోపాటు అనేక యోజనలు అక్కడనుంచే నిర్వహించబడుచున్నవి. సుదూర ప్రాంతములనుండి ప్రజలు రావటం మొదలిడిరి. ఎవరు ఇక్కడికి వచ్చినా వారందరి సామూహిక పరిచయం ఒక్కటే. వీరందరూ మాతాజీ పిల్లలు. వీరందరి మనసులు తమ తల్లికొరకు ఆరాట పడుచున్నవి. వీరందరి ప్రాణములు తమ తల్లిని ఆర్తితో పిలుచుచున్నవి. తల్లి ప్రేమ, మమత, వాత్సల్యం అయస్కాంతాలవలె వారి నిక్కడికి ఆకర్షించుచున్నవి. మాతాజీ తమ పిల్లలకు సుసంస్కారములను ఇచ్చుటకు సంసిద్ధురాలైంది. తన పిల్లల చేతనత్వం ఉత్తరోత్తరా నిర్మలం, పవిత్రం, పరిష్కృతం అగుటకు ఆమె నిరంతరం ప్రయత్నించుచున్నది. దాని కొరకు ఏది అవసరమో ఆమె నిరంతరం దానినే చేయుచుండెను.

## కణకణంలో నిండిన "ఆత్మవత్ సర్వభూతేషు" భావం

తన పిల్లలను సంస్కారవంతులను చేయడానికి మాతాజీ నిరంతరం ప్రయత్నిస్తూ ఉండేది. గాయత్రీ తపోభూమి, అఖండజ్యోతి సంస్థాన్‌లలో నివసించేవారు, పనిచేసేవారు, వచ్చి వెళ్ళేవారు అందరూ ఆమె పిల్లలే. వీరందరికీ ఆమె సొంత తల్లే. తల్లి ఎవరు? అనేదాని మీద ఆమెకు ఒక విశేషమైన నిర్వచనం ఉండేది. మాటల మధ్యలో ఆమె ఇలా అంటూండేవారు - "జన్మనిచ్చే ఆమె జనని. కానీ

**నచ ధర్మో దయా సమః - దయను మించిన ధర్మం లేదు.**

సంతానమునకు సంస్కారము నిచ్చి వారి జీవితములను మంచి మార్గంలోకి సరిదిద్దడానికి ప్రతినిముషం, ప్రతిక్షణం ప్రయత్నించే ఆమే తల్లి. తన పిల్లలను పైకి లేపటానికి, వారిని ముందుకు తీసుకువెళ్ళడానికి వారి ఆంతరిక వికాసము కొరకు తల్లి రాత్రి పగలు శ్రమిస్తుంది. ఉత్తమ సంస్కార బీజారోపణతోనే మానవ జీవితం నిజంగా సవరించబడుతుంది. దీనితోనే తల్లి మాతృత్వ సాధన సఫలత ప్రామాణికమౌతుంది''. ఆమె ఇలా అంటూండేది - ''నేను మీ అందరి జనని కాను. కానీ మీ అందరికీ మంచి సంస్కారమిచ్చే నిజమైన తల్లిని.''

ఆమె నిరంతరం ఈ లక్ష్యమువైపే ప్రయత్నశీలురాలై ఉండేది. ఆమె మాటలలో, చేతలలో ఆమె దగ్గరికి వచ్చే ప్రతివారికి ఈ సత్యం కనిపిస్తూండేది. ఆమె పెట్టే భోజనంలో ఇది చాలా ఎక్కువగా కనిపించేది. పరమపూజ్య గురుదేవులు పరిజనులకు, కార్యకర్తలకు చాలా స్పష్టంగా తెలిపేవారు. ఆయన ఇలా అనేవారు - ''మీరు మాతాజీని సాధారణ వ్యక్తి అని అనుకోకండి. ఆమె శక్తి స్వరూపిణి. ఆమె మహాశక్తి. తన ఆధ్యాత్మిక ఐశ్వర్యమును దాచుకొని అతిసాధారణంగా జీవించుచున్నది. ఆమెను గుర్తించుట, ఆమెను సవ్యంగా అర్థం చేసుకొనుట అంత సులభం కాదు. మీ పనులు ఆమె ఎంత సులభంగా చేసిపెట్టగలదో అంత బాగా నేను చేయలేను. ఈ నిజమును మీరెంత అర్థం చేసుకుంటారో నాకు తెలీదు. కానీ నిజమేమిటంటే ఆమె సంపర్క మాత్రంతో పూర్వ జన్మల కషాయ కల్మషములు, కలుషిత సంస్కారములు నశిస్తాయి. వ్యక్తిత్వంలో నూతన దివ్య సంస్కారముల బీజారోపణ జరుగుతుంది.''

ఈ విషయమై పరమపూజ్య గురుదేవులు ఇంకా ఇలా చెప్పేవారు - మాతాజీ భోజనం చూడటానికి చాలా సాదాగా, సాధారణంగా ఉంటుంది. కానీ మీరెట్టి పరిస్థితులలోను అలా అనుకోవద్దు. ఆమె భోజనంలో అసాధారణ ప్రాణ శక్తి నిండి ఉంటుంది. అది కడుపు నింపటమేకాక, ఆత్మనుకూడా తృప్తి పరుస్తుంది. మీకు దానం ఇవ్వడానికి, మిమ్మల్ని సుసంస్కారవంతులను చేయడానికి ఆమె ఉపయోగించే విధానములు అద్భుతమైనవి. ఆమె ఎప్పుడు ఏవిధంగా చేస్తుందో ఆమెకే తెలుసు. కానీ ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. ఆమె వంటింటినుంచి వచ్చే భోజనం ఆమెద్వారా చేయబడే శక్తి ప్రదానం. దివ్య సంస్కార బీజారోపణ చేయుటకు అత్యంత సమర్థమైన మాధ్యమం. ఇది ఆమె ఉపయోగించే అతి ఇష్టమైన మాధ్యమం.

మాతాజీ వంట ఇంటిలో వేలాదిమంది, లక్షలాదిమంది భోజనం చేసి ఉంటారు. ఆమె సంపర్కంలోకి ఇంతకంటే ఎక్కువమంది వచ్చి ఉంటారు. కానీ పైన చెప్పబడిన ఈ నిజమును అతి తక్కువమంది తెలుసుకొని ఉంటారు. బుద్ధి దీనిని గ్రహించలేకపోయినా దీని భావానుభూతి చాలామంది పొంది ఉంటారు. ఒక్కొక్కసారి ఈ అనుభూతి ఎంత తీవ్రంగా ఉండేదంటే - దానిని అనుభవించినవాడు దానిని తెలుపకుండా ఉండలేక పోయేవాడు. దీనిని గురించి ఇతరులకు చెపితేనే అతనికి సంతృప్తి.

ఠాకూర్ హనుమంత్ సింగ్ అనుభూతి ఇలాంటిదే. దీనిని ఆయన గాయత్రీ తపోభూమిలో ఒక శిబిరానికి వచ్చిన ఇతరులకి తెలిపెను. దీనిని విన్న వారికి ఈరోజుకికూడా మొత్తం వివరణ అలానే గుర్తున్నది.

ఠాకూర్ హనుమంత్ సింగ్ రాజస్తాన్‌లోని బాడ్‌మేర్ దగ్గర నివసించేవాడు. ఆయన పూర్వీకులు చాలా పెద్ద భూస్వాములు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జమిందారీలు పోయినా ఆయన ఐశ్వర్యంలో ఏమీ తగ్గుదల రాలేదు. ఐశ్వర్యం, భోగ విలాసాల వలన అనేక దుష్ప్రవృత్తులు ఆయన వ్యక్తిత్వంలో నిండి ఉండేవి. ఆయన ధర్మపత్ని, కుటుంబ సభ్యులు ఈ దుర్గుణములు, దుష్ప్రవృత్తులకు చాలా బాధపడేవారు. ఆయనకు తెలియకుండా కుటుంబ సభ్యులకు ఎలాగో అఖండజ్యోతి ప్రతి ఒకటి చేత చిక్కింది. అందులో గాయత్రీ తపోభూమి, అక్కడ జరిగే శిబిరములను గురించి వివరాలు ఇవ్వబడ్డాయి. విషయాలన్నీ చదివిన తరువాత ఆయన కుటుంబ సభ్యులు. ధర్మపత్ని ఆయనను అక్కడకు తీసుకువెళ్ళాలని నిర్ణయించుకున్నారు. వీరందరూ ఠాకూర్ సాహెబ్‌తో మాట్లాడారు. ముందు వద్దన్నా తరువాత ఆయన ఒప్పుకున్నారు.

నిర్ణయించుకున్న తిథికి వారందరూ గాయత్రీ తపోభూమికి చేరుకున్నారు. ఆ రోజులలో వచ్చేవారు గాయత్రీ తపోభూమిలో ఉండి, ఆహారం అఖండ జ్యోతి సంస్థానంలో తీసుకునేవారు. ఈ నియమానుసారం ఠాకూర్ సాహెబ్‌కూడా తన కుటుంబ సభ్యులతోపాటు భోజనము చేయుటకు అఖండజ్యోతికి వెళ్ళారు. మాతాజీ స్వయంగా తన చేతులతో వడ్డించారు. కోడి మాంసం, త్రాగుడుకు అలవాటు అయిన ఠాకూర్ సాహెబ్‌కు ఇలాంటి సాదా భోజనం చేయుట అలవాటు లేనప్పటికి, ఎందుకో ఆయనకు ఈ భోజనంలో ఏదో అద్భుతమైన రుచి అనిపించింది. భోజనం చేసిన తరువాత తపోభూమికి తిరిగి వెళ్ళారు. కుటుంబ సభ్యులు ఎంత బ్రతిమాలుతున్నా ఆయన శిబిరములోని ఏ కార్యక్రమంలోనూ పాలుపంచుకొనలేదు. కానీ భోజన వేళకు అందరితోపాటు మాతాజీ దగ్గరికి వచ్చేసేవారు.

ఠాకూర్ సాహెబ్ ఇలా అన్నారు - ''ఆ భోజనంలో ఏముందో

**ఆశలను తీర్చుకోవడంకాక తగ్గించుకోవడం మనశ్శాంతికి మార్గం.**

నాకు తెలియదు. కానీ ఏదో అద్భుతం ఉంది. రెండు, మూడు రోజులలోనే నాలో అద్భుత భావపరివర్తన జరిగింది. నిరంతరం నా కనుల ముందు మాతాజీ సౌమ్యమూర్తి కనిపించేది. తప్పుడు ఆలోచనలు, తప్పుడు భావనలు మనసులోకి వచ్చేవి కావు. ఒకవేళ పాత అలవాట్ల వల్ల వచ్చినా మనసులో తీవ్రమైన సిగ్గు అనిపించేది. మాతాజీ అన్నీ చూస్తోంది అనిపించేది. నేను ఇలాంటి నీచ ఆలోచనలెలా చేయగల్గుతున్నానని అనుకునేవాణ్ణి. ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత పాత అలవాట్లవైపు మనసు వెళ్ళనే లేదు. కానీ మిత్రులు వాళ్ళేకదా! వాళ్ళ బలవంతం అలానే ఉండేది. అందువల్ల ఒకసారి వాళ్ళతోపాటు వెళ్ళవల్సి వచ్చింది. నేను ఎంత వద్దని చెప్పినా వారు బలవంతంగా మాంసం, మద్యం ఇప్పించారు.''

దీని తరువాత పరిస్థితి విషమించింది. కక్కులు, విరోచనాల పరంపర మొదలైంది. ఎలాగో ఆయనను ఇంటికి చేర్చారు. రోజురోజుకి బాధ పెరిగింది. డాక్టరు మందుల ప్రభావం పనిచేయలేదు. ఠాకూర్ సాహెబ్ ప్రమాదమునకు ఇంటిలోని వారందరూ గాబరాపడిరి. కానీ ఆయనకు ఏవిధముగానూ భయం అనిపించలేదు. ఆయనకు నిరంతరం మాతాజీ తల దగ్గర కూర్చుని తల నిమురుతూ ఇలా చెప్తునట్టు అనిపించేది - "నాయనా! ఇది జబ్బు కాదు. లోపల ఉన్న నీ కుసంస్కారములను కడిగి వేయుటకు జరిగే ప్రక్రియ. ఇక నీలో భోజనం ద్వారా నేను అందచేసినవి మాత్రమే ఉంటాయి. నీవు భయపడవలదు. త్వరలోనే అంతా సర్దుకుంటుంది.''

నిజంగా అలాగే జరిగింది. కొద్దిరోజులలో ఆయన పూర్తి ఆరోగ్యవంతులయ్యారు. అప్పటి నుండి ఆయన జీవనక్రమం పూర్తిగా మారిపోయెను. పూర్వం కలిసి ఉండే మిత్రులు వదిలిపోయారు.

మళ్ళీ గాయత్రీ తపోభూమి శిబిరానికి ఆయన వచ్చారు. ఆయన తన అనుభూతులను విస్తారంగా అందరికీ చెప్పేవారు. మారిన ఆయన జీవన క్రమం చెప్పబడుతున్న సత్యములను రుజువు చేస్తున్నది. బ్రహ్మముహూర్తంలో నియమంగా గాయత్రీ సాధన, ప్రొద్దున్నే హవనం ఆయన జీవనంలో అనివార్య అంగములుగా అయినవి. మాతాజీ ద్వారా ఇవ్వబడిన దివ్య సంస్కారములు ఆయనను సంపూర్ణంగా మార్చివేసినవి. తన అనుభవాలను వివరిస్తూ ఆయన ఇలా అనేవారు - "శ్రేష్ఠ సాధకులకు పూజ్య గురుదేవులు మార్గదర్శకులు. ఆయన అవతారమూర్తి. కానీ మనలాంటి నికృష్ట జనులకు, అనేక విధములైన మాలిన్యములు అంటుకున్న సంతానమునకు మాతాజీయే అంతా. ఆమెతప్ప మనకి ఎవరు మేలు చేయగలరు? గురువు మార్గదర్శకుడు. ఎప్పుడూ సాధకుని పాత్రత చూచును. కానీ తల్లికి ఆమె పిల్లలు ఎప్పుడూ యోగ్యులే. మలమూత్రములతో అంటిఉన్నా తల్లి వారిని ఎప్పుడూ ఎత్తుకొనుటకుకానీ, సంస్కారవంతులను చేయుటకుకానీ ఏవిధమైన సంకోచమూ ఉంచుకోదు. దీనికొరకు అపారమైన ప్రాణశక్తిని ఖర్చుచేయవల్సి వచ్చినప్పటికీ ఆమె వెనుకాడదు. అనేక కష్టములను ఆమె భరించవలసి వస్తుంది. చాలా ప్రసన్నంగా మాతాజీ ఇదంతా భరిస్తుంది. దీనికి కావల్సిన శక్తి తన ఆరాధ్యుని సాధనా సహచరిగా ఉండటం వల్లనే పొందేది.''

K K K

## సంఘర్షణ కాదు - సహకారం

యువరాజు క్రోపాట్కిన్ తన జీవితాన్నంతటినీ ప్రకృతి అధ్యయనంలో గడుపుతూ, జీవ జంతువుల వ్యవహారంద్వారా తెలుసుకొన్న సత్యాలను, చేసిన నిర్ధారణలను, "సంఘర్షణ కాదు - సహకారం'' అనే పుస్తకంలో పొందుపరిచారు. ఆయన మానవ జాతి సుఖము, ఔన్నత్యము పోటీలో లేవని, భావనలోనే ఉన్నవని తెలియజేశారు. భావ వికాసం వలన అభావగ్రస్త జీవితాలకు ఆనందం, ఉల్లాసం లభిస్తాయి. ధ్రువప్రాంతంలోని రాజహంసల జీవిత విధానాన్ని చూస్తే మానవుని బుద్ధులు ఇంత నికృష్టంగా ఉంటాయేమిటా అని బాధ కల్గుతుంది. మానవుడు బుద్ధిజీవి అయికూడా, జీవితం లోతులను ఎందుకు గుర్తించలేకపోతున్నాడోనని ఎంతగానో వ్యధ కల్గుతుంది.

ఒక్కొక్కసారి రాజహంసలు తమ పిల్లలను వదిలివేస్తూ ఉంటాయి. ప్రక్కనున్న మరొక రాజహంస తనకు పిల్లలున్నప్పటికీ వాటినికూడా చేరదీసి సొంత పిల్లల్లాగే ప్రేమతో పెంచుతుంది. ఆ పిల్ల హంసలు, ఈ పిల్ల హంసలు కలిసి ఒకే తల్లిబిడ్డలలా జీవిస్తాయి. ఎంత శ్రమయైనా లెక్కచేయక పెరిగి పెద్దవయ్యే వరకూ పరాయి పిల్లల పాలన, పోషణ హంస చాలా చక్కగా చేయటం చూస్తే ఇటువంటి సహకారం మానవులలో అరుదుగానైనా కనిపిస్తుందా అనే ఆవేదన కల్గుతుంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ఏకస్వాదు న భుంజీత - రుచిగల పదార్థాలను ఒంటరిగా తినకూడదు.**

# కృష్ణావతారం-17
# శిశుపాల వధ

రాజసూయ యజ్ఞమునకు ఏర్పాట్లు మొదలయ్యెను. రాజులందరూ ఆహ్వానింపబడిరి. తగిన సమయమున అందరూ విచ్చేసిరి.

**బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శూద్రా యజ్ఞదిదృక్షవః ।**
**తత్రేయుః సర్వరాజానో రాజ్ఞాం ప్రకృతయో నృప ॥**

రాజా! రాజసూయ యజ్ఞమును దర్శించుటకై దేశములోని రాజులు, వారి మంత్రులు, వారి సేవకులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అందరు అక్కడకు చేరికొనిరి

(1) యజ్ఞమునకు అందరిని ఆహ్వానింపవలెను.

(2) సర్వవర్ణములవారు యజ్ఞములో పాలువంచుకొనవచ్చును.

**అథర్త్విజో మహాశీలాః సదస్యా బ్రహ్మవాదినః ।**
**బ్రహ్మక్షత్రియవిట్ శూద్రా రాజానో యే సమాగతాః ॥**

**దేవర్షిపితృభూతాని లోకపాలాః సహానుగాః ।**
**పూజితాస్తమనుజ్ఞాప్య స్వధామాని యయుర్నృప ॥**

పరీక్షిన్మహారాజా! రాజసూయ యజ్ఞమునకు ఎంతోమంది జనులు వచ్చిరి. ఉత్తమశీలవంతులు, ఋత్విక్కులు, బ్రహ్మవాదులైన బ్రాహ్మణులు, సదస్యులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, రాజులు, దేవతలు, ఋషులు, మునులు, పితరులు, ఇతర ప్రాణులు, తమ అనుయాయులతోపాటు లోకపాలురు మున్నగు వారినందరిని ధర్మరాజు పూజించెను. అటుతరువాత ధర్మరాజుదగ్గర అనుమతి తీసికొని వారు తమతమ నివాసస్థానములకు వెడలిరి.

(1) యజ్ఞములో సర్వవర్ణములవారు కేవలము ప్రేక్షకులుగానే యుండరు, పూజాదికార్యములలో సమానముగ పాలుపంచుకొందురు.

అందరి సత్కారములైన పిమ్మట యజ్ఞమునకు వచ్చిన రాజుల పూజావిషయము చర్చకు వచ్చెను. ప్రథమపూజకు ఎవరిని ఎన్నుకొనవలెను? దీనికై ఆమోదమును అడిగిరి. ఎక్కువ మంది రాజులు కృష్ణునకు అగ్రపూజ చేయవలసినదిగా పలికిరి. దాని ననుసరించి కృష్ణుని పూజ జరిగెను. ఆయన స్తుతింపబడెను. ఇది చూచి శిశుపాలుడు ఉత్తేజితుడై కృష్ణుని నిందింపసాగెను. పాండవులు ఉత్తేజితులగు చుండగా కృష్ణుడు వారిని వారించెను. అత్యాచారమునకు ప్రతీకారము చేయువారిని నీవేల వారించుచున్నావని జనులు అడిగిరి. కృష్ణుడిట్లు పలికెను -

**శ్రుణ్వన్తు మే మహీపాలా యేనైతత్ క్షమితం మయా ।**
**అపరాధశతం క్షామ్యం మాతురస్యైవ యాచనే ॥**

**దత్తం మయా యాచితం చ తాని పూర్ణాని పార్థివాః ।**
**అధునా వధయిష్యామి పశ్యతాం వో మహీక్షితామ్ ॥**

ఇక్కడ ఆసీనులైయున్న మహీపాలు రందరు వినుదురుగాక! నేను ఎందుకు వీని అపరాధమును క్షమించితిని? వీని తల్లి యాచింపగా వీని నూరు అపరాధములను క్షమింతునుగాక అను వరము నిచ్చితిని. రాజులారా! ఆ అపరాధములన్నియు నేటితో పూర్తియైనవి. అందువలన మీరందరు చూచుచుండగా ఇప్పుడే వీనిని వధింతును.

(1) వ్యక్తులు బాగుపడుటకు, తెలిసికొనుటకు ఒక మేరకే అవకాశమీయబడును. పిమ్మట వారిని దండింపకతప్పదు.

అని పలికి అందరూ చూచుచుండగనే కృష్ణుడు తన చక్రముతో శిశుపాలుని శిరస్సును ఖండించెను. యుధిష్ఠిరుని యజ్ఞము సంపన్నమయ్యెను. కొన్నినాళ్ళు అక్కడ ఉండి కృష్ణుడు ద్వారకకు తిరిగివచ్చెను. అక్కడ సాళ్వుడు ద్వారకను ముట్టడించెను. వచ్చినంతనే కృష్ణుడు వానిని ఎదుర్కొనెను. ఘోరయుద్ధము తరువాత కృష్ణుడు సాళ్వుని వధించెను.

**జహార తేనైవ శిరః సకుణ్డలం**
**కిరీటయుక్తం పురుమాయినో హరిః ।**
**వజ్రేణ వృత్రస్య యథా పురందరో**
**బభూవ హాహేతి వచస్తదా నృణామ్ ॥**

వజ్రాయుధముతో ఇంద్రుడు వృత్రాసురుని శిరస్సును ఖండించినట్లు శ్రీకృష్ణ భగవానుడు తన చక్రముతో పరమమాయావియగు సాళ్వుని కిరీట కుండలములతో గూడిన శిరస్సును ఖండించెను. అప్పుడు సాళ్వుని సైనికులు మిగుల దుఃఖముతో అయ్యో! అయ్యో! అని బిగ్గరగా విలపించిరి.

(1) దుష్టసంహారముగూడ భగవానుని అవతారోద్దేశ్యములలో ఒకటి. దీనిలో వరుసగ సఫలత లభించుచునేయున్నది.

రాజసూయ యజ్ఞమువలన పాండవులు ప్రశంసా పాత్రులైరి. దుర్యోధనుడు దానిని తన కవమానముగా తలంచెను. అతడు కపటముతో పాండవులను జూదములో ఓడించి ద్రౌపదినిగూడ అవమానించెను. భగవానుడు ఆమె మానమును కాపాడెను. పాండవులు 12 సంవత్సరములు వనవాసమునకై వెళ్ళిరి. కృష్ణుడు వారిని కలిసికొనుటకై వనమునకు వెళ్ళెను. పాండవులను కలసికొని ఆయన వారిని ఓదార్చెను. తనయొక్క తన పతుల యొక్క అవమానమువలన ద్రౌపది దుఃఖితురాలయ్యెను. కృష్ణుడు ఆమెను ఓదార్చి యిట్లు పలికెను -

**హృదయ వికాసంలో ఉంది మానవత్వం.**

రోదిష్యన్తి స్త్రియో హ్యేవం యేషాం క్రుద్ధాసి భామిని ।
బీభత్సు శరసంఛన్నాన్ శోణితౌఘ పరిప్లుతాన్ ॥

భామినీ! ద్రౌపదీ! నీవు ఎవరిపై కృద్ధురాలవైతివో వారి పత్నులుగూడ తమ ప్రియపతులు అర్జునుని బాణములచే కొట్టబడి రక్తముతో తడిసి భూమిపై పడియుండుట చూచి ఇట్లే విలపింతురు.

(1) స్త్రీ యొక్క అవమానమును భగవానుడు సహింపడు.
(2) సమయానుసారముగ పాపములను అనుభవింప వలసివచ్చును.

తరువాత కృష్ణుడు యుధిష్ఠిరునితో నిట్లు పలికెను - రాజా! నీపై వచ్చిపడిన ఆపద నీ ప్రవర్తనవలననే. నీవు జూదమాడి పెద్దతప్పు చేసితివి. అప్పుడు అక్కడ నేను ఉన్నచో నాశక్తికొలదీ జూదమును నిలుపుచేయుటకు తప్పక ప్రయత్నించి యుండెడివాడను. ఎందుకనగా -

స్త్రియోఽక్షామృగయాపాన మేతత్కామసముత్థితమ్ ।
దుఃఖం చతుష్టయం ప్రోక్తం యైర్నరో భ్రశ్యతే శ్రియః ॥

స్త్రీలపై ఆసక్తి, జూదమాడుట, వేటాడుట, మద్యపానము - ఈ నాలుగును కామమువలన పుట్టిన దుఃఖములని చెప్పబడినవి. వీనివలన మానవుడు ఐశ్వర్య భ్రష్టుడగును.

(1) స్త్రీలపై ఆసక్తి ఉండరాదు. వారి దివ్యత్వముపై గౌరవమును చూపవలెను.
(2) ధనమును జూదము వలనగాక శ్రమవలన పంటలను పండించుట వలన సంపాదింపవలెను.
(3) ప్రజారక్షణకై క్రూరమృగములను చంపవచ్చును. కాని వేటయందలి ఆసక్తి మానవుని క్రూరరాక్షసునిగా జేయును.
(4) మద్యము మున్నగు మాదకద్రవ్యములు వివేకము, భావన రెండింటిని పాడు చేయును.
(5) జూదము మున్నగు దోషములకు శిక్షను యుధిష్ఠిరుడు మున్నగు వారు అనుభవింపగా ఇక సామాన్య జనుల సంగతి చెప్పెడిదేమి ?

న చేత్స మమ రాజేంద్ర గృహ్ణీయాన్మధురం వచః ।
పథ్యం చ భరతశ్రేష్ఠ నిగృహ్ణీయాం బలేన తమ్ ॥

రాజేంద్రా! భరతశ్రేష్ఠా! ఆ కౌరవులు మధురములు హితకరములునగు నామాటలను అంగీకరింపకపోయినచో నేను వారిని బలముతో నిరోధింతును.

(1) తన హితైషులను దుష్టకార్యములనుండి వారింపవలెను.
(2) చెడుపనులను నివారించుటకు బలప్రయోగమును చేయవలసివచ్చినచో తప్పక చేయవలసినదే.

పాండవులకు ద్రౌపదికి నచ్చచెప్పి కృష్ణుడు ద్వారకకు తిరిగి వచ్చెను. వనవాసులగు పాండవులు ఒకమారు ప్రభాసక్షేత్రమునకు వెడలిరి. వారిని బలహీనులుగా జూచి బలరాముడు దుఃఖపూర్ణములగు మాటలను పలికెను. మేము కౌరవులను జయించి పాండవులకు రాజ్యము నప్పగింతుమని సాత్యకి పలికెను. పాండవులు సహజముగ తమ పరాక్రమముతో రాజ్యమును సంపాదింపగలరు, మేము వారికి సాయపడుదుము అని కృష్ణుడు పలికెను.

యదా తు పాంచాలపతిర్మహాత్మా
స కేకయశ్చేదిపతిర్వయం చ ।
యుధ్యేమ విక్రమ్య రణే సమేతా-
స్తదైవ సర్వం రిపవో హినస్యుః ॥

మహాత్ముడగు పాంచాలరాజు, కేకయుడు, చేదిరాజు, మేము అందరము ఒక్కమారు కలసి యుద్ధమును పరాక్రమమును చూపించినచో మన శత్రువులకు ఉనికి లేకుండగ పోవును.

(1) తమ పురుషార్థమువలన లభించిన వైభవమే శ్రేయస్కరము.
(2) సమయానుసారముగ సంగఠితమై పరాక్రమించినచో తప్పగ కార్యము సిద్ధించును.

పాండవుల అజ్ఞాతవాసము సమాప్తమయ్యెను. విరాటరాజ పుత్రికయగు ఉత్తరతో అభిమన్యుని వివాహమయ్యెను. ఈ వివాహమున పాండవపక్షపాతులగు రాజులందరు ఒకచోట చేరిరి. వివాహానంతరము అందరు సభలో గూడిరి. కృష్ణుడు పలికెను - మోసముతో కౌరవులు పాండవుల రాజ్యము నెట్లు హరించిరో మీకందరకు తెలిసియే యున్నది. న్యాయానుసారముగ పాండవులకు రాజ్యము మరల ఎట్లు లభింపగలదో మీరందరు ఆలోచింపవలసినది.

ద్రుపదుడు, బలరాముడు, సాత్యకి మున్నగు వారు తమతమ ఆలోచనలను వెల్లడించిరి. యుద్ధము తప్పదు. అందువలన రాజులందరికి ఆహ్వానములను పంపవలెనని నిశ్చయించిరి. ద్రుపదునకు బాధ్యతనంతటిని అప్పగించి కృష్ణ బలరామాదులు ద్వారకకు తిరిగి వెళ్ళిరి.

యుద్ధమునకు ఏర్పాట్లు సాగుచుండెను. కృష్ణుని సహాయమును రెండు పక్షములవారు కోరుచుండిరి. అర్జునుడు కృష్ణుని ఆహ్వానించుటకై ద్వారకకు వెళ్ళెను. అప్పుడే దుర్యోధనుడు గూడ అక్కడకు చేరికొనెను. కృష్ణుడు నిద్రించుచుండెను. దుర్యోధనుడు తలవైపు గూర్చుండెను. అర్జునుడు కాళ్ళవైపు కూర్చుండెను. కృష్ణుడు మేలుకొని మొదట అర్జునుని చూచి పిమ్మట దుర్యోధనుని చూచెను. ఇరువురు తమరాకకు కారణములను చెప్పి సాహాయ్యమును అడిగిరి. కృష్ణుడు ఇరువురికి సహాయము చేతునని మాట ఇచ్చెను. ఒకవైపు నేను అస్త్రమును పట్టకయే యుందును. రెండవవైపు నా నారాయణసేన ఉండును అని చెప్పెను. అర్జునుడు కృష్ణుని కోరెను. దుర్యోధనుడు సైన్యము నడిగి సంతోషించి వెళ్ళెను. కృష్ణుడు అర్జునుని - నీవు బలవంతమైన సేనను వదిలి నన్నేల అడిగితి వని ప్రశ్నించెను. అర్జునుడు పలికెను - కృష్ణా ! నీదయవలన నేను

**సంతోషతుల్యం ధనమస్తి నాన్యత్ - సంతోషాన్ని మించిన ధనం లేదు.**

నీమహత్యము నెరుగుదును. అస్త్రమును ధరించి యుద్ధము చేయువారు చాలమంది లభింతురు. నీవు అయినచో మమ్ము అన్నివిధముల నడిపింతువు. మాలో ఉన్న శక్తులన్నియు నీవే. వానిని నీవే చక్కగా నడిపింపగలవు. అందువలన మేము నీకు వానిని అప్పగింపదలచితిమి

**ఉపపన్నమిదం పార్థ యత్ స్పర్థసి మయా సహ ।**
**సారథ్యం తే కరిష్యామి కామః సంపద్యతాం తవ ॥**

కృష్ణభగవానుడు పలికెను - అర్జునా! నీవు నన్ను వెంటతీసికొని శత్రువులపై విజయమునకై పోటీపడుచున్నావు. ఇది నీకు తగినదే. నేను నీకు సారథినై నీ కోరికను నెరవేర్చెదను.

(1) అర్జునుని వంటి బుద్ధిమంతుడు వైభవముకంటె భగవానుడు గొప్పవాడని తెలిసికొని అయననే వరించెను.

(2) తన జీవిత రథసంచాలనమును భగవానునకు అప్పగించుట అదృష్టమునకు, తెలివికి చిహ్నము.

కృష్ణుడు అర్జునునివెంట వచ్చెను. ద్రుపదుని పురోహితుడు సంధిదూతగా హస్తినాపురమునకు వెళ్ళెను. దుర్యోధనుడు ఆయనమాటను లెక్కచేయలేదు. పురోహితుడు తిరిగి వెళ్ళిపోయెను.

L L L

## త్రాగుబోతుకు కనువిప్పు

సర్వమిత్ర మహారాజుకు మద్యం లేకుండా శాంతి లభించేది కాదు. రాజమహలైనా, రాజదర్బారైనా నిస్సంకోచంగా మద్యాన్ని సేవించేవాడు. తనతోపాటు ఇతరులను కూడా త్రాగించేవాడు. అనతి కాలంలోనే రాచకార్యాలు అస్తవ్యస్తంగా తయారైనాయి. అధికారులు ప్రజలను హింసించారు. ప్రజలు కన్నీళ్ళతో విలపించారు. రాజే ఆచరణహీనుడైతే, ప్రజల గోడు వినేదెవ్వరు? ప్రజల దుస్థితిని చూచి ఒక బ్రాహ్మణుడు రాజు వ్యసనాన్ని దూరం చేయాలని సంకల్పించుకొన్నాడు.

ఒకరోజు రాజు సవారి వెళుతూ మార్గ మధ్యంలో గుంపులు, గుంపులుగా మూగిఉన్న జనాన్ని చూచి కారణమేమిటని ప్రశ్నించాడు. ఎవరో మద్యాన్ని అమ్ముతున్నాడని, దానిలో ఏదో విశేషం ఉండి ఉంటుందని, లేకపోతే ఇంత మంది జనం చుట్టూ చేరరని విషయాన్ని విన్నవించేరు. రాజు సవారీ ఆపి, అక్కడకు సమీపంచేసరికి బ్రాహ్మణుని గొంతు వినపడింది. “ఎవరైతే పతనం పరాకాష్టకు చేరుకోవాలని ఆశిస్తున్నారో వారు తక్షణం ఈ మద్యాన్ని సేవించండి. ఇది త్రాగగానే ఒళ్ళు మరిచిపోతారు. మురికి కాలవలో ముఖం కడుగుకొంటారు. పురుగులు ముఖం మీద స్వైర విహారం చేస్తాయి. కుక్కలు మీ ముఖాన్ని భయం లేకుండా నాకుతాయి. దీన్ని తాగిన భర్తలను భార్యలు చితకబాదుతారు. ఐశ్వర్యవంతుడు దరిద్రుడై చిప్ప పట్టుకొని అడుక్కొంటాడు. ఇది త్రాగిన తక్షణం లక్ష్యాలను, కర్తవ్యాలను మరచి యథేచ్ఛగా రోడ్లవెంట తిరుగుతారు. వ్యక్తిలో ఇంతటి పరివర్తనను తీసుకొని రాగల మద్యం కొరకు రండి, త్వరపడండి. ఆలస్యమైతే ఆశాభంగం'' - అంటూ బిగ్గరగా బ్రాహ్మణుడు అరుస్తున్నాడు. రాజు నిశ్చేష్టుడై “ఇన్ని అవగుణాలను ఇంత స్పష్టంగా చెపితే ఎవరు కొంటారయ్యా? నీ దగ్గర వ్యాపారం చేసికొనే లక్షణాలున్నాయా?'' అని రాజు ప్రశ్నించాడు. దానికి బ్రాహ్మణుడు, “రాజా నేను స్పష్టవాది అయిన బ్రాహ్మణుణ్ణి. దీనిలో ఉన్న గుణాలే తప్ప లేని గుణాలని ఎక్కడ చెప్పగలను? ఏది సత్యమో అదే చెపుతున్నా'' అన్నాడు. “ఇలాగైతే నీకు అమ్మకం కాదు.'' - అని హెచ్చరించాడు రాజు. దానికి బ్రాహ్మణుడు నిశ్చింతగా “పతనానికి భయపడే సాధారణ ప్రజలు కొనకపోవచ్చు. కానీ శాసకులు, అధికారులు కొంటారు. ఇది త్రాగటం వలన వారు ప్రజలపై మరిన్ని అత్యాచారాలు చేసి సంపదను గడించుకోవచ్చు'' - అన్నాడు.

ఆ మాటలు రాజును ఆలోచింపచేశాయి. తన రాజ్యపు పూర్తి స్వరూపం అతనికి కళ్ళకు కట్టినట్లు కన్పించింది. బ్రాహ్మణునిలోని దివ్య తేజస్సు అతనిలో పరివర్తనను తీసికొని వచ్చింది. సవారీ దిగి ఆయన పాదాలమీద వ్రాలి, “ఓ మహానుభావా! నీవు నన్ను పతనం నుండి ఉద్ధరించటానికి వచ్చిన దైవానివిగానీ మద్యం అమ్ముకొనే బ్రాహ్మణుడవు గావు. నా కళ్ళు తెరుచుకున్నాయి. నేను ఈ రోజు నుండి ఈ పాపాన్ని తాకను'' అని ప్రతిజ్ఞ చేశాడు. బ్రాహ్మణుడు ఆనందించి “నీకు శుభం కల్గుగాక''యని రాజుని ఆశీర్వదించి, ఆనందంతో రాజ్యం నుండి నిష్క్రమించాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**కష్టే ఫలి - కష్టించేవాడికి ఫలితం లభిస్తుంది.**

## శతసూత్ర కార్యక్రమం: 51-60

# దురాచారాలను నిర్మూలిద్దాం

గత రెండువేల సంవత్సరాల అజ్ఞాన అంధకార యుగంలో ప్రయోజనకరమైన ఎన్నో సదాచారాలు మూఢాచారాలుగా మారి నిరుపయోగకరములుగా తయారైనాయి. మనం ఈ వికృతులను తొలగించాలి. ప్రాచీన వైదిక సనాతన స్థితిని చేరుకోవడానికి మనం ప్రయత్నించాలి. అపుడే మన సమాజం వికాసం పొందుతుంది. వైభవ శిఖరాలను అందుకుంటుంది. ఇందుకై మనం దిగువ కార్యక్రమాలను చేపట్టాలి.

**వర్ణవ్యవస్థ విశుద్ధ స్వరూపం-** బ్రహ్మదేవుడు తన పుత్రులు నలుగురికి నాలుగు కార్యక్రమాలను అప్పగించి వారిని నాలుగు వర్ణములుగా వ్యవస్థీకరించాడు. జ్ఞానం, ధనం, బలం, శ్రమ అనే శక్తులు నాలుగూ మానవ సమాజానికి ఆవశ్యకమైనవి. ఈ అవసరాలు పూర్తి కావాలి. ఇందుకు వంశగతమైన ప్రయత్నం జరుగుతూ ఉండాలి. ఆ ప్రయత్నంలో కుశలత, నిపుణత పెరుగుతూ ఉండాలి. వాటిలో సంస్కరణ జరుగుతూ ఉండాలి. ఇందుకోసమై ఈ పనులు నాలుగింటినీ కుమారులు నలుగురికీ పంచాడు బ్రహ్మదేవుడు. కనుక, వీటిలో ఎక్కువ తక్కువల, ఉచ్చనీచముల ప్రశ్న అసలు లేనేలేదు. ఇందులో ఏ ఒక్కరి గౌరవం, ప్రాముఖ్యం, స్థాయి తక్కువదీ కాదు, హెచ్చుదీ కాదు. బ్రాహ్మణులు అత్యధికంగా త్యాగం చేసేవారు. తపస్సు చేసేవారు. తమ ఆంతరంగిక మహిమను ప్రదర్శించేవారు. కనుక వారికి శ్రేష్ఠత్వం ఉండేది. అయితే ఇతర వర్ణాలను హేయంగా నీచంగా పరిగణించేవారు కారు.

నేటి పరిస్థితి మరోవిధంగా ఉంది. నాలుగు వర్ణాలు లెక్కలేనన్ని కులాలుగా, ఉపకులాలుగా చీలిపోయాయి. ఫలితంగా సమాజంలో భారీఎత్తున అవ్యవస్థ, చీలిక వ్యాపించాయి. ఒక కులం ఎక్కువది అనీ, మరో కులం తక్కువది అనీ భావిస్తున్నారు. ఇది ఎంతవరకు వెళ్లిందంటే ఒకే వర్ణంలోని ఉపకులాలలో ఎక్కువ తక్కువల భావం వ్యాపించింది. మానవీయమైన ఏకత్వాన్ని సూటిగా అవమానించే ధోరణి ఇది. వ్యవస్థలు ఆధారంగా విశేషతలు ఆధారంగా వర్గాలు, కులాలు ఉండవచ్చు. కాని వీటి మధ్య హెచ్చుతగ్గుల భావనకు ఏమాత్రం అవకాశం ఉండకూడదు. ఈ హెచ్చు తగ్గుల భావన సమాజ వికాసానికి తీవ్రమైన ఆటంకం. కనుక, ఈ అజ్ఞానాన్ని ఎంత త్వరగా అంతం చేస్తే అంత మంచిది.

**ఉపకులాలమధ్య విభేదాలు ఎందుకు? -** వర్ణాలు నాలుగూ ఉండవచ్చు. కానీ, ఉపకులాలమధ్య ఉండే తేడాలు భోజనాలకూ, వివాహాలకూ అడ్డు రాకూడదు. ఉపకులాల ప్రాముఖ్యం గోత్రాలవలె బహుకొద్దిగా ఉండాలి. ఒకే వర్ణంవారి మధ్య వివాహాలకు ఎలాంటి అభ్యంతరమూ ఉండకూడదు. ఈ పరిస్థితిని తేవడానికి ప్రయత్నం జరగాలి. బ్రాహ్మణ కులంలో వైదీకులు, నియోగులు అనే శాఖలు ఉన్నాయి. ఈ శాఖలకు ఉపశాఖలు ఉన్నాయి. శాఖాంతర వివాహాలు జరిగితే, తగు వరులనూ వధువులనూ వెదకడం సులు వవుతుంది. ఎన్నో మూఢాచారాలు నశిస్తాయి. వరకట్నంవంటి హత్యలకు దారితీసే దురాచారాలు చూస్తూ ఉండగానే అడుగంటిపోతాయి. ఇందుకోసం సాహసంతో చర్యలు తీసుకోవాలి.

కుల సంఘాలు ఏర్పాటు కావాలి. అవి తమ కులంవారిని ఏకం చేసేందుకు ప్రయత్నించాలి. కుల సంబంధమైన ప్రత్యేకతలు పెంపొందాలి. వేర్పాటు ధోరణులు సమసిపోవాలి. తమ కులంలోని దురాచారాలను నిర్మూలించడానికై ఈ కుల సంఘాలు గట్టి చర్యలు తీసుకోవాలి. సమాజిక సమైక్యతకు ఈ కృషి ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ సభలు పెళ్లికొడుకులు, పెళ్లి కూతుళ్ల సమాచారాన్ని సేకరించి ఉంచాలి. వివాహ సంబంధాలకు తగు సౌకర్యాలు కల్పించాలి.

**స్త్రీ పురుషులమధ్య విచక్షణ -** స్త్రీ పురుషుల మధ్య ఎక్కువ తక్కువల భావన నిందనీయమైనది. పరమేశ్వరుని కుడి ఎడమ అవయవాల మాదిరిగా స్త్రీ పురుషుల నిర్మాణం జరిగింది. స్త్రీ పురుషులు ఇద్దరి స్థాయి ఒక్కటే. ఇద్దరి అధికారం ఒకటే. కనుక సాంఘిక న్యాయం, పౌరహక్కులు ఇద్దరికీ సమానంగా ఉండాలి. ప్రాచీన కాలంలో ఇలాగే ఉండేది. ఆనాడు పురుషునితో సమానంగా స్త్రీ విదుషిగా ఉండేది. వికాసం పొంది ఉండేది. కొత్త తరాల శ్రేష్ఠతను నిలిపి ఉంచడంలో, సామాజిక స్థాయిని ఉత్కృష్టంగా నిలిపి ఉంచడంలో స్త్రీకి పురుషునితో సమానంగా బాధ్యత ఉండేది.

నేడు మహిళ స్థితి అమానవీయంగా, అన్యాయంగా ఉంది. పశువులపైన వలె ఆమెపైన ఆంక్షలు విధిస్తున్నారు. ఆమెకు పౌర హక్కులు అందడం లేదు. ఇదంతా భారతీయ ధర్మంలోని ఔదార్యానికీ, గొప్పతనానికీ, శ్రేష్ఠతకూ మాయని మచ్చ. పురుషునికి ఒక న్యాయం, స్త్రీకి మరొక న్యాయం ఉండడం అనుచితం. దాంపత్య జీవితంలో సదాచారం ఇద్దరినీ సమానంగా అదుపు చేయాలి.

మగపిల్లవాడికీ, ఆడపిల్లకూమధ్య అమలు జరుగుతూన్న విచక్షణ అంతం కావాలి. ప్రేమానురాగాలు, గౌరవం ఇద్దరికీ సమానంగా అందాలి. గడిచిన రోజులలో మహిళపట్ల జరిగిన అన్యాయానికి ఇప్పుడు మనం ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఇందుకై - ఆమెకు విద్య గరపడానికీ, ఆమెను తన కాళ్లపై తాను నిలబడేలా

**సౌహృదా జ్ఞాయతే మిత్రమ్ - సహృదయంవల్ల మిత్రుడు లభిస్తాడు.**

స్వావలంబిగా చేయడానికి చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగం వెనుకబడిన వర్గాలకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. ఆ వర్గాలవారు వెనుకబడినతనం నుండి త్వరితగతిని బయటపడడానికి ఆ సౌకర్యాలు ఉపయోగపడుతున్నాయి. విద్య, స్వావలంబనలలో మహిళలకు అలాంటి సౌకర్యాలు ఇవ్వాలి. తద్వారా వారి వెనుకబడినతనం త్వరగా తొలగిపోతుంది. ఇలా సాంఘిక న్యాయ సూత్రాలను మహిళలకు అన్వయించాలి.

**అశ్లీలతకు ప్రతిఘటన** - అశ్లీల సాహిత్యం, మనో వికారాలను కలిగించే అర్ధనగ్న యువతుల చిత్రాలు, చౌకబారు నవలలు, కాముకత్వం నిండిన సినిమాలు, అసభ్యమైన పాటలు, వేశ్యా వృత్తి, విశృంఖమైన కామక్రియలు, మహిళలలోని శీలాన్నీ, సంకోచాన్నీ, సిగ్గునూ దెబ్బతీయడం, దురాచారాలపై అసభ్యమైన చర్చవంటి చెడు విషయాలు అశ్లీలత క్రిందికి వస్తాయి. ఈ అశ్లీలత దాంపత్య జీవితంపై చెడు ప్రభావం చూపుతుంది. ఈ అశ్లీలతవల్ల శరీరమూ, మెదడూ డొల్ల అవుతాయి. శారీరకమైన వ్యభిచారంవలెనే, మానసిక వ్యభిచారంకూడ మానసిక సంతులనాన్నీ, శీల సంతులనాన్నీ దెబ్బతీస్తుంది. దీన్ని నిరోధించాలి. పసి మనసులలో వికారాలను సృష్టించే చిత్రాలు, క్యాలెండర్లు, పుస్తకాలు, బొమ్మలు, ఇతర సాధనాలు మన ఇళ్లల్లో ఉండకూడదు.

**వివాహాలలో దుబారా ఖర్చు** - ప్రపంచంలోని అన్ని దేశాలవారు, అన్ని మతాలవారు పెళ్లిళ్లు చేసుకుంటారు. కానీ, మనం పెళ్లిళ్లలో చేసే దుబారా ఖర్చు మరెవరూ చేయరు. ఇందువల్ల కుటుంబాల బడ్జెట్లు తలక్రిందులు అవుతున్నాయి. ఇలా దుబారా ఖర్చు చేయడానికి అవసరమయ్యే డబ్బు న్యాయంగా సంపాదించడం కుదరకపోతే, దాన్ని అన్యాయంగా సంపాదించవలసివస్తోంది. ఈ ఖర్చులకోసం డబ్బు పోగుచేసే ప్రయత్నంలో కుటుంబ ప్రగతి కుంటుపడుతుంది. అహంకారం పెరిగిపోతుంది. ఆడపిల్లలు తల్లి దండ్రులకు భారంగా తయారవుతారు. పెళ్లిళ్లలో ఆడంబరపు ఖర్చు అన్నివిధాలా నష్టదాయకం.

ఇక వరకట్న దురాచారం అనుచితమేకాక నీతిబాహ్యం కూడా. వర విక్రయపు వికృత ప్రదర్శన ఇది. ఈ దురాచారం కారణంగా, ఎందరో యువతులు నరకయాతనలు అనుభవిస్తున్నారు. ఎందరో తల్లి దండ్రులు కష్టాల కడలిలో మునిగిపోతున్నారు. హంతకురాలైన ఈ దురాచారాన్ని ఎంత త్వరగా నిర్మూలించగలిగితే అంత మంచిది.

ఈ దశలో ప్రజలకు నాయకత్వం వహించడానికి ధైర్యంగా ముందుకురావడం ఆలోచనాపరులందరికీ పరమ కర్తవ్యం అవుతోంది. ఈ దురాచారాలకు నీళ్లు వదిలి, అత్యంత నిరాడంబరంగా వివాహాలు జరిపి, ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. మనసులో ఈ దురాచారాలపట్ల విముఖత ఉన్నప్పటికీ దానిని ఆచరణలో పెట్టడానికి చాలామంది సాహసించరు. సంప్రదాయాలకు లొంగిపోయి, ఇతరులు గేలి చేస్తారని భయపడి - వీరు ముందుకు రారు. వ్యక్తులు తమ ఉదాహరణ ద్వారానే ఇలాంటి వారికి మార్గదర్శనం చేయగలుగుతారు. యుగ నిర్మాణ పరివార్‌లోని పరిజనులు తమ భావాలకు అనుగుణంగా ఉండే వరులను - వధువులను, కుటుంబాలను ఎంపిక చేసుకోవాలి. సాదాగా ఆదర్శ వివాహాలు జరిపించాలి. ఇందువల్ల హిందూ సమాజం ఎదుర్కొంటున్న ఒక జటిల సమస్య పరిష్కారం అవుతుంది.

**బాల్య వివాహాలవల్ల అనర్థాలు** - బాల్య వివాహాలను తీవ్రంగా ఖండించాలి. వాటివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి. ఆరోగ్యం, మానసిక సంతులనం, భావితరం, జీవన వికాసం వంటి ప్రతి రంగం పైన దీని దుష్ట ప్రభావం ప్రసరిస్తుంది. గృహస్థ జీవన బాధ్యతలను తమ భుజాలపై వేసుకుని నిర్వహించే సామర్థ్యం సంపాదించేవరకు ఆడపిల్లలూ, మగపిల్లలూ పెళ్లి చేసుకోకూడదు. వారికి పెళ్లి చేయకూడదు. ఈ విషయంలో తొందరపడడం మన పిల్లలకు ఘోరమైన అన్యాయం చేయడమే. చదువుకోనివారిలో, క్రింది స్థాయికి చెందినవారిలో ఇప్పటికీ బాల్య వివాహాలు విరివిగా జరుగుతున్నాయి. వారికి నచ్చచెప్పడం ద్వారా, చట్టం చూపి వారిని భయపెట్టడంద్వారా ఈ దురాచారాన్ని నిర్మూలించాలి.

వధూ వరుల వయస్సులలో బాగా తేడా ఉన్న పెళ్లిళ్లను కూడా నిరుత్సాహపరచాలి. అలాంటి పెళ్లిళ్లకు విరుద్ధంగా వాతావరణాన్ని నిర్మించాలి.

**భిక్షుక వృత్తి నిందనీయం** - బిచ్చమెత్తడం వ్యక్తి ఆత్మగౌరవానికి విరుద్ధమైన పని. ఆత్మగౌరవాన్ని కోల్పోయిన వ్యక్తి పతన మవుతాడు. మన దేశంలో ఈ భిక్షుక వృత్తి విపరీతంగా పెరిగిపోవడం విచారకరం. అందువల్ల ఎందరెందరో వ్యక్తుల మానసిక స్థాయి దిగజారిపోవడం దురదృష్టకరం.

సమాజంలో వికలాంగులు ఉంటారు. అసమర్థులు ఉంటారు. నా అనేవాళ్లు ఎవరూ లేనివాళ్లు ఉంటారు. ఇలాంటి వ్యక్తులకు ప్రభుత్వం బ్రతుకుదెరువు చూపాలి. లేదా సమాజమే ఆ ఏర్పాటు చేయాలి. అందువల్ల వీరికి మాటిమాటికీ ఇతరులముందు చేయిచాపవలసిన అవసరం తప్పుతుంది. వీరు ఆత్మగౌరవాన్ని కోల్పోవలసిన పరిస్థితి తొలగిపోతుంది. వీరు సమాజంలో పనికివచ్చే ఏదో ఒక పని చేయగలుగుతారు. వివిధ స్థలాలలో వికలాంగుల సంస్థలను స్థాపించాలి. వాటిద్వారా నిజంగా దుఃఖ దైన్యాలలో మునిగి ఉన్నవారికి సహాయం అందించాలి.

ఏవేవో సాకులు చెప్పి అడుక్కునేవారికి బిచ్చం పెట్టకూడదు. అందువల్ల సోమరితనం పెరుగుతుంది. ప్రజలపై అనవసరమైన బరువు పడుతుంది. ఆడంబరపరులు దుర్గుణాలలో మునిగి ప్రజలను రక రకాలుగా దోచుకుంటున్నారు. భజనలు

**సత్యాన్నాస్తి పరం పదమ్ - సత్యాన్ని మించింది లేదు.**

చేయించేవారు కూడ తమ బ్రతుకు దెరువు తామే చూచుకుంటూ, మిగతా సమయాలలో భజనలు చేయించాలి.

**శ్రాద్ధ భోజనాలు నిరర్థకాలు -** ఒక ఇంటిలో ఎవరైనా చనిపోతే, ఆ తర్వాత రెండు వారాల వరకు వివాహభోజనాల వలె విందులు జరపడం ఆ చనిపోయిన వ్యక్తిని అవమానించడమే. విందులు సంతోష సమయాలలో జరుపుకునేవి కదా. మరణాన్ని దుఃఖ చిహ్నంగా పరిగణిస్తారు. అటువంటప్పుడు శ్రాద్ధ భోజనాలు ఏర్పాటు చేయడం ఎందుకు? మృతుని మిత్రులూ, బంధువులూ కష్టాలలో ఉన్న అతడి కుటుంబానికి సహాయం చేయలేకపోయినా, కనీసం విందు ఏర్పాటు చేయమని సలహా ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా క్రుంగదీయకూడదు. మృతుని ఆత్మకు శాంతి లభించడం కోసం మతపరమైన కర్మకాండ జరపవలసిందే. సానుభూతి ప్రదర్శించడానికి దూరంనుంచి వచ్చిన వ్యక్తులు శ్రాద్ధం సందర్భంగా ఆ కుటుంబంవారితో కలసి భోజనం చేయవచ్చు. అంతవరకు పరవాలేదు. కానీ, భారీయెత్తున శ్రాద్ధ భోజనాలు ఏర్పాటు చేయడం అన్ని విధాలా అనుచితం. వాటివల్ల ఉపయోగమూ లేదు. వాటి అవసరమూ లేదు. అలాంటి సందర్భాలలో మానవసేవ కోసం ఎంత పెద్ద మొత్తమైనా దానం చేయవచ్చు. అదే శ్రద్ధకు నిజమైన చిహ్నం. కనుక అదే నిజమైన శ్రాద్ధం.

**నగలపై ఖర్చు చేయడం దండగ -** నగలపై ఖర్చు చేయడం ప్రత్యక్షంగా డబ్బును దుర్వినియోగం చేయడమే. డబ్బును ఏదైనా పనికి మదుపు పెట్టితే ఆదాయం వస్తుంది. వడ్డీకి ఇస్తే డబ్బు పెరుగుతుంది. డబ్బును నగలలో ఖైదు చేస్తే అది తరిగిపోతుంది. నిష్ప్రయోజనంగా పడి ఉంటుంది. నగలు విరిగిపోవడంవల్ల నష్టం వస్తుంది. నగలు చేయించడానికి డబ్బు ఖర్చవుతుంది. నగలు అరిగిపోవడంవల్ల నష్టం వస్తుంది. ధరించేవారి అహంకారాన్ని పెంచుతాయి నగలు. ఇతరులలో అసూయను రగిలిస్తాయి. దొంగలకు అవకాశం కల్పిస్తాయి. నగలవల్ల ఆయా అవయవాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఆయా అవయవాల అపరిశుభ్రత పెరుగుతుంది. ఫలితంగా ఆరోగ్యం దెబ్బతింటుంది. చర్మం మొద్దుబారుతుంది. స్వేద రంధ్రాలు మూసుకుపోతాయి. ముక్కుకు నగ ధరించడంవల్ల దానిని శుభ్రపరచడంలో ఇబ్బంది కలుగుతుంది. పెళ్లిళ్ల సందర్భాలలో నగలు ఒక సమస్యగా తయారవుతాయి. వరకట్న దురాచారానికి మూలం నగలలో ఉంది. ఆడపిల్ల తరఫువాళ్లు నగలు కోరుకున్నంతవరకూ మగపిల్లవాడి తరఫువాళ్లు కట్నం అడుగుతూనే ఉంటారు. ఇలా నగల మోజు అన్నివిధాలా హానికరం. దాన్ని వదులుకోవడం మంచిది.

**దెయ్యాలు, జంతు బలి -** దెయ్యాల గురించి భ్రమలు కల్పించి, భూతవైద్యులు అమాయక ప్రజలను మానసికంగా, ఆర్థికంగా నిలువు దోపిడీ చేస్తున్నారు. మానసిక రోగాలనూ, శరీరానికి వచ్చే కష్టాలనూ, రోజువారీ జీవితంలో జరిగే మామూలు విషయాలనూ దయ్యాల పనులుగా చెప్పి, వీరు జనాన్ని వంచిస్తున్నారు. ఈ భ్రమలవల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకోసారి వారి ప్రాణాలకుసైతం ముప్పు వస్తోంది.

మత గ్రంథాలు వర్ణించిన దేవతల సంఖ్య చాలా పెద్దది. ఇవి చాలవన్నట్లు ప్రతి కులానికీ, ప్రతి వంశానికీ, ప్రతి గ్రామానికీ మరెందరో దేవతలు వెలిశారు. ఈ దేవతలకు కోళ్లు, గ్రుడ్లు, దున్నపోతులు, మేకలు, పందులు బలి ఇస్తున్నారు. దయా స్వరూపులు, ప్రేమ స్వరూపులూ అయిన దేవతలచేత పశువుల, పక్షుల రక్తాన్ని త్రాగించడం వింతల్లో వింత. మనం ఒకే పరమాత్మను ఉపాసన చేయాలి. ఈ దయ్యాలు భూతాల భ్రమలో ఎట్టి పరిస్థితిలోనూ చిక్కుకోకూడదు. ప్రజలనుకూడ ఈ భ్రమనుండి రక్షించాలి.

మన సమాజంలో ఎన్నెన్నో దురాచారాలు వివిధ రూపాలలో కానవస్తున్నాయి. హాని కలిగించేవీ, నీతికి విరుద్ధములూ అయిన ఈ దురాచారాలను నిర్మూలించడం అన్ని విధాలా శ్రేయస్కరం. సభ్య సమాజం వివేకశీలంగాకూడ ఉండాలి. మనల్ని పరిహాసానికి గురిచేసే ఈ దురాచారాల నుండి మనం త్వరగా బయటపడాలి.

U U U

## ఆ నేరం మీది

న్యూయార్క్ మేయర్ లగాడియా న్యాయశీలుడుగాను, సద్భావసంపన్నుడుగాను ఖ్యాతి చెందాడు. ఒకసారి అతని న్యాయస్థానంలో రొట్టెలు దొంగలించిన నేరానికి ఒక దొంగను ముద్దాయిగా ప్రవేశపెట్టారు. తట్టుకోలేని ఆకలిబాధ అతడిని నేరస్థుడి స్థితికి దిగజార్చింది. చట్టానికి గౌరవమిచ్చి లగాడియా ముద్దాయికి 10 డాలర్లు జరిమానా విధించాడు. అతనితోపాటు కోర్టులో ఉన్న సభ్యులందరి వద్దనుండి 50 సెంట్లు చొప్పున జరిమానా వసూలు చేశాడు. కారణమేమిటని ప్రశ్నించగా "పేదరికం కారణంగా రొట్టెలు దొంగలించ వలసి వచ్చిన పరిస్థితులు నెలకొన్న సమాజంలో మీరుకుడా సభ్యులు కావటం వలన దీనికి మీరందరూ బాధ్యులే"నని ఆయన తెలియచేశాడు. ఆ విధంగా వసూలు చేసిన డబ్బుతోనే ఆయన నేరస్థుని విడుదలచేసి మిగిలిన సొమ్ముతో అతనికి ఉపాధిని ఏర్పాటు చేశాడు. - ప్రజ్ఞాపురాణం నుండి

**నాస్తి క్రోధ సమో వహ్ని - కోపాన్ని మించిన నిప్పు లేదు.**

# యుగ గీత

## జీవన్ముక్తికి రాచబాట

(Q®Ç←OZH Ç~¡"Eò)

భగవద్గీత నాల్గవ అధ్యాయంలోని 32వ శ్లోకం ఇది -

**ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజ్ఞాన్ విద్ధితాన్ సర్వాన్, ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥**


అనగా -

*బ్రహ్మదేవుని ముఖంలో, అనగా వేద వాణిలో, ఇలాంటి పలువిధములైన యజ్ఞముల వర్ణన ఉన్నది. ఇవన్నీ కర్మనుండి ఉత్పన్నం అయినవి. అనగా మనస్సూ, ఇంద్రియాలూ, శరీరమూ చేసే క్రియలద్వారా ఉత్పన్నం అయినవి. ఇది తెలుసుకో. అయితే, పరమాత్మ కర్మాదులకు అతీతుడనికూడ తెలుసుకో. అలా తెలుసుకుంటే నీవు సంసార బంధనం నుండి విముక్తి పొందుతావు.*

31వ శ్లోకానికి చరమసీను ఈ 32వ శ్లోకంలో మనకు లభిస్తుంది. పైన పేర్కొన్న యజ్ఞములన్నీ బ్రహ్మదేవుని ముఖంనుండి ప్రవహించాయని విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుడు చెపుతున్నాడు. అనగా - హవ్యాలు అన్నింటినీ గ్రహించే అగ్ని ముఖంనుండి ప్రవహించాయి. సర్వవ్యాపి అయిన బ్రహ్మదేవుడే ఎల్లప్పుడూ యజ్ఞాలలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. ప్రపంచంలోని అన్ని విధములైన కర్మలూ పరమపిత పరమాత్మకు అర్పించబడి, యజ్ఞములు అవుతాయి. మనం భోజనం చేస్తున్నాం. బ్రహ్మదేవునికి ఆహుతి ఇస్తున్నామనే భావనతో భోజనం చేయాలి. జగజ్జనని మహాకాళికి భోజనం పెడుతున్నామనే భావనతో భోజనం చేయాలి. మనం త్రోవలో నడుస్తూన్నప్పుడు జగన్మాతకు ప్రదక్షిణం చేస్తున్నామనే భావనతో ఆ పని చేయాలి. శరీరంతో, వాక్కుతో, మనస్సుతో కర్మను ప్రభువును ప్రసన్నం చేసుకోవడానికి జరిపినప్పుడు, పరమేశ్వరునికి అర్పణ చేస్తున్నామనే భావనతో జరిపినప్పుడు - ఆ కర్మలన్నీ యజ్ఞాలుగా పరిణతి చెందుతాయి. అలాంటి యజ్ఞముల ఫలితంగా, మొదట చిత్తశుద్ధి లభిస్తుంది. ఆతర్వాత జీవన్ముక్తి లభిస్తుంది. ఇదే ఈ శ్లోకంలోని భావం.

స్వామి వివేకానంద ఈ విషయం గురించి విస్తృతంగా చెప్పి ఉన్నారు. స్వామీజీ మాటలలో - గీతలోని కర్మయోగం వైజ్ఞానిక ప్రణాళిక ప్రకారం చేయబడే ఒక కర్మానుష్ఠానం. కర్మ ఉద్దేశ్యం - మనస్సు లోపల అంతర్నిహితంగా ఉన్న శక్తిని బాహ్యంగా వ్యక్తం చేయడం. అనగా - జీవాత్మను మేలుకొలపడం. నీవు ఏమి చేసినా, ఏమి తిన్నా, ఏది హవనం చేసినా, ఏది తపస్సు చేసినా - వాటిని అన్నింటినీ నాకు, అనగా భగవానునికి అర్పణచేసి, ప్రశాంతంగా స్థిరంగా ఉండాలి.

స్వామీజీ వెలిబుచ్చిన ఈ భావాన్ని శ్రీకృష్ణుడు తన శిష్యుడైన అర్జునునికి బోధించాడు. అతడికి ముక్తి మార్గం చూపాడు. ఆయన ఇలా చెపుతున్నారు - అన్ని సాధనలనూ, యజ్ఞాలనూ కర్మ నుండి జనించినవిగా పరిగణించు. ఇవన్నీ ఒకే భగవానుని విశాలమైన శక్తి నుండి జనించాయనీ, దాని ద్వారా నిర్దేశించబడ్డాయని కూడా తెలుసుకో. ఆ భగవత్ తత్వాన్ని తాత్వికంగా తెలుసుకుని, పూర్తిగా అర్థం చేసుకుని, తనను తాను సమర్పించుకుని, యజ్ఞ భావనతో ప్రతి కర్మను చేయాలి. అపుడు ముక్తి లభిస్తుంది. లోభం, మోహం, అహంకారం అనే భవ బంధనాల నుండి శాశ్వతంగా జీవన్ముక్తి లభిస్తుంది. **(ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే)**



గీతాకారుని కావ్యంలోని సౌందర్యం దాని శబ్దాల కూర్పులోకన్నా దాని భావాలు నిరంతరం ఉన్నత, ఉన్నతోన్నత సోపానాలపై క్రమ పద్ధతిలో విహరించడంలో మరింతగా కానవస్తుంది. మనం కర్మలు ఎందుకు చేయాలి? ఎవరి కోసం చేయాలి? యజ్ఞభావంతో చేసే కర్మ ఏది? జీవితాన్ని బంధనాల నుండి విముక్తి చేసి, ముక్తిపథంలో ఎలా పయనింపజేయాలి? ఈ రహస్యాలు తెలుసుకుంటే మనం జీవన దర్శనాన్ని అవగాహన చేసుకుంటాము. 33వ శ్లోకంలో భగవానుడు ఈ విషయాన్ని మరింతగా వివరిస్తున్నాడు. ద్రవ్య యజ్ఞం అన్నిటి కన్న దిగువ మెట్టు అనీ, జ్ఞాన యజ్ఞం అన్నిటి కన్న ఎగువ మెట్టు అనీ చెపుతున్నాడు.

Ð(Ç~¡"Eò-KÓ←OZH..Õ)

**నాస్తి కామ సమో వ్యాధిః - కామాన్ని మించిన వ్యాధి లేదు.**

# వసంత పంచమి సంకల్పం

# 2004, 2005 లకు 14 కార్యక్రమాలు

**2004 జనవరి 26 వసంత పంచమి సందర్భంగా 2004, 2005 సంవత్సరాలలో 14 కార్యక్రమాల నిర్వహణకు సంకల్పం జరిగింది. ఆ కార్యక్రమాల వివరాలు అందించే వ్యాసం ఇది.**

సత్ప్రేరణలను కలుగచేసే పర్వం వసంతపర్వం. ఆ సమయంలో దివ్యలోకం నుండి విశిష్ట ఆత్మలపై అమృతదానాలు వర్షిస్తాయి. ఇది వారి జీవనానికి ప్రాణవంతమైన సమయం. యుగనిర్మాణ మిషన్ ప్రాదుర్భావం వసంత పర్వం నుండే జరిగిందని తెలుసుకోవాలి.

యుగపరివర్తనకు ఈ సమయం విశిష్టమైందని ప్రథమ అరుణోదయ కిరణం ఉద్బోధిస్తోంది. ప్రస్తుత విశేష పరిస్థితుల నెదుర్కోగల సమర్థవంతులైన విశేషవ్యక్తుల అవసరం ఎంతైనా ఉంది. అటువంటి సమర్థులైన వ్యక్తులే యుగపురుషులు. వారిని భగవంతుని అనుచరులుగా, దేవదూతలుగా అభివర్ణిస్తారు. మనలో ప్రతి ఒక్కరూ ఈవిశిష్ట ఆత్మలతో సంబంధం కలిగిన వారమేనని గుర్తించాలి. మన నిర్ధారిత కర్తవ్యాన్ని నెరవేర్చడానికి జాగరూకులమై ఉండాలి.

రెండవ ప్రకాశ కిరణాన్ని మన అంతరంగంలో ధారణచేసి మనం విశిష్ట సమయాల్లో విశిష్ట ప్రయోజనం కోసం పంపబడ్డామన్న భావనను కల్గించుకోవాలి. మన ఈ జన్మను ఈ ప్రయోజనం కొరకే వినియోగించాలి. యుగపరివర్తన జరిగే ఈ పుణ్యసమయంలో జాగృత ఆత్మలు దేవదూతలుగా పంపబడతారు. మనందరము వీరి రూపమేనని భావించుకొని, కేవలం తిండికోసమే జీవితమన్నట్లుగాకాక నవనిర్మాణ బాధ్యతను మనభుజ స్కంధాలపై వేసుకోవాలి.

దైవంతో భాగస్వామ్యం చేసుకోవలసిన సమయు మాసన్నమైందని ఆ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ మూడవ ప్రకాశకిరణ ప్రవేశం కోసం అంతఃకరణ ద్వారాన్ని తెరిచి ఉంచాలి. వసంత పర్వదినాన్ని భగవంతునితో భాగస్వామ్యానికి ప్రత్యేకమైన ఆహ్వానంగా భావించాలి. సామాన్య మానవులకు అసమాన్యమైన బాంధవ్యం ఎప్పుడూ సౌభాగ్య చిహ్నమే. దైవీతత్వాలతో సంబంధ మేర్పరుచుకొని సామాన్యమానవులు కూడా మహాత్మ, దేవాత్మ, పరమాత్మల స్థాయిని అందుకోగలిగారు. దేవ సముదాయాలతో సంబంధం ఏర్పరచుకున్నందుకే సిద్ధపురుషులు, మహాత్ములు దైవంతో సమానంగా లెక్కింపబడుతున్నారు. యాచించినందువల్ల, ప్రార్థనవల్ల ఎక్కువ ప్రయోజన ముండదు. ఉన్నతమైన దానాలకోసం యాచన కాదు, పాత్రత కావాలి. ఈశ్వరునితో భాగస్వామ్యంకోసం సాహసించడమే విజ్ఞులు చేయవలసిన పని.

మంచిది. ఈ వసంత పర్వదినంలో భగవంతునితో భాగస్వామ్యానికే సాహసం చేద్దాం. ఇందుకోసం కొన్ని క్రొత్త వాస్తవాలను స్వీకరించాలి. సర్వవ్యాపి ఐన భగవంతుని ప్రతినిధి మనలో ఆత్మరూపంలో ఉన్నాడని గ్రహించాలి. నేను, నేను - అని ఎప్పుడూ అరిచే మేక మన శరీరం. శరీరగతమైన అహం మొదటి నుండి చివరిదాకా వ్యక్తిత్వాన్ని ఆవరించిఉంది. అదే జీవితమంతా తన అధికారాన్ని చెలాయిస్తున్నది. చింతన క్షేత్రంలో లోభం, మోహం, వాసన, తృష్ణల రూపంలో నూటికి నూరుపాళ్ళు తన ఆధిపత్యాన్ని చెలాయిస్తూవస్తోంది. శరీరానికి కావలసిన సదుపాయాలు తప్ప వేరే ఆలోచించలేని నిస్సహాయతయే మాయ. ఈపాశంలో చిక్కుకుని దౌర్భాగ్యగ్రస్తులైన ఖైదీల్లాగ ప్రాణులు కష్టాల ననుభవిస్తున్నారు. ఈ బంధనాల్ని పూర్తిగా త్రెంచుకునే పరాక్రమవంతుడే జీవన్ముక్తుడు, పరమ పురుషార్థి.

ఆత్మ అస్తిత్వాన్నీ, ఆవశ్యకతనూ, లాభాన్నీ స్వీకరించడమే భాగస్వామ్యం కొరకు మొదటినుండీ చేయవలసినపని. సమయం, శ్రమ, మనోయోగం, ప్రతిభ, సాధన - ఈ ఐదూ జీవితంలో లభించేవి. ఈ లాభాన్ని శరీరానికెంత, ఆత్మకొరకెంత అని బేరీజు వేసుకొని ఆనిష్పత్తిని నిర్ధారించాలి. పరమాత్మ ప్రతినిధి ఐన ఆత్మకు చెందవలసిన లాభాన్ని పెంచే ప్రయత్నం చేయాలి. ఇదే భక్తిభావన, ఈశ్వరపరాయణత స్వరూపం. 8 గంటలు బ్రతుకుదెరువుకు, 7 గంటలు నిద్రకు, ఐదు గంటలు ఇతర కార్యాలకు మొత్తం 20 గంటలు పోయినా - మిగిలిన 4 గంటలూ ఆత్మకళ్యాణం కొరకు కేటాయించాలి. ఈ నిష్పత్తిలో శ్రమ, మనోయోగము, ప్రభావం, ప్రతిభల విభజన జరగాలి.

ఆత్మనూ, పరమాత్మనూ ఒకే ఇంటి సదస్యులుగా గుర్తించాలి. మన కుటుంబం కొరకు ఎంత ఖర్చు చేస్తామో, అంతే మొత్తాన్ని పరమార్థంకోసం, ఆత్మకల్యాణం కోసం కేటాయించాలి. యుగ సాధనకు జ్ఞానయజ్ఞం మిక్కిలి ప్రముఖమైంది. నేడు మహాకాలుని పిలుపు కూడా జ్ఞాన యజ్ఞమే. ఇందులో ఆత్మకళ్యాణం, లోకకళ్యాణం కలసిఉన్నాయి. ఆత్మోత్కర్ష సాధనాలైన సాధన, స్వాధ్యాయం, సంయమం, సేవ - ఈ నాలుగూ ఆత్మనిర్మాణానికీ, సమాజ నిర్మాణానికీ కూడా ఉపయుక్తమైనవి.

**అనుభవించే కొలదీ పెరుగుతాయి కోరికలు.**

యుగ నిర్మాణ పరివారంలోని ప్రతి సదస్యుడూ కొన్ని షరతులను పాటించాలి. సమయదానం, అంశదానంలను తమ తమ సంపర్క క్షేత్రాలలో సద్ జ్ఞానాన్ని విస్తరింప చేయడానికి వినియోగించాలి. వీటివలన చాలా లాభా లున్నాయి. మిషన్ సంచాలకులు ఈనియమం ద్వారానే లాభాన్వితులైనారు. వారినుండి ప్రేరణను పొంది సాధనలోని సముచిత లాభాన్ని పొందగోరువారు సాహసంతో వారి ననుసరించాలి. వసంత పర్వమనేది ఈశ్వరునితో భాగస్వామిగా లాభాన్ని పొందాలన్న సందేశాన్ని, ఆజ్ఞను తీసుకొని మనముందుకు వచ్చింది. దీన్ని స్వీకరించడమే వివేకం.

ఈ విశిష్ట వసంత పర్వమందున ఎవరికైతే అంతరంగ ప్రకాశం లభ్యమైందో, వారు తమ విధులలో కొద్ది మార్పు చేయాలి. మహాకాలుని ప్రేరణలో 2005 సంవత్సరం వరకు 14 కార్యక్రమాలు ఇవ్వబడ్డాయి. 2005 సంవత్సరం ప్రజ్ఞాసంస్థాన స్థాపన రజత జయంతి. ఈ రజత జయంతి సందర్భంగా గాయత్రీ పరివార్ అన్ని శాఖలనూ, శక్తిపీఠాలనూ, ప్రజ్ఞా పీఠాలనూ ఈ కార్యక్రమాలన్నీ చేయడానికీ, జాగృత తీర్థాలుగా, జన జాగరణ చేసే కేంద్రాలుగా వాటిని వికసింప చేయడానికి కోట్ల సంఖ్యలో జనాన్ని సమీకరించి మహాకాలునితో కలసి నడవడానికి వ్యక్తిత్వంగల ప్రాణవంతులైన కార్యకర్తలను తయారు చేయాలన్నదే మా విజ్ఞాపన.

## 14 కార్యక్రమాలు

1. మంత్రలేఖన ఉద్యమంతో శక్తి సమీకరణ.
2. భావవిప్లవం కొరకు దీపయజ్ఞాల నిర్వహణ.
3. విధిగా అంశదాన, సమయదానాలు.
4. పత్రికల విస్తరణ.
5. జ్ఞాన యజ్ఞ ప్రచారం.
6. ప్రజ్ఞాపురాణ కథల ద్వారా జనజాగరణ.
7. వానప్రస్థ పరంపరను దృఢతరం చేయడం.
8. ఉత్తర ప్రత్యుత్తర కార్యక్రమ విస్తరణ.
9. విద్యా విస్తరణ కేంద్రాల పునర్నిర్మాణం.
10. గాయత్రీ జ్ఞాన మందిరాల స్థాపన.
11. మహిళా సంఘటన.
12. యువమండలుల ఏర్పాటు.
13. యుగ సేన సమీకరణ.
14. జ్ఞాన యజ్ఞాల విస్తరణ.

**(1) మంత్రలేఖన ఉద్యమం** : యుగ పరివర్తన నిశ్చయం. ఈ పరివర్తన ఆధ్యాత్మికత వలన, సాధనాశక్తి వలన జరుగుతుంది. సాధన మిషన్‌కు ప్రాణం. సాధన ద్వారా శక్తిని సమీకరించుకోవడమే శక్తి సంఘటనా సంవత్సర ముఖ్యఉద్దేశ్యం. ఇవి భూమండలానికి అదృష్ట ఘడియలు. ఈ సదవకాశం నుండి ఎవరూ వంచితులు కారాదు. ఒక శ్రేష్ఠసాధకునిగా తన సంఘటనా సామర్థ్యాన్ని పెంపొందించుకొని, అత్యధిక సంఖ్యలో వ్యక్తులను మంత్రలేఖనంతో జోడించడం నేటి యుగధర్మం. జీవన సాధన ద్వారా ఆత్మశక్తిని పెంపొందించుకుంటూ అధిక సంఖ్యలో పరిజనులను ఈ సురక్షాకవచం క్రిందికి తేవాలి. మంత్రలేఖన ఉద్యమం, గాయత్రీ మంత్రసాధనానుష్ఠానం, చాలీసా పారాయణముల ద్వారా విశ్వశాంతి కోసం సాధకులుగా రూపొందాలి. సంఘటనకర్త, యుగసృజేత, యుగసేనానాయక్, పరివ్రాజక్, సమయదానివంటి బాధ్యతలను స్వీకరించి వారు భారతదేశంలోని 7 లక్షల గ్రామాలనూ తమ సహచరుల ద్వారా గాయత్రీ సాధనామయం చేయాలి. దేశమంతటా ప్రథమచరణంగా వేయి శక్తిపీఠాల్లో 24వేల మంది సాధకుల ద్వారా 24 వందల గాయత్రీ మంత్రలేఖన పుస్తకాలను వ్రాయించి స్థాపించడం ఈ సంవత్సర సంకల్పం.

గురుదేవులిలా వ్రాశారు – "గాయత్రీ ఉపాసకుల స్వహస్తలిఖిత గాయత్రీ మంత్రాన్ని ఒకే చోట స్థాపిస్తే, ఉపాసకుల భావన, తపస్సు, శ్రమ, సాధన, శ్రద్ధ, ఆత్మశక్తి ఒకే చోట కేంద్రీకరింపబడి, ఆ స్థలంలో ప్రచండమైన బ్రహ్మతేజస్సు ప్రజ్వలిత మౌతుంది. ఆ స్థలంలో కూర్చుంటే చాలు – అశాంతితో ఉన్న వ్యక్తులకు శాంతి లభిస్తుంది. ఈ ఆధ్యాత్మిక శక్తి స్థలాల నిర్మాణంలో ప్రతి గాయత్రీ ఉపాసకుడూ భాగం పంచుకోవాలి."

**ఏమి చేయాలి? ఎలా చేయాలి?** : ప్రతి గాయత్రీ సాధకుడూ తన సమీప క్షేత్రంలో వందమంది క్రొత్త సాధకులను మంత్రలేఖనంతో కలపాలి. ఒక్కొక్క ఇంట్లో ఇద్దరు సాధకులున్నా, 50 ఇళ్ళలో వందమంది సులభంగా కలుస్తారు. 24 వందల మంత్రాలున్న పుస్తకాలను ఇచ్చి వ్రాయించడం మొదలుపెట్టాలి. లేఖనం పూర్తయ్యాక పూర్ణాహుతిగా దీపయజ్ఞం చేయించి ప్రజ్ఞామండలిని ఏర్పాటు చేయాలి. దానిని తమ సమీపంలోని శక్తి పీఠంతోగానీ, ప్రజ్ఞాపీఠంతోకాని కలపాలి. మంత్రలేఖన పుస్తకాలను శక్తిపీఠంలో స్థాపించాలి. ప్రతి శక్తి పీఠమూ తన సమీప క్షేత్రంలోని 240 మంది సోదర, సోదరీమణులకు వంద, వంద కాపీలనిచ్చి 24 వేల సాధకులను తయారుచేయాలి. సంకల్పం పూర్తయ్యేవరకు అందరితో సంపర్కం ఏర్పరచుకుని వారిని ప్రోత్సహిస్తూ ఉండాలి.

మిషన్ సఫలత సుదృఢ సంఘటనా, సామూహిక సాధనలపై ఆధారపడి ఉంది. ఈ ఉద్దేశ్యం నెరవేర్చడానికి గాయత్రీ తపోభూమి, మథురలో 9 రోజుల, 40 రోజుల అనుష్ఠాన సాధనా శిబిరాలూ, హరిద్వార్‌లో సాధనా శిబిరాలు, యుగశిల్పి శిబిరాలూ జరుపబడు తున్నాయి. శక్తిపీఠాలూ, ప్రజ్ఞాపీఠాల్లో కూడా అనుష్ఠాన సాధనా

**యోగ మాత్మ విశుద్ధయే – యోగం ఆత్మ శుద్ధికి సాధనం.**

శిబిరాలను నడిపే వ్యవస్థ చేయాలి.

**(2) భావవిప్లవం కొరకు దీపయజ్ఞాలు** : పరమ పూజ్య గురుదేవులు దీపయజ్ఞ పరంపరను విశేషంగా భావ విప్లవం, జ్ఞాన యజ్ఞాల కొరకు ప్రారంభించారు. ఇది దీపావళిలాగ మనోరంజన కార్యక్రమం కాదని పరిజనులు తెలుసుకోవాలి. దీపయజ్ఞం జ్ఞానయజ్ఞం కోసమే జరగాలి. ఎక్కడైనా పేటల్లో కానీ, గ్రామాల్లోకానీ, కాలనీలల్లో కానీ మొదటి సారిగా 25, 51, 108 సాధకులను మంత్రలేఖనం ద్వారా కలపాలి. తర్వాత సాధకులకు వారి వారి ఇళ్ళ నుండి 5 దీపాలను, 5 అగరబత్తులను తీసుకొనిరమ్మని ఒక సార్వజనిక స్థలమందు పూర్ణాహుతి చేయించాలి. సాధకుల ఇళ్ళలో జ్ఞానమందిరాలను స్థాపించి వారిని మిషన్ పత్రికలకు చందాదారులుగా చేయాలి. చూడడానికి వచ్చిన వారికి చిన్న పుస్తకాలను ప్రసాదంగా పంచాలి. దీపయజ్ఞపు వేదికనుండి యుగ సాహిత్యం, స్వాధ్యాయాలను గురించి ప్రేరణ కల్గించాలి.

**(3) అంశదానం, సమయదానం** : ఇప్పుడు మిషన్ కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. భావనాశీల పరిజనుల సహకారంతోనే ఈ కార్యాలు పూర్తి చేయబడతాయి. అంశదానంవల్ల వచ్చిన ధనాన్ని జ్ఞాన యజ్ఞాలకు వినియోగించాలి. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయాన్ని, పుస్తకాల ప్రచురణను దృఢతరం చేయడానికి మిషన్‌కు ఆర్థిక సహకారం అవసరం. భావవిప్లవ ఉద్యమం సఫలం కావడానికీ, సాహిత్య వితరణకు ధనం అవసరం. కుటుంబ అవసరాలు ఎక్కువైనపుడు అనవసరపు ఖర్చులను తగ్గించుకొని శ్రమచేసి ఇతరుల సహకారాన్ని ఎలా కోరు కుంటారో – అదేవిధంగా పరిజనులు ఆర్థిక సహకారాన్ని అందించాలి. కార్యక్రమాలను గురించి వివరిస్తూ సమాజంలోని దాతలనుండి ధనాన్ని సేకరించాలి. శుభ కార్యాలలో, శ్రద్ధాంజలి సమయాలలో అంశదానానికి ప్రేరణ ఇవ్వాలి. 14 సూత్రాల కార్యక్రమం కోసం సమయదానం ఇవ్వడం మిషన్ సభ్యులకు తప్పనిసరి.

**(4) పత్రికల విస్తరణ** : క్రొత్త సాధకులకు 14 సూత్రాల కార్యక్రమం గురించిన వివరణ, ప్రేరణ, ప్రోత్సాహం కలిగించాలి. ఇందుకోసం మన పరిజనులు అఖండజ్యోతి, యుగ నిర్మాణయోజన, యుగ శక్తి గాయత్రి పత్రికలకు చందాదారులను తప్పక చేర్పించాలి. ప్రతి పాఠకుడూ తన పత్రికను 10 మందిచేత చదివించాలని విజ్ఞప్తి చేయాలి.

**(5) జ్ఞాన యజ్ఞ ప్రచారం** : పూజ్య గురుదేవు లిలా వ్రాశారు – "ఆలోచనల సంస్కరణ వల్లనే నవయుగం వస్తుంది. విప్లవం అనేది ఆయుధాలద్వారా, రక్తపాతం ద్వారా రాదు. సదాలోచన ప్రతిష్ఠాపన ద్వారా నవనిర్మాణం సంభవ మౌతుంది."

పూజ్య గురుదేవుల ఈ అభిమతం ఆధారంగా వారి భావధారను జనుల వద్దకు చేర్చడానికి ఇష్టపడేవారు తమ పేరు, పూర్తి చిరునామా, ఇతర వివరాలను పంపి జ్ఞాన యజ్ఞ ప్రచారంలో తమ పేరు నమోదు చేయించాలి. వారు ప్రతినెలా ఒక వంద చిన్న పుస్తకాలను తెప్పించుకొని వాటిని అమ్మడం లేదా పంచి పెట్టడం చేయాలి. పది మంది జ్ఞాన యజ్ఞ ప్రచారకులు కలిసి భారీయెత్తున సాహిత్యాన్ని తెప్పించుకోవచ్చు.

**(6) ప్రజ్ఞాపురాణ కథల ద్వారా జనజాగరణ** : దేవ సంస్కృతి కథాసంకీర్తనలనే ఈ గంగను ఇంటింటా, వాడ వాడలా చేర్చే బాధ్యతను యుగ భగీరథులు పూర్తి చేయాలి. ఇందుకోసం 7 రోజుల జ్ఞాన యజ్ఞ సప్తాహకథ 7 ప్రకారణాలుగా ఒక అనుపమ గ్రంథం 'ప్రజ్ఞాపురాణ కథామృతం' రచించబడింది. ఈ గ్రంథంలో ప్రతి నిత్యమూ జరిగే కర్మకాండల విధి కూడా ఇవ్వబడింది. ఈ గ్రంథాన్ని స్వాధ్యాయంచేసి ఎవరైనా సరే ఈ కథలను వినిపించడంలో సఫలులౌతారు. గాయకులు, వాద్యనిపుణులు గ్రామాల్లో ఉంటారు. వారి చేత కొన్ని రోజులు అభ్యాసం చేయిస్తే ప్రజ్ఞా పురాణ కథల బృందం తయారవుతుంది. ప్రజ్ఞాపుత్రులూ, పరివ్రాజకులూ, అధ్యాపకులూ, సోదరసోదరీమణులూ ఒక్కొక్కరు పదిమంది చొప్పున 2 లక్షల మంది ప్రచారకులు 20 లక్షల గ్రామాల్లో, ఇళ్ళలో ప్రజ్ఞాపురాణ గంగను చేర్చడంలో సఫలీకృతు లౌతారు. స్వాధ్యాయ పరంపరను నడపడానికి ఇంటింటా ప్రజ్ఞాపురాణ స్థాపన జరగాలి.

**(7) వానప్రస్థ పరంపరను దృఢతరం చేయడం** : యుగాన్ని సర్వనాశనంచేసే రాక్షసులను ఎదుర్కోగల లోకసేవకులు ఎక్కువ సంఖ్యలో ముందుకు రావాలి. వయోవృద్ధులు తమ జీవితాన్ని లోకకల్యాణంకోసం వినియోగించడానికి తత్పరులయితే ఆ సృజనాత్మక సేవ ద్వారా మానవులలో దేవత్వం, భూమిపైన స్వర్గావతరణ అనే కలలు నిజమవుతాయి. మన యుగ నిర్మాణ సఫలతకోసం గృహస్థులు స్వార్థాన్ని వదలి విశ్వమానవ ఉజ్వల భవిష్యత్తు కొరకు అంకితం కావాలి. మన పరిజనులు వృద్ధులతో సమావేశం ఏర్పరచికాని, వ్యక్తి గతంగా కలుసుకొని కాని వానప్రస్థ జీవన ఔన్నత్యాన్ని తెలియ పరచాలి. సమాజ సేవ చేయడానికి ఇష్టపడేవారు వారి పూర్తి వివరాలు, పరిచయం మొదలైన వాటిని మథురకు పంపిస్తే వారందరి వివరాల పట్టికను తయారు చేసి వారందరినీ మథురకు పిలిచి వారివారి యోగ్యత, అభిరుచుల ప్రకారం సమాజ సేవకోసం వారి సహకారం తీసుకోవడం జరుగుతుంది. సూచికలో వారి పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నంబరు, విద్యార్హత, పూర్వం వారు చేపట్టిన వృత్తి, ఇప్పుడేం చేస్తున్నదీ, దేనియందు అభిరుచి ఉన్నదీ వివరంగా వ్రాసిపంపాలి.

**(8) ఉత్తర ప్రత్యుత్తర కార్యక్రమ విస్తరణ** : గురుకులాలు, ఆరణ్యకాలు లేనందువల్ల యువకులకూ, గృహస్తులకూ జీవించే కళా, సరైన వ్యవహారిక మార్గదర్శనం లభ్యం కావడం లేదు. హరిద్వార్‌లోని శాంతికుంజ్ ఒక ఆరణ్యకము. అచ్చటికి వెళ్ళి మార్గదర్శనం పొందాలంటే అందరికీ సాధ్యం కాదు. అందుకని గాయత్రీ తపోభూమి మథుర నుండి జీవించే కళ, ఆరోగ్య అభివృద్ధి గురించి ప్రచార పాఠ్య ప్రణాళిక ప్రారంభమైంది.

**పురాణమిత్యేవ న సాధు సర్వం – పాతది ప్రతిదీ మంచిది కాదు.**

**(9) విద్యావిస్తరణ కేంద్రాల పునర్నిర్మాణం** : పూజ్య గురుదేవుల సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ విస్తరింప చేయుటకు పరిజనులు విద్యా విస్తార ప్రచార కేంద్రాలను నమోదు చేయించారు. కేవలం నమోదు చేయించినంత మాత్రాన గురుదేవుల ఆకాంక్ష నెరవేరదు. కనుక ప్రచారకేంద్రాన్ని యుద్ధప్రాతిపాదికపై క్రియాన్వితం చేసి గురుదేవుల ఆదర్శాలను ఇంటింటా విస్తరింప చేయాలి. ఏవైనా కారణాలవల్ల విద్యావిస్తారణ కేంద్రాలు నడపలేక పోతే తమ వందరూపాయల సాహిత్యాన్నీ, రిజిస్ట్రేషన్ పత్రాలను వాపస్ పంపి డబ్బు తెప్పించుకోగలరు. ఇందువల్ల జాగృత కేంద్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయ వీలవుతుంది. ప్రస్తుతం రిజిష్టరయి పనులు చేస్తున్న విద్యావిస్తార ప్రచార కేంద్రాలు తమ ప్రగతిని గురించిన సమాచారం పంపుతూ ప్రతినెలా నిర్ధారిత సాహిత్యాన్ని తెప్పించుకోగలరు. జాగృత కేంద్రాలను క్రొత్తగా రిజిష్టరు చేయవచ్చు.

**(10) గాయత్రీ జ్ఞానమందిరాల స్థాపన** : స్వాధ్యాయ పరంపరను కొనసాగించడానికి ప్రతి ఇంట్లో యుద్ధప్రాతిపదికన గాయత్రీ జ్ఞాన మందిరాన్ని స్థాపించాలి. ఆసక్తి కలవారితో జ్ఞానమందిరాల స్థాపన, బ్రహ్మభోజ్ అనుదానంతో, సాహిత్యాన్ని సగంధరకు విక్రయించడానికి నిర్ణయం తీసుకోవాలి. విచారశీల పరిజనులు, వానప్రస్థ శాఖలూ, శక్తిపీఠాలూ ఎక్కువ మొత్తంలో సాహిత్యం సెట్లను తెప్పించుకొని, స్కూళ్ళల్లో జ్ఞాన మందిర సెట్‌ను స్థాపించే ప్రయత్నం చేసి గురుదేవుల ఆదర్శాలను జనులందరివద్దకూ చేర్చడంలో సఫలీకృతులు కావాలి.

**(11) మహిళా సంఘటన** : నారీ జాగరణ ఉద్యమాన్ని అత్యంత వేగంతో వ్యాపింప చేయాలి. సమాజంలో స్త్రీలు అన్నింటిలో అగ్రగాములుగా ఉండగలరు. వారు సఫలీకృతులు కావాలంటే పురుషుల సహకారం అత్యంత అవసరం. పురుషుల తరఫునుండి వారికి సహకారం, ధనం, మార్గ దర్శనం లభించాలి. విద్య, ఆరోగ్యం, స్వావలంబన కార్యక్రమాలకొరకు మహిళా వర్గంలో యోగ్యత, కార్యదక్షత పెంపొందించడం అవసరం.

**(12) యువమండలుల ఏర్పాటు** : యువకులను స్వావలంబులుగా, విద్యావంతులుగా, గుణవంతులుగా, శీలవంతులుగా, శ్రమ శీలురుగా రూపొందించాలి. సాధకులుగా తయారుచేయాలి. సదాలోచన, స్వాధ్యాయములలో వారి అభిరుచిని పెంచాలి. యువశక్తియే దేశశక్తి. వీరందరూ భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, వివేకానంద, పరమపూజ్య గురుదేవులను ఆదర్శంగా తీసుకొని భరతమాత సేవ చేయాలి. యువకులు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగ పరచుకుంటే భారతదేశం ప్రపంచంలో సర్వశ్రేష్ఠ మౌతుంది. దుర్వ్యసనాలకు వ్యతిరేకంగా యువకులు ఆందోళన జరపాలి. యువకులకూ, విద్యార్థులకూ శిక్షణా శిబిరాలు గాయత్రీ తపోభూమి మథురలో నిర్వహించ బడుతున్నాయి.

**(13) యుగసేన సమీకరణ** : యుగసేనలు ఎక్కడెక్కడ ఉన్నదీ, ఏఏ కార్యక్రమాలు నడుపుతున్నదీ, ఎంతమంది సభ్యులున్నదీ, ప్రస్తుతం సేనానాయకులెవరన్నదీ వివరాలను మిషనుకు పంపాలి. మిషన్ పత్రికలన్నీ సైనికుల వద్దకు రావాలి. దీనివల్ల మిషన్ కార్యక్రమాలు వారికి తెలుస్తుంటాయి. సైనికులందరూ నియమిత సాధన చేయాలి. వారందరూ క్రియాశీలురై వంద వంద క్రొత్త సాధకులను చేర్పించాలి. ప్రతి సైనికుడూ ఇంటిలో జ్ఞానమందిర స్థాపన చేసి స్వాధ్యాయ పరంపరను ప్రారంభించాలి. తమ ఆదాయంనుండి కొంత సొమ్ము జ్ఞానయజ్ఞం కొరకు కేటాయించాలి. ఏడుసూత్రాల ఆందోళనను యుగసేనలోని వారందరూ ప్రారంభించాలి – 1.సాధన, 2.ఆరోగ్యం, 3.విద్య, 4.స్వావలంబన, 5.దుర్వ్యసనాల నుండి విముక్తి, 6.పర్యావరణం, 7.మహిళాజాగరణ.

**(14) జ్ఞాన యజ్ఞాల విస్తరణ** : గురుదేవులిలా వ్రాశారు – "మన మొత్తం శక్తి మన ఆలోచనలలో నిబిడీకృతమై ఉంది. ప్రపంచాన్ని మార్చాలన్న సంకల్పం ఏవేవో సిద్ధులతో కాక, శక్తివంతమైన ఆలోచనల ద్వారా నెరవేరుతుంది. మా ఆదర్శాలను విస్తృతం చేయడానికి మాకు సహాయం చేయండి. విద్యావంతుల వద్దకు మా వాణిని తీసుకొని వెళ్ళండి. మాలో రగులుతున్న భావాగ్నిని అందరి వద్దకు తీసుకు వెళ్ళండి. మనం క్రొత్త భావాలను సృష్టించాం. పరిజనులు వాటిని జనులందరి మనస్సులలో చేర్చే ప్రయత్నం చేయాలి. చదువుకున్న వారి చేత చదివించండి. చదువురాని వారికి వినిపించండి. ఈ విచారక్రాంతి ప్రతి ఒక్కరి అంతఃకరణలో రగుల్కొంటుంది. ఈ క్రాంతి ప్రచండజ్వాల అవుతుంది."

పూజ్య గురుదేవుల ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చడానికి మనమంతా కలసి క్రింద ఉదహరించిన కార్యక్రమాలు నడపడానికి ఆత్మ చింతనతో క్రియాశీలురు కావాలి – 1.సంచార జ్ఞానమందిరం, 2.శ్రీరామ్ ఝోలా పుస్తకాలయం, 3.మాతా భగవతీ స్వచాలక పుస్తకాలయం, 4.గోడల మీద వ్రాయించడం, స్టిక్కర్ల ఉద్యమం, 5.కానుకలుగా సాహిత్యాన్ని పంచడం, 6.బహుమతులుగా సాహిత్యాన్ని పంచడం, 7.నిరుద్యోగులూ, సమయాన్ని వినియోగించగలవారి చేత ఉత్సవాలలో, తిరునాళ్ళలో, ఇతర కార్యక్రమాల్లో సాహిత్యాన్ని అమ్మడం, 8.సాహిత్య ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం, 9.అంశదానం చేయగలిగే వారిద్వారా సాహిత్య వితరణ చేయించడం, 10.స్వాధ్యాయ మండలాల స్థాపన, 11.పెద్ద పెద్ద కార్యక్రమాల్లో, యజ్ఞాలలో ప్రసాదరూపంలో సాహిత్యాన్ని పంచడం. స్థానిక పరిస్థితుల కనుగుణంగా వేర్వేరు పద్ధతుల ద్వారా పూజ్య గురుదేవుల సందేశాన్ని ప్రతి ఒక్కరికీ తెలియచేస్తూ మనమందరమూ భావవిప్లవ ఉద్యమంలో క్రియాశీలురమై సఫలతను సాధించాలి.

అనువాదం : కె.అరవిందమ్మ

**లోభః పాపస్య కారణమ్ – లోభమే పాపానికి మూలం.**

## శాంతికుంజ్ సమాచారం

# పరమశివుడు పూర్ణ చైతన్యం

**- డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ**

పరమశివుడు పూర్ణ చైతన్యం. ఆయన సర్వజ్ఞుడు. అందరికీ కళ్యాణాన్ని కలిగించడంలో ఆయన సదా నిమగ్నుడై ఉంటాడు. ఆకాశంవలె ఆయన సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. నేడు సమాజంలో అంతటా అశివత్వం, అశుభం విస్తరించి ఉన్నాయి. దానిని తొలగించి శివ తత్వాన్ని స్థాపించాలి. అప్పుడే మన జాతి జగద్గురు గౌరవాన్ని తిరిగి పొందుతుంది. తన మనసునుండి స్వార్థ భావనను పెకలించివేసి పరోపకార మనస్తత్వాన్ని స్థాపించిన వ్యక్తియే నిజమైన శివభక్తుడు. మన మనసులో ఆ పరోపకార భావన ఉన్నప్పుడు మనం మన ఆత్మీయులకు ద్రోహం తలపెట్టలేము. శివరాత్రి వ్రతం రోజున మనం ఈ సన్మార్గాన్ని అవలంబిచకపోతే, వ్రతాలు పూజలూ బాహ్యాడంబరాలుగా మిగిలిపోతాయి.

- అని దేవసంస్కృతి విశ్వవిద్యాలయం కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో స్థాపించిన ప్రజ్ఞేశ్వర మహాదేవుని ఆలయం ప్రథమ వార్షికోత్సవంలో ప్రసంగిస్తూ ఉద్బోధించారు.

అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ప్రముఖులు శ్రద్ధేయ శైల దీదీ ప్రసంగిస్తూ, మహాదేవుని కృపకు పాత్రులు కావాలంటే మనం దానం, తపస్సు, నిస్వార్థమైన దరిద్రనారాయణ సేవ చేయాలని హితవు చెప్పారు.

అంతకుముందు శాంతికుంజ్ నుండి సాగిన భవ్య కలశయాత్రలో 51 మంది కన్యలు పవిత్ర గంగాజలాన్ని ప్రజ్ఞేశ్వర మహాదేవ ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం శివాభిషేకం జరిగింది.

వేదవిభాగ అధ్యక్షులు పండిత చంద్రభూషణమిశ్ర ప్రసంగిస్తూ, పరమ శివుని స్థూల స్వరూపం శివలింగమనీ, సూక్ష్మ స్వరూపం ప్రణవం (ఓంకారం) అనీ వివరించారు.

## ఒక నవ్య విప్లవం తెస్తుంది.
## దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం.

**- స్వామి ద్వారికేశ లాలాజీ మహరాజ్**

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ఒక నవ్య విప్లవం తెస్తుంది. ఆధ్యాత్మవాదంతోపాటు బుద్ధిని ఆర్ద్రంచేసి జీవితాన్ని సార్థకం చేస్తుంది. విశ్వవిద్యాలయంలోని ప్రాధ్యాపకులూ, విద్యార్థులూ ఎంతో అదృష్టవంతులు.

- అని వల్లభాచార్య వైష్ణవ సంప్రదాయ పీఠాధిపతి స్వామి ద్వారికేశ లాలాజీ మహరాజ్ ఇటీవల విశ్వవిద్యాలయ విద్యార్థులను సంబోధిస్తూ పేర్కొన్నారు.

వారింకా ఇలా అన్నారు -

ప్రాచీన గురుకుల సంప్రదాయాన్నీ, ఆధునిక విద్యనూ సమన్వయం చేసే అద్భుత కృషిని నేను నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. గాయత్రీ తీర్థం, ఈ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కార్యక్రమాలు నన్ను పరవశింపజేశాయి. వీటివల్ల సమాజానికేకాక మొత్తం విశ్వానికి కొత్త దిశ లభిస్తుంది.

గాయత్రీ పరివార్ కార్యకలాపాలనూ, వైష్ణవ సంప్రదాయాన్నీ జోడించి పనిచేయలనే కోరికనూ, తమ యువ కార్యకర్తలకు శాంతికుంజ్‌లో విశేష ప్రశిక్షణ ఇప్పించాలనే కోరికనూ ఆయన తమ ప్రసంగంలో వ్యక్తం చేశారు.

విశ్వవిద్యాలయం కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ ప్రసంగిస్తూ, మానవీయ సంవేదనలపట్ల విశ్వాసం సన్నగిల్లుతూన్న ఈ తరుణంలో అధ్యాత్మ విజ్ఞానములను సమన్వయపరచే ధార్మిక వ్యవస్థ అత్యవసరమని అన్నారు.

స్వామీజీతోపాటు 50 మంది శిష్యులు శాంతికుంజ్ వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. శాంతికుంజ్ ప్రముఖ కార్యకర్తలు, వల్లభాచార్య సంప్రదాయం ప్రతినిధులు గోసేవ, నిర్మాణాత్మక కార్యక్రమాలు మున్నగు అంశాలపై విస్తృతమైన చర్చ జరిపారు. ఆయా రంగాలలో కలసి పనిచేయాలని నిర్ణయం జరిగింది.

## గురుదేవుల సందేశం నవయుగ భగవద్గీత

**- శ్రీమతి వసుంధరా రాజే**

పూజ్య ఆచార్యశ్రీ పండిత శ్రీరామ శర్మగారి చింతన నేటి యుగానికి గీతా సందేశం.

- అని రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీమతి వసుంధరా రాజే ఇటీవల జయపూర్‌లో అన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టినందుకు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ తమకు పంపిన అభినందన పత్రాన్ని స్వీకరిస్తూ ఆమె అలా అన్నారు. గాయత్రీ పరివార్ వారి నిర్మాణాత్మక కార్యక్రమాల అమలులో పూర్తి సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. శాంతికుంజ్ విచ్చేయవలసిందిగా పంపిన ఆహ్వానాన్ని అందుకుని, ఆమె తప్పక వస్తామన్నారు.

జయపూర్‌లోని శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీయుతులు వీరేంద్ర అగ్రవాల్, నరేంద్ర నిర్వాణ్, రణవీర్ చౌధరి, వీరేంద్ర కేడియా, బద్రీనారాయణ్ చౌధరి అభినందన పత్రంతో పాటు గాయత్రీ మహామంత్ర ఉత్తరీయాన్నీ, "ఋషి చింతన్‌కె సాన్నిధ్య మె" గ్రంథాన్ని ఆమెకు బహూకరించారు.

H H H

సంతృప్తి సహజ సంపద.

## వార్తలు

# కృతయుగ అవతరణకు దివ్య సాధనం గాయత్రీ యజ్ఞం

## కాగజ్‌నగర్ 108 కుండముల గాయత్రీ యజ్ఞంలో వివరణ

కృతయుగ అవతరణకు గాయత్రీ యజ్ఞం దివ్య సాధనమని శాంతికుంజ్ ప్రతినిధి డాక్టర్ ఎ.కె.దత్తా వివరించారు. కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్స్ క్రికెట్ మైదానంలో ఫిబ్రవరి 27, 28, 29 తేదీలలో జరిగిన గాయత్రీ యజ్ఞంలో మూడవరోజు పూర్ణాహుతిలో ప్రసంగిస్తూ ఆయన, మనిషిలో దైవత్వాన్ని నింపడంలో గాయత్రీయజ్ఞం మహత్తర పాత్ర నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మికత మూలమనీ, ధర్మం దానికి ఇరుసు అనీ వివరించారు. గాయత్రీ మంత్రాన్ని ఇంటింటికీ అందించే కృషిని గాయత్రీ పరివార్ ప్రపంచవ్యాప్తంగా ఒక మహోద్యమంగా నిర్వహిస్తున్నదని ఆయన తెలిపారు.

27 సాయంత్రం యజ్ఞ స్థలంలో డాక్టర్ తుమ్మూరి దీప ప్రజ్వలన జరపడంతో భవ్య కలశయాత్ర ప్రారంభమయింది. సిర్పూర్ పేపర్ మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె.ఖరే, వారి సతీమణి శ్రీమతి ఉషా ఖరే యాత్రకు ప్రారంభోత్సవం చేశారు. 1500 మంది మహిళలు కలశ యాత్రలో పాల్గొన్నారు. సర్‌సిల్క్ కాలనీ, రైల్వే కాలనీ, మెయిన్ రోడ్డుల మీదుగా సాగి కలశ యాత్ర తిరిగి యజ్ఞ స్థలానికి చేరుకున్నది. సాయంత్రం 3 గంటలకు ప్రారంభమైన కలశయాత్ర రాత్రి 7 గంటలవరకు సాగింది. గాయత్రీ మాత చిత్రపటాలు అలంకరించిన రథం ముందు సాగగా, మహిళలు కలశాలతో అనుసరించారు. పసుపు పచ్చని తోరణాలు, ఫ్లెకార్డులతో జరిగిన కలశ యాత్ర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది. ఎస్.పి.ఎమ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీ ఎమ్.పి.దుకానియా, వారి సతీమణి శ్రీమతి కుసుం దుకానియా, యజ్ఞనిర్వాహక కమిటీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి శ్రీ పి.డి.అగర్వాల్, కమిటీ సభ్యులు శ్రీయుతులు ఘనశ్యాం అగర్వాల్, కె.నారాయణ, బద్రినారాయణ రాజు, కె.బాబురావు, ఎస్.కె.శుక్లా, అఖిలేశ్వర్ సింగ్, ఏ.రాజేశ్వరరావు, జె.ఎన్.సింగ్, సిహెచ్.రవి, లక్ష్మి రెడ్డి, హరిశమచారి కలశయాత్రలో పాల్గొన్నారు.

28 ఉదయం వేదమంత్రోచ్చారణలమధ్య 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. ఒక్కొక్క పర్యాయం 600 దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. డాక్టర్ కె.పి.దత్తా, డాక్టర్ తుమ్మూరి, కర్నల్ గురుమూర్తి, శ్రీయుతులు కె.పి.విఠల్, జ్యోతి, మన్‌మోహన్ సింగ్‌లు యజ్ఞానికి ఆధ్వర్యం వహించారు. ఆదిలాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి, సిర్పూర్ మాజీ శాసనసభ్యులు శ్రీమతి పాల్వాయి రాజ్యలక్ష్మి, ప్రభుత్వ మాజీచీఫ్‌విప్ శ్రీ కె.వి.నారాయణరావు, ఎస్.పి.ఎమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీఎస్.కె.ఖరే వారి సతీమణి శ్రీమతి ఉషా ఖరే, కాగజ్‌నగర్ డి.ఎస్.పి. స్వామినారాయణ పవార్ యజ్ఞంలో పాల్గొన్నారు. వీరితోపాటు కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీ ఘనపురం శ్రీనివాస్, దహెగాం మండలాధ్యక్షులు శ్రీచిలువేరు సత్యనారాయణ, బెజ్జూర్ జడ్.పి.టి.సి సభ్యులు శ్రీపాల్వాయి సుధాకర రావు, కాగజ్‌నగర్ మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీకోనేరు కృష్ణారావు, రోటరీక్లబ్ అధ్యక్షులు డాక్టర్ దామోదరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కమల్ కిశోర్ బంగ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ పార్థసారథి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. నాటి సాయంత్రం భవ్య దీపయజ్ఞం జరిగింది.

29న యజ్ఞానికి పూర్ణాహుతి జరిగింది. డాక్టర్ తుమ్మూరి సప్త సూత్ర ఉద్యమాన్ని గురించి ప్రసంగించారు. వందలాది మందికి మంత్ర దీక్ష, వివిధ సంస్కారాలు ఇవ్వబడ్డాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కావేటి సాయిలీల పాల్గొన్నారు.

యజ్ఞంలో సుమారు 30,000 మంది పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొనే భక్తుల కోసం భారీ యెత్తున టెంట్లు వేసి, మంచినీటి సౌకర్యం, భోజనవసతి కల్పించారు. గాయత్రీ పరివార్ కార్యకర్తలతోపాటు ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు, శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు కార్యక్రమ నిర్వహణలో సహాయ సహకారాలు అందించారు.

## పార్వతీపురంలో సంస్కార దీపయజ్ఞం

పార్వతీపురంలోని గాయత్రి మహిళా డిగ్రీకళాశాలలో ఉన్న గాయత్రీ ధ్యాన మందిరంలో ఫిబ్రవరి 6న మాఘ పూర్ణిమ సందర్భంగా సంస్కార దీపయజ్ఞం జరిగింది. ఆ సందర్భంగా వివాహదిన, పుంసవన, జన్మదిన సంస్కారాలు ఇవ్వబడ్డాయి. 80 మంది పాల్గొన్నారు.

జనవరి 27న కుసుమ హరినాథ్ పుణ్యక్షేత్రంలో జరిగిన దీపయజ్ఞంలో 25మంది పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో జనవరి 26న, జనవరి 7న దీపయజ్ఞాలు జరిగాయి.

ఫిబ్రవరి 19న మహాశివరాత్రి సందర్భంగా జరిగిన దీపయజ్ఞంలో 39మంది పాల్గొన్నారు.

**నాస్తి మోహసమో రిపుః - మోహాన్ని మించిన శత్రువు లేదు.**

# యువతరానికి అందిద్దాం సంస్కృతీ సౌరభాన్ని

**– రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ ఐ.వి.సుబ్బారావు**

నేటి యువతరానికి భారతీయ సంస్కృతి సౌరభాన్ని అందించడం అత్యవసరమని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ ఐ.వి.సుబ్బారావు ఉద్బోధించారు. హైదరాబాదు రవీంద్రభారతిలో ఫిబ్రవరి 21న భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలో విజేతలకు రాష్ట్రస్థాయి బహుమతులు ప్రదానం చేస్తూ వారింకా ఇలా అన్నారు -

ఈ పరీక్ష విద్యార్థుల ప్రవర్తనలో ఆశించదగిన మార్పు తీసుకువస్తుంది. వైజ్ఞానిక దృక్పథం, ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం - వీటిని అలవరచుకుంటే విద్యార్థులు ఘన విజయాలు సాధించగలరు.

బహుమతి ప్రదాన సభకు అధ్యక్షత వహించిన శ్రీ అశ్విని సుబ్బారావు తమ ప్రసంగంలో సంస్కారాలను పునరుద్ధరించ వలసిన అవసరాన్ని నొక్కిచెప్పారు. వానప్రస్థ ఆశ్రమాన్ని తిరిగి నిర్మించేందుకు గాయత్రీ పరివార్ కృషి చేస్తూన్నదని వారు తెలిపారు.

డాక్టర్ తుమ్మూరి ప్రసంగిస్తూ, పరీక్ష కోసం చదివిన విషయాలను జీవితంలో ఆచరణలో పెట్టాలని బహుమతి గ్రహీతలకు హితవు చెప్పారు. తమ తమ విద్యాలయాలలో సంస్కృతి మండలులు ఏర్పాటు చేయాలని వారు విద్యార్థులకు సూచించారు.

శ్రీమతి జి.సత్యవాణి ప్రసంగిస్తూ, సాంస్కృతిక, మానవతా విలువలు దిగజారిపోతూన్న ఈ తరుణంలో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షలు ఆ విలువలను యువతరానికి అందిస్తున్నాయని ఉద్ఘాటించారు.

ఎమ్.ఎన్.ఆర్ ట్రస్టు చైర్మన్ శ్రీ ఎమ్.ఎన్.రాజు, పదవీ విరమణ చేసిన ఐ.ఏ.ఎస్ అధికారి శ్రీ టి.వెంకారెడ్డి, న్యాయవాది శ్రీ శ్రీనివాసరెడ్డి బహుమతి గ్రహీతలకు ఆశీస్సులు అందించారు. తొలుత భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష రాష్ట్ర కన్వీనర్ శ్రీ బి.హనుమంతరెడ్డి పరీక్షల నిర్వహణ గురించి వివరించారు.

ముఖ్య అతిథి డా॥ ఐ.వి.సుబ్బారావు 30 మంది విజేతలకు నగదు, మెరిట్ సర్టిఫికెట్, కప్పు, యుగ సాహిత్యం ప్రదానం చేశారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన శ్రీమతి అరుణమ్మ, శ్రీయుతులు కె.డి.శ్రీనివాస్ లకు ప్రశంసాపత్రాలు అందజేయబడ్డాయి. పిడుగురాళ్ల, గుడివాడ, మహబూబ్‌నగర్ జిల్లాలకు షీల్డ్‌లు ప్రదానం చేశారు. శ్రీమతి భారతీ ఖండేల్వాల్ వందన సమర్పణ చేశారు.

H H H

## నేతాజీ సమయస్ఫూర్తి

సాహసం అనేది ఉంటే ప్రతికూల పరిస్థితులలో కూడా సంతులనాన్ని కోల్పోకుండా పనులు సాధించవచ్చు.

సుభాష్‌చంద్ర బోసు మొదటి తరగతి పెట్టెలో పయనిస్తూ ఉండగా ఆ కదిలే బండిలోకి హఠాత్తుగా ఒక విదేశీ మహిళ ఎక్కి "నీ దగ్గరున్న విలువైనవన్నీ నోరు మూసుకొని నాకిచ్చేయి. లేదా గోలచేసి నీవు నన్ను అల్లరిపెడుతున్నావని చెప్పి అందరిముందు నిన్ను అప్రతిష్ఠ పాలు గావిస్తాను'' అని బెదిరించింది. క్షణాలలో గొప్ప నిర్ణయాలు తీసికోగల మేధస్సు, సమయస్ఫూర్తి కల్గిన బోసుకు వెంటనే ఆమె ఎత్తుగడ ఏమిటో అర్థమైంది. చెవిటివానిలా బ్రహ్మాండంగా నటించసాగేడు. తనకేమీ అర్థం కావటంలేదని దయఉంచి మీరు చెప్పేదేమిటో కాగితం మీద వ్రాసి ఇమ్మని వినయంగా కోరేడు. ఆమె ఆతృత వల్ల బధిరుని మాటను గట్టిగా విశ్వసించి ఏమాత్రం సందేహించకుండా ఆ విషయం కాగితం మీద వ్రాసి చేతిలో పెట్టింది. అంతే. బోసు పకపకా పెద్దగా నవ్వసాగేడు. సాక్ష్యాధారాలతో సహా ఆమె మోసం అతని గుప్పెటలో ఉండటం వలన ఆమె అరవాలన్నా అరవలేదు. ఈ మహా పురుషుడు తన చాకచక్యం, మైధాశక్తి ద్వారా ఎంత దారుణమైన మోసాన్నైనా ఇలాగే క్షణంలో చిత్తుచేసి పడేసేవాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ఆడంబరం కృత్రిమ దారిద్ర్యం.**